10-3Pg1exHMNWJQE.qxd:10-3Pg1exHMNWJQE.qxd 01/01/01 10:22 AM Page 1

WWW.VAARTHA.COM
epaper.vaartha.com

ఒంగోలు

10-3-2025 సోమవారం
సంపుటి: 31 సంచిక: 37
పేజీలు: 12 వెల: 6.50

: fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

# భారత్ 'ఛాంపియన్'

## ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ
## మూడోసారి సాధించిన టీమిండియా

నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం

వరుసగా రెండు ఐసిసి టైటిల్స్ నెగ్గిన రోహిత్ సేన

దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల సంబరాలు




ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీతో టీమిండియా సంబరాలు



ట్రోఫీని ముద్దాడుతున్న మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రోహిత్ శర్మ

**దుబాయి, మార్చి 9:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని టీమిండియా చేజిక్కించుకుంది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో 252 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిత 50 ఓవర్లలో మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల తేడాతో టీం ఇండియా ఛేదించింది. ఆరు వికెట్లు కోల్పోయి 256 పరుగులుచేసింది. 252 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఓపెనర్లు రోహిత్‌శర్మ, శుభ్‌మన్‌గిల్ తొలి వికెట్ భాగస్వామ్యానికి 105 పరుగులు తెచ్చారు. 105 పరుగుల వద్ద మిఛేల్ శాంట్నర్ బౌలింగ్‌లో పిలిప్స్‌కు శుభ్‌మన్‌గిల్ క్యాచ్ ఇచ్చిపెవిలియన్ బాటపట్టాడు. వన్‌బౌన్ బ్యాట్స్ మాన్‌గా వచ్చిన కోహ్లీ బ్రేస్ వాల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యు కావడంతోక్రీజును వదలాల్సివచ్చింది. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి రోహిత్‌శర్మ జట్టు స్కోరు చకచకా పెంచడానికి ప్రయత్నించారు. ఈ తరుణంలో 122 పరుగులవద్ద రోహిత్‌శర్మ ఔట్ కావడంతో టీమ్ ఇండియా మూడు వికెట్లుకోల్పోయింది. శ్రేయాస్ అయ్యర్, 29 పరుగులవద్ద, అక్షర్‌పటేల్ >>2



బీద రవిచంద్ర



కావలి గ్రీష్మ



బిటి నాయుడు

# ముగ్గురు టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు

కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బిటి నాయుడు ఎంపిక

జనసేన నుంచి బరిలో నాగబాబు

బిజెపికి మరో సీటు పంపకం

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ముగ్గురు అభ్యర్థుల పేర్లను తెలుగు దేశం పార్టీ ప్రకటించింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కావలి గ్రీష్మ, బీదా రవిచంద్రతోపాటు బిటి నాయుడు పేర్లను ఆదివారం సాయంత్రం ఆ పార్టీ ప్రకటించింది. టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు స్వయంగా అభ్యర్థుల వివరాలను అధికారిక ప్రకటనలో వెల్లడించారు.ఆ పార్టీ మొత్తం మూడు స్ధానాలకు పోటీ చేస్తోంది.మొత్తం ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ సీట్లల్లో జనసేన ఒకటి కేటాయించారు.నాలుగు స్ధానాలకు టిడిపి పోటీ చేస్తోందని భావించారు. అనుహ్యంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బిజెపికి ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయిస్తూ టిడిపి నిర్ణయం తీసుకుంది. మొత్తం 5 స్థానాలకుగానూ ఇప్పటికే జనసేనకు ఒక సీటు కేటాయించగా చివరి నిమిషంలో బిజెపి పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో ఆ పార్టీకి ఒక సీటు కేటాయించినట్టు తెలుస్తోంది. ఈసారి బిజెపికి సీటు ఇచ్చినందున సర్దుబాటు చేయలేకపోతున్నామని, 2027లో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఖాళీలు ఏర్పడుతు >>2

# ఇక ఐదుబడుల విధానం

- పాఠశాల విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలు అమలు
- కొత్తగా ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు
- అక్షరాస్యత శాతం పెంచేందుకే తాజా మార్పులు
- వచ్చే విద్యాసంవత్సరం నుండి అమలు: సిఎం చంద్రబాబు




**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలను అనుసరించి పాఠశాల విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలు అమలులోకి రానున్నాయి. విద్యారంగంలో తాము తీసుకుని వచ్చే మార్పులతో ప్రభుత్వ బడుల్లో అక్షరాశ్యతశాతం గణనీయంగా పెరుగుతుందని సిఎం చంద్రబాబు ప్రకటించారు. సిఎం చంద్రబాబు ఆలోచనా విధానానికి అనుగుణంగా విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో పాఠశాల విద్యావ్యవస్థలో మార్పులకు అధికార యంత్రాంగాన్ని సమయాత్తం చేసారు.ఈ క్రమంలో రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు రకాల బడుల విధానం అమల్లోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. విద్యాశాఖ అందించిన సమాచారాన్ని అనుసరించి 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఈ విధానం అమలు చేస్తారు. ప్రస్తుతం ఉన్న ఆరురకాల బడులస్థానంలో ఇది అమల్లోకి రానుంది. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క స్కూల్‌ను కూడా మూసి వేయకుండానే ఈ విధానాన్ని విద్యాశాఖ అమలు చేయనుంది. దీంతో పాటు కొత్తగా ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు, విద్యార్థుల నమోదు, మౌలిక సదుపాయాల ఆధారంగా, క్లస్టర్ స్థాయి కమిటీ సహాయంతో ఈ బడులను గుర్తించ నున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా విభజించనున్నారు. శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలుగా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రాలు నడవనున్నాయి. వీటిల్లో పూర్వ ప్రాథమిక విద్యఅయిన ఎల్‌కేజీ, యూకేజీ బోధించనున్నారు. ఫౌండేషన్ బడుల్లో పిపి1, పిపి2, ఒకటి, రెండు తరగతులను బోధిస్తారు. ఆ తర్వాత బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో పిపి1,2తోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఉంటాయి. ఇక్కడ విద్యాహక్కు చట్టం ప్రకారం 20 లేదా 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులను కేటాయిస్తారు. ఆదర్శ బడులు ఏర్పాటు చేయడానికి వీలు లేని చోట వీటిని కొనసాగించనున్నారు. గ్రామ పంచాయతీ, పుర, నగరపాలక సంస్థల్లో వార్డుకు ఒకటి చొప్పున ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న బడులుంటే రెండేసి సైతం ఏర్పాటు చేస్తారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 45 మంది ఉన్నా వీటిని కొనసాగిస్తారు. ఇందులో ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున నియమించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 12,000లకు పైగా ఏకోపాధ్యాయ బడులున్నాయి. ఇక్కడ 18 సబ్జెక్టులను ఒక్కరే బోధించాల్సి వస్తోంది.

ఫౌండేషన్ స్థాయిలో అభ్యసన సామర్థ్యాలు దెబ్బతింటున్నట్లు సర్వేలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఒక్కో తరగతికి ఒక టీచర్ ఉండే ఆదర్శ బడుల విధానం స్టూడెంట్స్‌కి ప్రయోజనం కల్పిస్తుంది.ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో పపి 1,2తో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఉంటాయి. ఇక్కడ కనీసం 60 మంది విద్యార్థులు ఉండాలి. కొన్ని పరిస్థితుల్లో 45 మంది అంతకంటే తక్కువ ఉన్నా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు. గత ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు తరలించిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకురానున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఆమోదంతో ఏర్పాటు చేసిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో వీటిని విలీనం చేస్తారు. ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలు నిర్ణీత దూరం కంటే ఎక్కువ ఉంటే విద్యార్థులకు నెలకు 600 చొప్పున 10 నెలల పాటు రవాణా భత్యం చెల్లించనున్నారు. ఒకరు, ఇద్దరు విద్యార్థులున్న ఫౌండేషన్ బడులను సైతం కొనసాగిస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో 30 లోపు విద్యార్థులు ఉంటే వాటిని ప్రాథమిక బడులుగా మార్పు చేయనున్నారు. 6,7,8 తరగతులను మూడు కిలోమీటర్లలోపు ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనంచేస్తారు. మూడు కిలో మీటర్లలోపు ఉన్నత పాఠశాల లేకపో >>2



# ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూత

వేలాది అన్నమాచార్య కీర్తనలకు స్వర కల్పన చేసిన టిటిడి ఆస్థాన విద్వాంసుడుగా ఖ్యాతి

నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద(76) గుండెపోటుతో ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. తిరుపతి భవానీనగర్ లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆద్యాత్మిక భావంతో >>2

# కొల్లేరు సరస్సు ఆక్రమణలపై అటవీ శాఖ సర్వే

**విజయవాడ,మార్చి 9,ప్రభాతవార్తప్రతినిధి:** కొల్లేరు సరస్సు ఆక్రమణలపై అటవీ శాఖ సర్వే ప్రారంభమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. గుడివాకలంక నుంచి సర్వేను ప్రారంభించారు. డ్రోన్ల సాయంతో ఆక్రమణల వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అటవీశాఖ సర్వే వివరాలపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. కొల్లేరు సరస్సులో సహజ నీటిప్రవాహాన్ని అడ్డుకొని వన్యప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా మారిన ఆక్రమణలను ఉక్కు పాదంతో అణచివేయాలని ఎపి >>2

# స్వయం ఉపాధి రంగాల్లో మహిళలకు పూర్తి సాయం

డ్వాక్రా మహిళలకు వ్యాపార శిక్షణ

కేంద్ర సహకారంతో పలు సంక్షేమ పథకాలు అమలు

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, సాధికారత, భద్రతకు కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. కేంద్ర సహకారంతో వారిని అన్ని రంగాల్లో సమర్ధులుగా నిలబెట్టేందుకు కీలక చర్యలు చేపట్టామన్నారు.'ఎక్స్' వేదికగా ఆయన రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను వెల్లడించారు.ఇప్పటికే ప్రభుత్వం ఇందుకు సంబంధించి వివిధ సంస్థలతో ఎంవోయులు కుదుర్చుకోవడంతో పాటు పలు పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించిందని వివరించారు. "మహిళలకు మహిళల కోసం మహిళల చేత" కార్యక్రమంలో భాగంగా ఎన్డీసీ వేదికగా వావ్ జీని యాప్‌ని ఉపయోగించుకుని లక్షకు పైగా డ్వాక్రా ఉత్పత్తులు రికార్డు స్థాయిలో రూ.5.13 కోట్లకు రికార్డు స్థాయిలో విక్రయించారు. ఇందుకు సాధించిన గిన్నిస్ రికార్డుని ముఖ్యమంత్రికి అందజేశారు. 7,471 మంది పట్టణ పేద మహిళలకు 645.52 కోట్ల బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. ఒక్కో మహిళకు సుమారు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల దాకా రుణం అందుతుంది. 1.43 లక్షల మంది గ్రామీణ మహిళలకు బ్యాంక్ లింకేజ్ ద్వారా ఉత్పాదక రుణాల పథకం కింద రూ.1,826.43 కోట్లు, స్త్రీ నిధి సంస్థ కింద రూ.1,000 కోట్లు మంజూరుకు సంబంధించి లబ్ధిదారులకు చెక్కులను అందించారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు వ్యాపార శిక్షణ అందించడంపై క్యాటలిస్టు మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటుంది.

ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా వ్యవసాయాధారిత ఉత్పత్తులకు వ్యాల్యూ చైన్ అందించనుంది. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు సెంటర్ ఫర్ కలెక్టివ్ డవల్మెంట్‌తో ప్రభుత్వంఒప్పందం కుదుర్చు >>2




ఆదివారం బిసి సంక్షేమ సంఘ మహిళా విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

# ప్రతి ఇంటికి మహిళా పారిశ్రామికవేత్త

వారి అభివృద్ధి కోసం వినూత్న పథకాలు

విద్య, ఉద్యోగావకాశాల్లో 33% రిజర్వేషన్లు

-రాష్ట్ర బిసి సంక్షేమ మంత్రి సవిత

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల ఆర్థిక వృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని గ్రహించిన తమ ప్రభుత్వం వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి ఇంటిని నుంచి ఓ మహిళను పారిశ్రామిక వేత్తగా రూపొందించేలా పథకాలు అమలు చేస్తున్నామన్నారు.. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో ఓ ప్రైవేటు కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘ >>2



ఎఐ అమలు దిశగా టిటిడి అడుగులు

పలు సంస్కరణల అమలుకు చైర్మన్ బిఆర్ నాయుడు కృషి

# స్వల్ప వ్యవధిలో గోవిందుని దర్శనం!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "ఏడుకొండలవాడా గోవిందా... ఆపదమొక్కులవాడా గోవిందా...గోవింద" అంటూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తిరుమలకు వస్తున్న వేలాదిమంది సామాన్యభక్తులకు తక్కువ సమయంలో సంతృప్తికరంగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేలా పాలకమండలి కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై ఇప్పటికే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సారథ్యంలోని టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి , పాలకమండలి సభ్యులు ఏఐ (కృత్రిమమేధ)టెక్నాలజీ అమలుచేసేందుకు చకచకా ప్లానింగ్ చేస్తున్నారు. ఆ దిశగా అడుగులు వేసి ఇదివరకే దాని ప్రయోగాత్మకంగా అమలుతీరును పరిశీలించారు. ఈ విధానంలో తొలుత భక్తుడి ముఖగుర్తింపు రికార్డు చేసిన తరువాత ఓ కియోస్క్ నుండి బార్‌కోడ్ రశీదు టోకెన్ వస్తుంది. అందులో భక్తుడి వివరాలు,దర్శనం సమయం ఉంటుంది. నిర్దేశిత సమయానికి భక్తులు క్యూలైన్‌లో ప్రవేశిస్తే ముఖగుర్తింపు ఆధారంగా స్వయంచాలికమైన (ఆటోమేటిక్‌గా) గేటు >>2

# కొత్తగా రెండు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు

**విజయవాడ మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా రెండు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.రాజధాని అమరావతిలో, శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీకాకుళం జిల్లాల్లో విమానాశ్రయాన్ని ఈశాన్య దిశలో శ్రీకాకుళం నగరానికి 70 కి.మీ దూరంలో సముద్రతీరానికి సమీపంలో నిర్మించనున్నట్లు తెలిపింది. ప్రతిపాదిత విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణను ప్రభావితం చేసే సాంకేతిక ఆర్థిక అంశాలను కన్సల్టెన్సీ సంస్థలు గుర్తించాలని పేర్కొంది తాజా మార్గదర్శకాలను అనుగుణంగా విమానాశ్రయాల నిర్మాణానికి కాన్సెప్ట్ మాస్టర్ ప్లాన్, ఫైనాన్షియల్ మోడల్, ప్రాజెక్ట్ స్ట్రక్చర్లను సిద్ధం చేయాలని పర్యావరణ సామాజిక ప్రభావ అధ్యయనాలు నిర్వహించాలని >>2

10-3pg2exHMNWJQE.qxd:10-3pg2exHMNWJQE.qxd 01/01/01 10:18 AM Page 1





ఆదివారం అహ్మదాబాద్‌లో జైన్ ఆచార్య శ్రీమద్ బుద్ధిసాగర్ మహరాజ్ స్మారక నాణెం ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# భారత్ 'ఛాంపియన్'

>> వెనువెంటనే ఔట్ అయ్యారు. ఈదశలో హార్ధిక్ పాండ్యా వచ్చి మెరుపులు మెరిపించి 18 బంతుల్లో 18 పరుగులుచేసి జేమ్సియన్ బౌలింగ్‌లో ఆయనకే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాటపట్టాడు. దీనితో తరువాత వచ్చిన రవీంద్రజడేజాతో కలిసి కెఎల్‌రాహుల్ నెమ్మదిగా ఆడుతూ వీలుచిక్కినపుడు షాట్లుకొడుతూ జట్టును విజయ తీరాలకు చేర్చారు. 49వ ఓవర్ చివరి బంతిని ఫోర్‌గా మలిచి కెఎల్‌రాహుల్ టీమిండియాను గెలిపించాడు. ఆరువికెట్లు నష్టపోయిన టీమిండియా 254 పరుగులుచేసింది. కివీస్ బౌలర్లలో మిచెల్‌బ్రేస్‌వెల్, మిచెల్ శాంట్నర్ రెండేసి వికెట్లు కేల్ జమియ్సన్, రచిన్‌రవీంద్ర చెరో వికెట్‌తీసారు. తొలుత బ్యాటింగ్‌చేసిన న్యూజిలాండ్ 251 పరుగులుసాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో కివీస్‌జట్టు ఏడు వికెట్లునష్టపోయి 251పరుగులవద్ద చేతులెత్తేసింది. కివీస్ బ్యాటర్లలో డారిల్‌మిచెల్ 63, మైకేల్ బ్రాస్‌వెల్ 53పరుగులుచేసి రాణించారు. రచిన్‌రవీంద్ర 37, గ్లెన్‌ఫిలిప్స్‌లు 34పరుగులుచేసి పర్వాలేదనిపించారు. విల్‌యంగ్ 15, కేన్ విలియమ్సన్ 11, టామ్ లేథమ్ 14, మిచెల్ శాంట్నర్ ఎనిమిదిపరుగులుచేసారు. నాథన్ స్మిత్‌ఒకే ఒక్కపరుగుచేసి నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో కుల్దీప్‌యాదవ్2, వరుణ్‌చక్రవర్తి 2, రవీంద్రజడేజా, షమీ, చెరో వికెట్‌తీసారు. న్యూజిలాండ్‌ను ప్రతి ఓవర్‌లోనూ కట్టడిచేసి స్పిన్‌ప్రతిభను చూపించిన టీమిండియా బౌలర్లు కివీస్‌ను 251పరుగులకే కట్టడిచేయగలిగారు. 25 ఏళ్లక్రితం ఇదే టోర్నమెంట్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌చేతిలో ఎదురయిన ఓటమికి టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. దీనితోపాటు ఆతడు ఈట్రోఫీని గరిష్టంగా గెలుచుకున్న రికార్డును కూడా భారత్ నమోదుచేసింది. 2024 టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలిచిన తర్వాత రోహిత్ కెప్టెన్సీలో టీమిండియా 12 ఏళ్ల తర్వాత మళ్లీ ఛాంపియన్‌నస ట్రోఫీ గెలుచుకుంది.



ఆదివారం బెంగళూరులో 'పోలీసు ప్రైడ్' పేరుతో పోలీసులు, కార్యకర్తలు జరిపిన ప్రదర్శన దృశ్యం

## నాగబాబుకు రూ.59 కోట్లు చరాస్తులు..

# రూ.11 కోట్లు స్థిరాస్తులు

**విజయవాడ మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ఏన్డీఏ కూటమి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసిన కొణిదల నాగేంద్రరావు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు వివరాలను వెల్లడించారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులూ లేవని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం మ్యూచువల్ ఫండ్స్ /బాండ్లు రూ.55.37 కోట్లు. చేతిలో నగదు రూ.21.81 లక్షలు, బ్యాంకులో నిల్వ రూ.23.53 లక్షలు, ఇతరులకు ఇచ్చిన అప్పులు రూ.1.03 కోట్లు, బెంజ్ కారు రూ.67.28 లక్షలు, హ్యుందయ్ కారు రూ.11.04 లక్షలు, రూ.18.10 లక్షల విలువైన 226 గ్రాముల బంగారం తనవద్ద తన భార్యవద్ద రూ.16.50 లక్షల విలువైన 55 క్యారట్ల వజ్రాలు రూ.57.99 లక్షల విలువైన 724 గ్రాముల బంగారం, రూ.21.40 లక్షల విలువైన 20 కేజీల వెండి ఉన్నట్లు తెలిపారు. తనకు తన భార్యకు కలిపి చరాస్తులు మొత్తం రూ.59.12 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు.

రంగారెడ్డి జిల్లాల్లో రెండు వేర్వేరుచోట్ల ఉన్న 2.39 ఎకరాల భూమి విలువ రూ.3.55 కోట్లు , మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రూ.32.80 లక్షల విలువైన 3.28 ఎకరాలు అదే ప్రాంతంలో మరో సర్వే నంబరులో రూ.50 లక్షల విలువైన 5 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా టేకులాపల్లిలో రూ.53.50 లక్షల విలువైన 1.07 ఎకరాల భూములు, హైదరాబాద్‌లోని మణికొండలో రూ.2.88 కోట్ల విలువైన 460 చదరపు అడుగుల రెసిడెన్షియల్ విల్లా. మొత్తంగా రూ.11.20 కోట్ల విలువైన స్థిరాస్తులు. రెండు బ్యాంకుల్లో గృహరుణం మొత్తం రూ.56.97 లక్షలు, కారు రుణం రూ.7,54,895 ఇవికాకుండా ఇతర వ్యక్తులు సంస్థల నుంచి తీసుకున్నవన్నీ కలిపి రూ.1.64 కోట్ల అప్పులున్నాయని తెలిపారు. తన అన్న చిరంజీవి నుంచి రూ.28,48,871 తమ్ముడు పవన్ కల్యాణ్ నుంచి రూ.6.90 లక్షలు అప్పు తీసుకున్నట్లు వెల్లడించారు.

# రోహిత్‌సేనకు అభినందనల వెల్లువ

## ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ సాధించడం గర్వకారణం: ప్రధాని మోడీ

### భారత్ టీంకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు

**న్యూఢిల్లీ, మార్చి 9:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీని 12 ఏళ్ల తర్వాత భారత్ సాధించడంతో దేశవ్యాప్తంగా ఫ్యాన్స్ సంబరాలు మిన్నంటాయి. టీమిండియా విజయంపై ప్రధానినరేంద్రమోడీ హర్షం వ్యక్తంచేసారు. అసాధారణ మ్యాచ్. అపూర్వ విజయం అంటూ వ్యాఖ్యానించారు ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీని మన జట్టు కైవసం చేసుకోవడం గర్వంగా ఉందని ట్వీట్‌చేసారు. టోర్నమెంట్ ఆసాంతం అద్భుతంగా ఆడారంటూజట్టు సభ్యులను ప్రశంసించారు.మరోవైపు వన్‌టీమ్, వన్‌డ్రీమ్, వన్ ఎమోషన్ అని పేర్కొంటూ బిసిసిఐ మ్యాచ్‌ఫోటోలు షేర్‌చేసింది. ఇదిలా ఉంటే ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీనిమూడుసార్లు గెలిచిన ఏకైక జట్టుగా భారత్ నిలిచిందని టీమిండియాకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూచరిత్ర సృష్టించిన విజయమిది అని భారత క్రీడాకారుల అద్భుతమైన సామర్థ్యం, మైదానంలో తిరుగులేని ఆధిపత్యం దేశాన్ని గర్వపడేలాచేసిందని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇదొక స్మాషింగ్ విక్టరీ అని భారత జట్టులోని ప్రతి ఒక్కరూ కోట్లాదిమంది హృదయాలను గర్వంతో ఉప్పొంగేలాచేసారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రి నారాచంద్రబాబు టీమిండియాకు శుభాకాంక్షలు తెలిపారు. తన అత్యుత్తమ ప్రదర్శనతో మరోసారి మనల్ని గర్వపడేలాచేసిందన్నారు. కృషి అంకితభావంతో అద్భుతమైన విజయం సాధించిన టీమిండియాకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఉత్కంఠభరితంగాస ఆగిన మ్యాచ్‌లో భారత్ గెలుపు ఎంతో ఆనందంగా ఉందని అద్భుతమైన ఆటతీరుతో భారత్ జట్టు మరోసారి తన సత్తాచాటిచెప్పిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. టీమిండియా మైదానంలో తన నైపుణ్యం, ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రోహిత్‌శర్మ జట్టును ముందుండి నడిపించాడని మంత్రి నారాలోకేష్ అన్నారు. మ్యాచ్ చివరివరకూ పోరాట స్ఫూర్తిని కనబరిచేవిధంగా కివీస్‌జట్టుపై భారత్ అద్భుత ఆటతీరుతో విజయం సాధించిందని, టీమిండియాకు వరుసగా ఐసిసి ట్రోఫీలు అందించిన రోహిత్‌శర్మకు అభినందనలని ఐసిసిచైర్మన్‌జైషా వ్యాఖ్యానించారు.

## గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూత

>> టిటిడిలో తనదైన శైలిలో ఆస్థానవిద్వాంసుడుగా అలరారారు. సంప్రదాయ సంగీత ప్రపంచానికి గరిమెళ్ళ మృతి తీరని లోటుగా టిటిడి పేర్కొంది. వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పనచేసిన ఘనత గరిమెళ్ల సొంతం చేసుకున్నాడు. వినరోభాగ్యము విష్ణు కథ...జగడపు చనువుల జాతర...పిడికెట తలంబ్రాల పెండ్లి కూతురు వంటి సుప్రసిద్ధి కీర్తనలకు ఆయన స్వరాలు సమకూర్చాడు. సంప్రదాయ కర్నాటక, లలిత,జానపద సంగీతంలోనూ సుప్రసిద్దులు. ఆయన మృతిపట్ల టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

గరిమెళ్ళ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రముఖవాగ్గేయకారుడు ,టిటిడి మాజీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ హఠాన్మరణం సంగీత ప్రియులకు తీరనిలోటుగా సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మొట్టమొదటి తెలుగువాగ్గేయ కారుడు అన్నమయ్య రచనలను వేల సంఖ్యలో గానం చేసి బాలకృష్ణప్రసాద్ ప్రసిద్దులయ్యారని అన్నారు.

## అటవీ శాఖ సర్వే

>> సర్కారును సుప్రీం కోర్టు ఆదేశించింది. గతేడాది డిసెంబరు 11న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం మూడు నెలల్లోపు కొల్లేరు సరిహద్దులను గుర్తించి అక్షాంశాలు, రేఖాంశాలు ఖరారు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## వారం - వర్జ్యం

**తేది : 10-03-2025, సోమవారం**
**శ్రీ క్రోధి నామ సంవత్సరం,**
**ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,**
**శిశిర ఋతువు, శుక్లపక్షం,**
శుక్ల ఏకాదశి ఉ.7.45
పుష్యమి రా.12.50
వర్జ్యం ఉ.8.13-9.53
దు.ము.12.50-1.38, 2) మ.3.13-4.01
శుభసమయం :ఉ.10.00-10.30, సా.4.30-5.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**వృషభం :** రుణ బాధలు తప్పవు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**మిథునం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలు. స్వల్ప ధనలాభం.

**కర్కాటకం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**సింహం:**బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు. వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకొంటారు. వాహనసౌఖ్యం.

**తుల :**ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** ఊహించని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**ధనుస్సు:** కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో పూర్తి చేస్తారు. ప్రయాణాలు.

**మకరం:**అనుకోని ఆహ్వానం ఆశ్చర్యపరుస్తాయి. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు

>> న్నందున అప్పుడు అవకాశం కల్పిస్తామని ఆశావహులకు పార్టీ పెద్దలు సర్ది చెబుతున్నారు. ఈ మేరకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ మంత్రి జవహర్, దువ్వారపు రామారావు, టిడి జనార్ధన్‌కు అధిష్ఠానం నుంచి ఫోన్లు వెళ్లినట్టు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ నేరుగా సిట్టింగ్ ఎంఎల్‌సీలు అశోక్‌బాబు తదితరులకు నేరుగా ఫోన్ చేసి చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో చోటు కోసం తెలుగుదేశం పార్టీలో ఆశావహులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసారు. అయితే ఆ జాబితాలో టిడిపి అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు అభ్యర్థుల ఎంపిక సమయంలో ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు.అలా ఎలిమినేట్ చేసిన వారిలో దేవినేని ఉమా, టిడి జనార్ధన్,బుద్దావెంకన్న తదితరులకు నేరుగా ఫోన్ చేసి వారికి 2026,2027ల్లో అవకాశం కల్పిస్తామని వివరించారు. అప్పుడు ఖాళీ అయ్యే వాటిలో ఛాన్స్ ఇస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చెప్పమన్నారంటూ ఆశావహులకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు స్వయంగా ఫోన్ చేసి వివరించారు. ఆ కొద్ది సేపటికే పార్టీ అధిష్టానం ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. రేపటితో నామినేషన్ గడువు ముగియనుండటంతో ఆఖరి ప్రయత్నాలు చేశారు. అమరావతిలోనే మకాం వేసిన ఆశావాహులు ఆఖరి నిమిషంలో ఇబ్బంది పడకుండా ముందే నామినేషన్ కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుని సిద్ధమై వచ్చారు. ఇప్పటికే చంద్రబాబు, లోకేశ్‌ని కలిసి తమ అనుకూలతలను వివరించారు. అయితే అలా ఏర్పాట్లు చేసుకున్న ఎవ్వరికి అవకాశం దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వారికే మొదటి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందనుకున్నా, ఆ దిశలో పూర్తి స్థాయిలో అధిష్టానం స్పందించలేదు. సామాజిక వర్గాల సమతుల్యతను పాటిస్తూ సీట్లు కేటాయించింది.పల్లా గ్రీష్మకు మహిళా కోటాలో ఇచ్చారు.బీదా రవిచంద్రకు బిసి కోటాలో ఇచ్చారు.ఇక మూడవ అభ్యర్థి బోయ వర్గానికి చెందిన సిటింగ్ ఎంఎల్‌సీగా ఉన్నారు.ఈ క్రమంలో ఎస్సీ, బీసీలకు పదవులు కేటాయించడంలో, ప్రాధాన్యత ఇవ్వడంలో చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ఆదర్శంగానే ఉంటారన్న మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. టిడిపిఅంటేనే బిసి పక్షపాతి. ప్రాంతాలు, సామాజిక వర్గాలకు సమ న్యాయం చేస్తూ టిడిపి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిసిల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు. ఎమ్మెల్సీలుగా ఎంపిక అయిన కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బిటి నాయుడులకు శుభాకాంక్షలంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు ఆయనప్రకటన విడుదల చేసారు. ఇక సోము వీర్రాజు పేరును బిజెపిలోని కొందరుపెద్దలు ఎమ్మెల్సీ స్థానానికి ప్రతిపాదిస్తోన్నట్లు తెలుస్తోంది. విశాఖకు చెందిన పిసిఎన్ మాధవ్ పార్టీనేతకూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బిజెపి అభ్యర్థి ఎవ్వరన్నది ఈ రాత్రికే వెల్లడయ్యే అవకాశం ఉంది.,ఆ దిశలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కసరత్తు చేస్తున్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు

>> సూచించింది. విమానాశ్రయం నిర్మాణానికి ఎంత ఖర్చవుతుంది. ఎన్ని దశల్లో చేపట్టాలి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం జాయింట్ వెంటర్ వంటి విధానాల్లో దేన్ని అనుసరించాలి తదితర ప్రతిపాదనలతో పాటు ఎంత ఆదాయం వస్తుంది వంటి అంచనాల్ని సిద్ధం చేయాలని స్పష్టం చేసింది. విమానాశ్రయాలున్న ప్రాంతాలను ఏవియేషన్ హబ్‌లుగా తీర్చిదిద్దేందుకు వైమానిక రక్షణరంగ తయారీ పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలపై కూడా కన్సల్టెన్సీ సంస్థలు అధ్యయనం చేయాలని ఎపిఎడిసి తెలిపింది. భవిష్యత్తులో డిమాండ్ ఎలా ఉండబోతోంది. ఎయిర్ ట్రాఫిక్ వృద్ధి ఎలా ఉంటుందన్న అంశాలనూ శోధించాలంది. ప్రభుత్వం నుంచి ఆర్థిక ఇతరత్రా ఎలాంటి ప్రోత్సాహకాలు ఉండాలో కూడా సూచించాలని తెలిపింది. విమానాశ్రయాలకు ప్రాంతీయ అనుసంధానత, భవిష్యత్తులో ప్రయాణికులు అవరోధాలు లేకుండా సులభంగా ఎయిర్‌పోర్టులకు చేరుకునేందుకు అభివృద్ధి చేయాల్సిన రవాణా మార్గాలపైనా కన్సల్టెన్సీ సంస్థలు నివేదిక ఇవ్వాలని సూచించింది. విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే 35 ఏళ్ల ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాన్సెప్ట్ మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని రన్‌వేలు, ట్యాక్సీవేలు ఎన్ని ఉండాలి అవి ఎంతపొడవు ఉండాలి. ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ స్టాండ్‌లు ఎన్ని అవసరం, ఎలాంటి విమానాలు నిలిపేందుకు ఏ తరమా స్టాండ్లు ఉండాలి, ప్యాసింజర్ కార్గో టెర్మినల్లు ఎలా ఉండాలి వంటి అంశాలన్నీ మాస్టర్‌ప్లాన్‌లో ఉండాలని తెలిపింది. విమానాశ్రయాలకు ఇతరత్రా మార్గాల్లో ఆదాయం వచ్చేందుకు అవసరమైన నిర్మానాలు చేపట్టేందుకు ఎంత భూమి అవసరం? తదితర సమస్త సమాచారాన్నీ కన్సల్టెన్సీ సంస్థలు తమ నివేదికల్లో పొంఉపరచాలని ఏపీఏడీసీ పేర్కొంది. వీటికి సంబంధించి ప్రీ-ఫీజిబిలిటీని పరిశీలించేందుకు సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక రూపొందించేందుకు కన్సల్టెంట్ల నియామకానికి ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ టెండర్లు పిలిచింది. ఆన్లైన్ టెండర్ల దాఖలుకు ఈ నెల 21వరకు గడువు ఇచ్చింది. ఈ నెల 24న సాంకేతిక బిడ్‌లు, 27న ఫైనాన్షియల్ బిడ్‌లు తెరవనుంది. అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు ఏ ప్రాంతం అనుకూలమో కూడా కన్సల్టెన్సీ సంస్థే సూచించాలని నిబంధనల్లోపేర్కొంది.

# ప్రతి ఇంటికి మహిళా పారిశ్రామికవేత్త

>> గౌరవాధ్యక్షురాలు, మహళా అధ్యక్షురాలి ప్రమాణస్వీకారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్ర సవిత మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతకి అన్న ఎన్టీఆర్‌తో పాటు సిఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళలతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన అన్న ఎన్టీఆర్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మహిళా యూనివర్సిటీని ప్రారంభించారన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తిలో సగ భాగం కల్పించారన్నరు. సిఎం చంద్రబాబునాయుడు సైతం తన పాలనలో మహిళలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. విద్యా, ఉద్యోగావకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. రాజకీయాల్లోనూ వారికి ప్రాధాన్యమిచ్చారన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా భరోసా ఇస్తూ పథకాలు రూపకల్పన చేశారన్నారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్య కల్పించారు. దీపం పథకానికి శ్రీకారం చూట్టారన్నారు. ప్రస్తుత క్యాబినెట్‌లో ముగ్గురు మహిళలకు కీలక శాఖల బాధ్యతలు అప్పగించారన్నారు. త్వరలో నిర్వహించబోయే మెగా డిఎస్సీ లో మహిళలకు టీచర్ పోస్టులు లభించేలా ఉచిత ఆన్ లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభించబోతున్నారు. ఈ కోచింగ్ వల్ల ఇంటి వద్ద ఉండే మహిళలకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. మహిళా రక్షణకు సిఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తూ, శక్తి యాప్ రూపొందిస్తున్నారన్నారు. ఆడబిడ్డల పట్ల నిర్లక్ష్య ధోరణి, వివక్ష సరికాదని మంత్రి సవిత తెలిపారు. మగ బిడ్డలతో సమానంగా ఆడ బిడ్డలకు అన్ని అవకాశలూ కల్పించాలన్నారు. అదే సమయంలో మగ బిడ్డలకు తోటి మహిళలతో గౌరవప్రదంగా మెలిగేలా చూడాలన్నారు. ఆడ బిడ్డల విద్యకు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం ఎన్ని అవకాశాలు, పథకాలు కల్పించినా ప్రజల నుంచి బాలికా విద్యకు, ఉన్నతికి ప్రోత్సహం ఉండాలన్నారు.

రాష్ట్రపతి, కేంద్ర ఆర్థిక మంత్రి, ఐఎఎస్ లు, ఐపిఎస్‌లుగా ఎందరో మహిళలు సత్తా చాటుతున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారిణులను మంత్రి సవిత సన్మానించారు. ఘట్టమనేని సాయిరేవతి, చంద్రిక, ఎస్కే సాదియం అల్మాస్‌ను మంత్రి ఘనంగా సత్కరించారు. ముగ్గురు గర్భిణులకు కూడా సీమంతం నిర్వహించి, నూతన వస్త్రాలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. గురుకులాల కార్యదర్శి మాధవీలత మాట్లాడుతూ, పిల్లల పెంపకంలో వివక్ష చూపొద్దన్నారు. అంతకుముందు రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలి జయశ్రీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వావిలాల సరళాదేవి...మంత్రి సవిత సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వారికి మంత్రి సహా పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, సభ్యులు కుమ్మరి క్రాంతి కుమార్, తిరువీధుల కిరణ్, పాలేపల్లి మహేష్, స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు పూర్తి సాయం

>> కుంది. చిన్న తరహా హోటల్ వ్యాపారంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడానికి గాటోస్ కేఫ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పనకు ఉపయోగం కలగనుంది. సర్వీస్ ప్రొవైడర్ల జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి హోమ్ ట్రయాంగిల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనిద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18,515 సర్వీస్ ప్రొవైడర్లకు ప్రయోజనం చేకూరుతుంది. నెలకు రూ.15,000 నుంచి రూ.35,000 నికర ఆదాయం రానుంది. సర్వీస్ ప్రొవైడర్లలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, బ్యూటీషియన్లు, గృహోపకరణ మరమ్మతులు వంటి వాటిల్లో శిక్షణ కల్పిస్తారు. రాపిడోతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఆన్‌బోర్డింగ్ ఛార్జీలు, నెలవారీ చార్జీలను మూడు నెలల పాటు మాఫీ చేస్తుంది. దీని ద్వారా ర్యాపిడీలో ఉన్న మహిళలకు సుమారు రూ.30 వేల వరకు లబ్ధిపొందుతారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 1,000 ఎలక్ట్రిక్ వాహనాను మహిళా రైడర్లకు అందించారు. ఇందులో 760 ఈబైక్‌లు, 240 ఈఆటోలు ఉన్నాయి.నేచర్ అరకు కాఫీతో ఒప్పందం చేసుకున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో అరకు కాఫీ ఉత్పత్తులు పెంచేందుకు, గ్రామీణ ప్రాంతాలకు అరకు కాఫీ విస్తరించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. తొలి విడతలో 100 అరకు కాఫీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తారు. తద్వారా ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుంది. రాష్ట్రంలోని 55,607 మంది అంగన్వాడీ వర్కర్లకు, 48,909 మంది హెల్పర్లకు మేలు చేకూర్చేలా మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి గ్రాట్యూటీ అమలును ప్రకటించారు. దీని ద్వారా ఒక్కో అండన్వాడీ వర్కర్ రూ.1.79 లక్షల నుంచి రూ.2.32 లక్షల వరకు, హెల్పర్లకు రూ.1.09 లక్షల నుంచి రూ.1.41 లక్షల వరకు లబ్ధికలుగుతుంది. దీని అమలుకు ప్రభుత్వంపై ఏటా రూ.17.73 కోట్ల భారం పడుతుంది. ఆశా వర్కర్లు ఎప్పటి నుంచో కోరుతున్న గ్రాట్యూటీని సీఎం ఈ సందర్భంగా అమలు చేశారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన, మరణించిన ఆశా వర్కర్లకు గ్రాట్యూటీ అమలవుతుంది. గతేడాది జూన్ నుంచి అమలు చేసే గ్రాట్యూటీకి గాను రూ.1.90 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. పిఎం విశ్వకర్మ పథకం ద్వారా 1000 మంది మహిళలకు ప్రభుత్వం రూ.1 లక్ష వరకు రుణం మంజూరు చేసింది. సెర్ప్, మెప్మా, ఎంఎస్ఎంఈ విభాగంలో అవకాశాలు, స్వయంఉపాధి, ఆర్థిక వెసులుబాటు కల్పించి లక్ష మంది మహిళా ఎంట్రప్రెన్యూర్‌లను తీర్చిద్దే తీర్చిదిద్దేందుకు నడుం బిగించింది. దీనికి సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేసినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు.మెప్మాలో 30 వేల మంది, 10 వేల మంది మహిళలను రాపిడో, 4 వేల మంది స్వయం ఉపాధి పథకాల్లో, 4 వేల మందిని కేంద్ర ప్రాయోజిత పథకాల్లో, 4 వేల మందిని పర్యాటక అనుబంధ రంగాల్లో, 4 వేల మంది తృప్తి హోటల్స్ స్థాపన, 2 వేల మంది స్మార్ట్ స్ట్రీట్స్ వెండింగ్ జోన్‌లో, మరో 2 వేల మందికి టిడ్కో జీవనాధారం కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఎంఎస్ఎంఈ రంగంలో 10 వేలమందికి జీవనోపాధి కల్పిం చేందుకు 2025-26 సంవత్సరానికి యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేసింది.మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా శక్తిటీమ్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా పనిచేస్తారు. చేనేత రథాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వీటి ద్వారా చేనేత చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రతి జిల్లాకు ఒక్కో వ్యానును రూ.60లక్షలు ఖరీదుదో అందిస్తుంది. దానిద్వారా చేనేత ఉత్పత్తుల విక్రయం మరింత సులభం అవుతుంది. ఈ సందర్భంగా ఒక్కో చేనేత మహిళకు 36 చీరలు నేసే నూలును ఉచితంగా పంపిణీ చేశారు.

# స్వల్ప వ్యవధిలో గోవిందుని దర్శనం!

>> తెరచుకుంటుంది. ఈ విధానాన్ని రెండు సంస్థల ప్రతినిధులు టిటిడి ముందు డెమో కూడా ఇచ్చారు. ఆ రెండు సంస్థలు 14 దేశాల్లో ఏఐ సంబంధిత సేవలందిస్తున్నాయని టిటిడి పాలకమండలి తెలిపింది. ప్రస్తుతం సామాన్యభక్తులకు వీలైనంత వరకు నాలుగైదు గంటల్లోనే ఆ దేవదేవుని దర్శనం చేయించేలా చూస్తున్నారు. ఈ సమయాన్ని మరింతగా కుదించాలనేది టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలోచన.

ప్రతిరోజూ సాధారణరోజుల్లోనే తిరుమలకు 90వేలమంది వరకు భక్తులు వస్తున్నారు. వీరిలో 40వేలమందిపైగా భక్తులు ఆన్‌లైన్‌లో దర్శనాలు, ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు, కాలినడక భక్తులు ఇలా ఉన్నారు. వీరంతా నిర్దేశిత సమయానికి క్యూలైన్లోకి ప్రవేశిస్తే నాలుగుగంటల్లోపే ఆనందనిలయంలోనికి చేరుకుని ఏ దివ్యమంగళరూపాన్ని దర్శించుకుంటున్నారు. గత వారంరోజులుగా తిరుమలకు చేరుకుని వెంకన్నను దర్శించుకున్న భక్తుల సంఖ్య గమనిస్తే ఆదివారం సాయంత్రం వరకు 44వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు. శనివారం మార్చి 8వతేదీ 74,646 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, శుక్రవారం మార్చి 7వతేదీ 67,127 మంది భక్తులు తిరుమలేశుని దర్శనం చేసుకున్నారు. 6న 58,548మంది, మార్చి 5న 63,285మంది, 4న 64,861మంది, 3న 65,683మంది, మార్చి 2న 69,592మంది, మార్చి 1న 71,785మంది భక్తులు మహాలఘులో ఆ శ్రీవారిని సంతృప్తికరంగా దర్శనం చేసుకుంటుండటం విశేషం. ఆలయంలోపల కూడా భక్తులను లాగడం గానీ, ముందుకు తోయడంగానీ అలాంటి రగడ లేదు.

రోజువారీగా మరింత సంతోషంగా స్వామివారిని చూసుకునేలా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చూస్తోంది. ఆలయంలోపల టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రస్తుతం వారంలో ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు 1.05లక్షలు జారీ చేస్తుండగా,ఈ సంఖ్యను పెంచి 1.47లక్షల టోకెన్లు జారీ చేస్తున్నారు. రానున్న రోజుల్లో అవసరమైతే ఈ టైమ్‌స్లాట్ టోకెన్లు పెంచేందుకు యోచిస్తున్నారు. కాలినడకన తిరుమలకు చేరుకునే వారికి దివ్యదర్శనం టోకెన్లు రోజుకు 5వేల వరకుజారీ అవుతున్నాయి. సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు, సంతోషకర దర్శనం చేయించడంలో పాలక మండలి, అదఇకారులు సఫలీకృతులయ్యారు. భక్తులు సంతోషంగా, తృప్తిగా అన్నప్రసాదాలు స్వీకరించేలా తయారీ విధానంలో నాణ్యతకు ప్రాధాన్యత నిచ్చారు. ఇక రానున్న రోజుల్లో ఇష్టదైవం శ్రీవారిని సామాన్యభక్తులు వీలైనంత సులభంగా, సంతోషంగా చేసుకునేలా చూడాలనేది అధికారుల యాక్షన్‌ప్లాన్. క్యూలైన్లలో సామాన్యభక్తులకు కనీస సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్లలో నిరంతరాయంగా నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు, పాలు, టీ, తాగునీరు అందించేలా చూస్తున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల రాష్ట్రాల నుండి వచ్చే స్వామివారి సేవకులకు ఏమేరకు సంతోష దర్శనమ్ చేయించగలుగుతామనే దిశగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలోచన చేస్తున్నారు. భక్తుల్లో తాను సేవకుడిగా పనిచేస్తానని ఆయన పనితీరు మారింది.

# ఇక ఐదు బడుల విధానం

>> యినా అక్కడ 60 మంది లేదా అంతకంటే ఎక్కువ విద్యార్థులున్న వాటిని ఉన్నత పాఠశాలగా తీర్చి దిద్దుతారు. 3159 మంది విద్యార్థులు ఉంటే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. ఇకపై 6 నుంచి 10 తరగతులు మాత్రమే ఉన్నత పాఠశాలలో ఉంటాయి. సహజ సిద్ధ అడ్డంకులు, జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు ఉంటే బేసిక్ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించనున్నారు. పాఠశాల పునర్నిర్మాణం గురించి క్లస్టర్, మండల స్థాయి కమిటీలు, యాజమాన్య కమిటీల ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ మార్పుల గురించి చెబుతారు. ఆదర్శ పాఠశాల ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీనే సూచిస్తుంది. తల్లిదండ్రులు వ్యతిరేకిస్తే యాజమాన్య కమిటీతో నిర్ణయం తర్వాతే 3,4,5 తరగతులను ఆదర్శ పాఠశాలలో విలీనం చేస్తారు. ఒక ప్రదేశంలో మౌలికసదుపాయాలు పరిమితంగా ఉంటే ఆదర్శ పాఠశాలను 500 మీటర్లలోపు దూరంలోని రెండు ప్రదేశాల్లో నిర్వహిస్తారు.

10-3Pg3exHMNWJQE.qxd:10-3Pg3exHMNWJQE.qxd 01/01/01 9:28 AM Page 1



# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మార్చి 9,ప్రభాతవార్త:** రానున్న హోలీ పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఈ నెల 9నుంచి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక రైళ్లు : విశాఖపట్నం నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 08549ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9నుంచి 23వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12-45గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08550ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10,17,24వ తేదీల్లో ప్రతి సోమవారం మధ్యాహ్నం 3-50గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 12-30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు దువ్వాడ,అనకాపల్లి,సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబూరు, అర్కోణం, కాట్పాడి,జోలార్‌పేట్,కుప్పం,బంగారుపేట్,క్రిష్ణం రాజాపురం స్టేషన్లలో నిలుస్తాయి.

**గోరఖ్‌పూర్-మహబూబ్‌నగర్ ప్రత్యేక రైళ్లు :** గోరఖ్‌పూర్ నుంచి మహబూబ్ నగర్ వెళ్లే నెంబర్ 05303ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9,16, 23,30వ తేదీల్లో ప్రతి ఆదివారం గోరఖ్‌పూర్ నుంచి ఉదయం 4-30గంటలకు బయలుదేరి మహబూబ్‌నగర్‌కు సోమవారం సాయంత్రం 6-15గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మహబూబ్‌నగర్ నుండి గోరఖ్‌పూర్ వెళ్లే నెంబర్ 05304 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10,17,24,31వ తేదీల్లో ప్రతి సోమవారం రాత్రి 10-10గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరి మంగళవారం సాయంత్రం 5-45 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది.

మార్గ మధ్యంలో ఈ రైళ్లు ఖలీలాబాద్,బస్తీ, మకాం పూర్, అయోధ్యధాం, అయోధ్య కంటోన్మెంట్, సుల్తాన్‌పూర్, ప్రతాప్‌ఘర్, ప్రయాగరాజ్ (అలహాబాద్),గోవింద్ పూరి, ఒరాయ్, ఝాన్సీ, ఇటార్సీ, నాగ్‌పూర్, చంద్రాపూర్, బల్హార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, బెల్లంపల్లి, రామగుండం, కాజీపేట,మల్కాజిగిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల స్టేషన్లలో నిలుస్తాయి.

## అంబులెన్స్‌లో అగ్ని ప్రమాదం

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నడిరోడ్డు మీద అంబులెన్స్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.నగరంలోని రమేష్ ఆసుపత్రి వద్దనే అంబులెన్స్ అగ్నికి ఆహుతి అయింది. ప్రమాద సమయంలో అంబులెన్స్ లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.అంబులెన్స్ మంటలను గమనించిన ఆసుపత్రి సిబ్బంది, మంటలను అదుపులోకి తేవడానికి విఫల యత్నం చేశారు.. ప్రమాదానికి గల కారణాలు వెల్లడి కాలేదు.అంబులెన్స్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడం వలన ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అభిప్రాయడుతున్నారు. అయితే ఎవరన్నా ఉద్దేశపూర్వకంగా చేశారా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మాచవరం పోలీసు స్టేషన్‌లో ఈ ఘటనపై కేసు నమోదు చేసారు.

## గేదెలు ఢీకొని పట్టాలు తప్పిన గూడ్స్

### రైళ్ల రాకపోకలకు అంతరాయం

### మార్గం పునరుద్ధరణకై గుంతకల్లు నుంచి ఘటనా స్థలానికి వెళ్లిన ప్రత్యేక రైలు




**గుంతకల్లు రైల్వే,మార్చి 9,ప్రభాతవార్త:** రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు(నంద్యాల) జిల్లా, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఓ గూడ్స్ రైలుకు రెండు గేదెలు ఢీకొన్న సంఘటనలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదం కారణంగా విజయవాడ-గుంతకల్లు ప్రధాన రైలు మార్గానికి అంతరాయం ఏర్పడింది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నంద్యాల-గుంటూరు ప్రధాన రైలుమార్గంలో గాజులపల్లి-చలమ స్టేషన్ల మధ్య నంద్యాల వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న బి-113-60414నెంబర్ గల గూడ్స్ రైలు మధ్యాహ్నం 1-00/1-15గంటల ప్రాంతంలో గాజులపల్లి మెయిన్ లైన్ స్టాటర్ సిగ్నల్ దాటిన కొద్దిసేపటికి గూడ్స్ రైలును రెండు గేదెలు ఢీకొని గూడ్స్ రైలు మధ్యలో దూరడంతో గూడ్స్ రైలుకు చెందిన వరుసగా 4,5 రెండు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదం కారణంగా విజయవాడ-గుంతకల్లు ప్రధాన రైలు మార్గానికి అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గుంతకల్లు డివిజన్ సంబంధిత ఉన్నతాధికారులు, రెస్క్యూటీం ఎఆర్‌టి ప్రత్యేక రైలులో రైలు మార్గం పునరుద్దరణ నిమిత్తం ఘటనా స్థలానికి తరలివెళ్లారు.

## కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకున్న పెనుగొండ



కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకుంటున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు రచయిత,అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఢిల్లీలోని కమానీ ఆడిటోరియంలో లక్ష్మీనారాయణకు అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాన్ని అందుకున్న అరసం కృష్ణాజిల్లా విభాగం ప్రతినిధి కత్తి శిఖాకాష్ మీడియాకు ఆదివారం వివరించారు. దేశ వ్యాప్తంగా 21 భాషలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారంలో భాగంగా లక్ష రూపాయల నగదుతోపాటు రజత పతకం ఆయనకు లభించింది. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను ఆయన ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు.పెనుగొండ లక్ష్మీనారాయణ తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి జరిపారని, అనేక గ్రంథాలు రచించారని సాహిత్య అకాడమీ ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. పెనుగొండ 1954లో పల్నాడు జిల్లాలో జన్మించారు. న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 1974 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. సుమారు 200కి పైగా సాహిత్య వ్యాసాలు రాసిన పెనుగొండ పలు ఇతర పురస్కారాలనూ అందుకున్నారు.

## పునర్వినియోగ రాకెట్లకు మరో బూస్టర్ దశ పరీక్ష

### ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన సరికొత్త విజయం

**శ్రీహరికోట (తడ), మార్చి 9 ప్రభాతవార్త:** పునర్వినియోగ రాకెట్ల తయారీలో ఇస్రో మరో ముందడుగు వేసింది.ఈ రాకెట్లలో ఉపయోగించే బూస్టర్‌దశ, ఎగువ దశలను ఉపయోగించే నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ కోసం లాక్స్-మీథేన్ ఇంజన్ మరియు కొన్ని దశలను అభివృద్ధి చేస్తోంది. ఇస్రో లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టం సెంటర్ (ఎల్‌పిఎస్‌సి)లో ఈ దశలు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం దీని స్థిరత్వాన్ని నిరూపించుకోవడానికి మూడుసెకన్లపాటు విజయవంతంగా మండించారు. ఇది పరీక్షా సమయంలో పొందిన అన్ని స్థితిగతులనుశాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. సియుఎస్ స్టీరింగ్ ఇంజన్ జ్వలన పరీక్షగా దీన్ని ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.


ఇస్రో చేసిన సియుఎస్ స్టీరింగ్ ఇంజన్ జ్వలన పరీక్ష

## వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి మహా రథోత్సవం

### 35 నిమిషాలపాటు ఏకధాటిగా కొనసాగిన రథోత్సవం



**ఉరవకొండ, మార్చి 9 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన ఉరవకొండ పట్టణంలోని గవిమఠ సంస్థానంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామివార్ల మహా రథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. మహా రథోత్సవం సందర్భంగా ఉదయం నుండి చంద్రమౌళీశ్వరునికి, గవిసిద్దేశ్వరునికి, తొలి పీఠాధిపతి కర్తృ కరిబసవ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సాంప్రదాయం ప్రకారం చంద్రమౌళీశ్వరుడి ఉత్సవమూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గవిమఠం సంస్థానం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకీ మఠం కళ్యాణస్వామి, సహాయ కమీషనర్ కె.రాణి, వివిధ మఠాల పీఠాధిపతులు వెంటరాగా ఊరేగింపుగా తీసుకొచ్చి అత్యంత శోభాయమానంగా పూలు, బొమ్మలు, అరటి గెలలు, మామిడి తోరణాలతో అలంకరించిన బ్రహ్మ రథంలో కొలువుదీర్చారు. అనంతరం బలిహరణ, ఇత్యాది సాంప్రదాయ పూజా కార్యక్రమాలు జరిపి బ్రహ్మ రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలు బాజా భజంత్రీల నడుమ బాణా సంచా పేల్చి గజలక్ష్మి ముందు నడుస్తుండగా 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ రథాన్ని 5.55 గంటల సమయంలో భక్తులు ముందుకు లాగారు. రథాన్ని ఎదరు బసవన్న గుడి వరకు లాగి అక్కడ బసవేశ్వరుడి ఆలయంలో పూజల అనంతరం తిరిగి 6.30 గంటలకు యథాస్థానానికి చేర్చారు. దారి పొడవునా రథంపై భక్తులు చీనీ, అరటి కాయలను విసిరి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రథోత్సవ కార్యక్రమంలో వేలాదిగా భక్తులు హాజరుకావడంతో మఠం ప్రాంగణం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా, మఠం ఏజెంటు పి. రాజన్నగౌడ్, డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్, ఆర్ఐ రామకృష్ణ, వివిధ ఆలయాల కార్యనిర్వహణ అధికారులు, వీరశైవ సమాజం బాధ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ అలీ ఆధ్వర్యంలో ఉరవకొండ, గుంతకల్లు, కూడేరు, వివిధ సర్కిళ్లకు చెందిన వందలాది మంది పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులతో ఉరవకొండ యుపీఎస్, రూరల్ సీఐలు బి.మహానంది, సయ్యద్ చిన్నగౌస్, ఎస్ఐ పి. జనార్ధననాయుడు బృందం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

## దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా సూర్యోపాసన

**ఇంద్రకీలాద్రి, మార్చి 9, ప్రభాతవార్త :** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సందర్భంగా సూర్యోపాసన సేవను నిర్వహించారు. ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, అరుణపారాయణం, సూర్యశతకం, సూర్య నమస్కారాలు తదితర పూజాదికాలను వేదోక్తంగా నిర్వహించారు.

**నృత్య నీరాజనాలు:** దుర్గమ్మను ఆదివారం విజయవాడ యనమలకు దురుకు చెందిన హనుమాన్ నృత్య కళానిలయం ఆచార్యులు కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినాయకకౌతం, అయిగిరి నందిని, రామాయణ శబ్దం, ముద్దుగారే యశోద, కొలువైతివా రంగసాయి, సౌభాగ్యలక్ష్మి రావమ్మా, శంభో శివ శంభో తదితర కీర్తనలకు అనుగుణంగా 22 మంది కళాకారుల బృందం నాట్య నీరాజనాలందించి భక్తుల మన్ననలందుకున్నారు.




**వేదోక్తంగా నిత్య సేవలు, పూజలు:** దుర్గమ్మ వారి ఆలయంలో ఆదివారం నిత్యపూజాదికాలు, సేవలు వేదోక్తంగా నిర్వహించగా విశేషంగా భక్తులు పాల్గొన్నారు. ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్వరితంగా దర్శనమయ్యేలా ఇఒ కె రామచంద్ర మోహన్ చర్యలు తీసుకున్నారు. భక్తులు లక్షకుంకుమపూజ, చండీ హోమం, శ్రీచక్రనవణార్చన, శాంతి కళ్యాణం తదితర సేవలలో ఉభయ దాతలు పాల్గొన్నారు.

## పౌరసేవలు, పథకాలు అందుకునేందుకు కీలక మార్గదర్శకాలు

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పౌరసేవలు, పథకాలు అందుకునేందుకు ఆంధ్రప్రదేశ్ కీలక మార్గదర్శకాలు వెల్లడించింది. సిటిజన్ సర్వీసుల కోసం ప్రతి పౌరుడు హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏపీ ప్రభుత్వం ఆదేశిస్తూ సూచించింది. ప్రజా ప్రయోజనాలకు మినహా ఈ వివరాలు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని జీవోలో పేర్కొంది. ఈమేరకు గ్రామవార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు. పౌరసేవలు, ప్రభుత్వ పథకాలు అందించేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ శాఖలు పౌరుల వివరాలను హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వశాఖలన్నింటికి కీలకాదేశాలు జారీ చేసింది. అన్ని శాఖలు ఈ డేటా బేస్ వివరాలను అనుసంధానం చేయాలని సూచించింది. పౌరసేవా దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ పథ కాలు, ఇతర లబ్ది అందించే ముందు ఆర్టీజీఎస్ గ్రామవార్డు సచివాలయ విభాగం వద్ద ఉన్న హౌస్ హోల్డ్ డేటా బేస్‌తో సరిపోల్చుకోవాలని తెలిపింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం2023 ప్రకారం హౌస్ హోల్డ్ డేటాలోని పౌరుల వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వివరాలకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్, గ్రామవార్డు సచివాలయాల విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది.

## విజయవాడలో ఘనంగా అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి

**విజయవాడ మార్చి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయం లో గ్రంథాలయోద్యమ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 46వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమములో గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య గురించి వివరిస్తూ ఆయన 19 ఏటనే బిపిన్ చంద్ర పాల్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవ వైపు అడుగు వేశారని తెలిపారు. దేశమంతా గ్రంథాలయాలను స్థాపించిన వ్యక్తిగా గ్రంథాలయ పితామహగా పేరు గడించారు అని తెలిపారు. విజయవాడలోని రామ్మోహన్ గ్రంథాలయం స్థాపనలో అయ్యంకి కృషి ఎనలేనిదని పేర్కొన్నారు.

అటువంటి మహనీయునికి మనవడిగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతం అని అందుకు తనకి గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఆనాడు అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయ స్థాపనలో ఎంతో కృషి చేసినారు అని ఈనాడు మనమందరం ఇక్కడ ఉన్నాం అంటే అది ఆయన నడిపిన గ్రంథాలయ ఉద్యమ ఫలితం అని పేర్కొన్నారు. అదే మార్గంలో ఆయన మనవడు మనం నడుస్తూన్నారన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చేయూత నిస్తూ గ్రంథాలయాలు అభివృద్ధి చెందటంలో మన వంతు కృషి విద్యార్థులు అందరూ గ్రంథాలయంలో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగులో కూరగాయలు, పండ్ల పేర్లను తప్పులు లేకుండా వ్రాయు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# తిరుమల సమాచారం

## టిటిడి విశ్వావసునామసంవత్సర పంచాంగం ఆవిష్కరణ



**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** అందరికీ అర్థమయ్యేలా, సులభంగా టిటిడి పంచాంగాన్ని ఆస్థాన సిద్దాంతి తంగిరాల వేంకట పూర్ణప్రసాద్ రూపొందించారు. ఇందులో రాజాధి నవనాయకుల ఫలితాలతోబాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, టిటిడిలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను చక్కగా వివరించారు. ఈనెల 30వతేదీ తెలుగునూతన సంవత్సరం విశ్వావసునామ సంవత్సరం ఆరంభం కానుంది. దీన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది టిటిడి పంచాంగం ముద్రిస్తుంది. ఈ పంచాంగాన్ని ఆదివారం ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, జెఇఒ వీరబ్రహ్మం, ప్రెస్ సేల్స్ వింగ్ ప్రత్యేకాధికారి రామరాజు, డిప్యూటీ ఇఒలు ప్రశాంతి, నటేశ్‌బాబు, గోవిందరాజన్, సెల్వం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఎస్ఇ వెంకటేశ్వర్లు, విజిఒ సదాలక్ష్మి తదితరులతో కలసి విశ్వావసునామ సంవత్సరం పంచాంగాన్ని ఆవిష్కరించారు. నేటి నుండి తిరుమల, తిరుపతిలో ఈ పంచాంగం విక్రయిస్తారు. మరో వారంరోజుల్లో మిగిలిన అన్నిప్రాంతాల్లోని టిటిడి సమాచార కేంద్రాల్లో 2025-26 విశ్వావసు నామసంవత్సరం పంచాంగం అందుబాటులో ఉంటుంది.



## గోవిందనామస్మరణల మధ్య తొలిరోజు తెప్పోత్సవం

**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** ఫాల్గుణ మాసం, దశమితిథిన ఆదివారం రాత్రి తిరుమలలో శ్రీవారి పవిత్రపుష్కరిణిలో సాలకట్ల తెప్పోత్సవం ప్రారంభమైంది. ఇందుకు సిద్ధం చేసిన తెప్పపై శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి తొలిరోజు ఆదివారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామ చంద్రమూర్తి అలంకారంలో మాఢవీధుల్లో ఊరేగుతూ పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఇక్కడ మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై కొలువుదీర్చారు. పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎస్టీవి రామ్‌కుమార్, ఇఇలు సుబ్రమణ్యం, సుధా కర్, డిఇ చంద్రశేఖర్, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. పుష్కరిణిలో నిరీక్షిస్తున్న భక్తులు, టిటిడి ఉద్యోగులు, గృహస్థభక్తులు గోవిందనామస్మరణలు చేయగా దేవదేవుడు అధిరోహించిన తెప్ప పుష్కరిణిలో పవిత్రమైన తీర్థంలో కదిలింది. రాత్రి 7గంటలకు మొదలైన తెప్ప మూడుచుట్లు ప్రదక్షణ చేసింది. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు.పుష్కరిణి గోవింద నామాలతో పులకించింది. పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపకాంతులు కనువిందుచేశాయి. ఆదివారం సాయంత్రం సహస్ర దీపాలంకారసేవ రద్దయ్యింది. భద్రతపరంగా అన్ని చర్యలు తీసుకున్నారు. తొలి రోజుతెప్పోత్సవం ప్రశాంతంగా ముగిసింది.

## టిటిడిలో ఆధార్ అథ్లెంటికేషన్

### తిరుమలలో భక్తులకు ఈకెవైసి అమలు

**తిరుమల,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు దర్శనాలు, వసతి సదుపాయం పొందేందుకు ఇకపై ఆధార్ అథ్లెంటికేషన్ అమలు చేయాలని టిటిడి అధికారులు నిర్ణయించారు. త్వరలో ఈకెవైసి విధానం టిటిడిలో అమలు కానుంది. ఇప్పటికే దళారీవ్యవస్థను కట్టడిచేసిన విజిలెన్స్ వింగ్ అధికారులు ఇప్పుడు నూతన విధానం అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం నుండి అనుమతికూడా లభించింది. ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తులు 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం, పలు రకాల ఆర్జిత సేవలు,అన్ని రకాల దర్శన టిక్కెట్లు, టోకెన్లు సహా తిరుమల, తిరుపతిలో ఉండే వసతి భవన సముదాయాల్లో గదులు బుకింగ్, పొందడం వాటికి ఈకెవైసి ఆధార్ అథెంటికేషన్ వ్యవస్థ అమలులోకి రానుంది. ఆన్‌లైన్‌లో టిక్కెట్ల బుకింగ్‌లో దళారుల జోక్యాన్ని నివారించడానికి టిటిడి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆధార్ అథెంటికేషన్‌కు దేవాదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ జివో జారీచేశారు.టిటిడి అధికారులు పారదర్శక సేవలను అందించడంలో భాగంగా ఈ విధానం అమలుకు సిద్దమవుతున్నారు. గత నవంబర్‌లో టిటిడి పాలకమండలి చట్టం చేస్తూ కేంద్రానికి లేఖరాశారు. అనుమతులు రావడంతో పూర్తిగా తిరుమలలో పారదర్శక సేవలు, గదులు ఎవరు, ఎన్నిరోజుల్లో ఎన్నెన్ని పొందారనే వివరాలు కూడా తెలిసిపోనుంది. కేంద్ర ఐటి,ఎలక్ట్రానిక్ మంత్రిత్వశాఖ నుండి అనుమతులు కూడా వచ్చేశాయి. ఆధార్ అథెంటికేషన్ జరిగితే దర్శన టిక్కెట్లు టోకెన్లు తీసుకున్న భక్తులకు బదులు మరొకరు రావడానికి వీలుండదు. భక్తుల పేరుపైనే గదులు బుక్‌చేయడం జరుగుతుంది. ఒక భక్తుడు ఎన్ని సార్లు ఏఏ దర్శనాలకు వస్తున్నారనేది కూడా తెలుసుకునే అవకాశం సులభమవుతుంది. ఇప్పుడు ఆధార్ ఈకెవైసి తిరుమలలోనూ టిటిడి అమలుకు సిదమైంది.




## మొగలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో 21నుండి మండలదీక్ష మాలధారణ

**తిరుపతి,మార్చి 9ప్రభాతవార్తప్రతినిధి:** నెల్లూరు జిల్లా లింగసముద్రంమండలం మొగలిచెర్లగ్రామంలో సిద్ధిపొందిన దత్తాత్రేయ స్వామి మండల దీక్షమాలధారణ ఈనెల 21,22,23తేదీల్లో మొదలవుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. మాలధారణకు సంబంధించి మాలలు భక్తులకు ఆలయం వద్ద ఇవ్వబడుతుందని, భక్తులు స్వామిదీక్ష తీసుకుని దత్తాత్రేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. 41రోజులు దీక్షాకాలమని, దత్తాత్రేయ స్వామి సిద్దిపొందిన వైశాఖ శుద్ధ సప్తమి మేనెల 4వతేదీ మందిరం వద్ద దీక్ష విరమణ చేయాల్సి ఉంటుందన్నారు. దీక్షాసమయంలో దత్తాత్రేయ మందిరం వద్ద ఉండి అనుసరించే ప్రతి భక్తునికి మందిరంలోని అన్నదాన సత్రంలో మధ్యాహ్నం, రాత్రి భిక్ష వితరణ జరుగుతుందన్నారు. దీక్షాధారులతో దత్తాత్రేయుని జపనామస్మరణ ,ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూపకల్పన జరుగుతోందన్నారు.. ఆలయంలో ప్రతి శుక్రవారం ఉదయం బృందావనార్చనసేవ, శనివారం రాత్రి పల్లకీసేవ స్వామివారికి విశేషంగా నిర్వహించబడుతుందన్నారు.

## లోక్‌అదాలత్‌ల్లో 49,056 కేసుల పరిష్కారం

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రమంతటా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఏపీ అత్యున్నత న్యాయస్దానంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్దాయిల కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌ల్లో 49,056 కేసులు పరి ష్కారమైనట్లు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, సభ్య కార్యదర్శి ఎం. బబిత పేర్కొన్నారు.

ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జస్టిస్ అవధానం హరాహరనాథ్ శర్మ, జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. హైకోర్టులో 125 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 343 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటు చేయగా 4842 కేసులు పెండింగ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులు 789 పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

వార్త

ఏ పని అయినా తరచూ చేస్తుంటే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.

న-ఎడ్వర్డ్స్

# ‘డోజ్’పై ట్రంప్ కేబినెట్ అసంతృప్తి!

ప్రభుత్వశాఖల్లో వృధా ఖర్చును తగ్గించే లక్ష్యంతో రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా వచ్చిన డొనాల్డ్‌ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ వ్యవస్థపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. అయినా కూడా ట్రంప్ వెనకడుగు వేయకుండా ఎన్నికల్లో తనకు కుడిభుజంగా మెలిగిన బిలియనీర్ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌ను చీఫ్‌గా నియమిస్తూ డిపార్టుమెంట్స్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)ను ఏర్పాటు చేసారు. ఇక అప్పటినుంచి కసరత్తులు మొదలు పెట్టిన డోజ్‌పై అటు అమెరికా ఉద్యోగుల్లోను,ప్రైవేటు వ్యవస్థల్లోను, అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించే రక్షణరంగపరంగా కూడా తీవ్రవిమర్శలువచ్చాయి. ఎన్నికలనంతరం శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టిన వెంటనే ముందు ప్రభుత్వశాఖల్లో వృధా ఖర్చును తగ్గిస్తామని, అవసరానికి మించి ఉన్న ఉద్యోగులకు ఉద్వాసన తప్పదని, అదేసమయంలో కష్టపడి పనిచేసేవారిని ఉన్నతస్థానాలకు తీసుకువస్తానంటూ ట్రంప్ హామీలు కుమ్మరించారు. ఈలోపు మస్క్ కూడా అంతర్జాతీయంగా దేశాలకు నిధుల సాయంచేస్తున్న యుఎస్‌ఎయిడ్‌ను రద్దుచేసే ప్రక్రియకు శ్రీకారంచుట్టారు. అందులో ఉన్న వివిధ దేశాల్లోని 20వేలమందికిపైగా ఉన్న ఉద్యోగులు ఇంటికిపోయే పరిస్థితి వచ్చింది. దీనితో అమెరికా ఫెడరల్ కోర్టుల్లో కేసులునమోదు అయ్యాయి. వెనువెంటనే ఆ నిర్ణయాన్ని రద్దుచేయడం, ఉద్యోగులను యధావిధిగా కొనసాగించాలని కోరడంవంటి పరిణామాలు చోటుచేసుకున్న సంగతితెలిసిందే. అన్నింటికంటే ముఖ్యంగా యుఎస్ ఎయిడ్‌ద్వారా నిధులు అందుకున్న దేశాల వివరాలను బయటపెట్టి మస్క్ సంచలనం సృష్టించారు. వీటిలో భారత్‌కూడా 20 మిలియన్ డాలర్ల సాయం పొందిందని ఇకపై ఇలాంటి దేశాలకు సాయం రద్దుచేయాలంటూ మస్క్ ఆదేశాలు జారీచేసారు. దీనితో ఇప్పుడు భారత్‌లో ఈ నిధుల వ్యవహారం అధికార విపక్షాలమధ్య విమర్శల కుంపటిని రాజేసింది. అసలు యుఎస్‌ఎయిడ్ అనేది అనవసరమని, ఉగ్రవాదులకు ఉగ్రకార్యకలాపాలకు ఈ నిధులు పక్కదారిపడుతున్నాయంటూ మస్క్, ట్రంప్ ఇరువురు కూడా తీవ్ర ఆరోపణలుచేసారు. వీటితోపాటు ప్రపంచ ఆరోగ్యసంస్థకు నిధులు తగ్గింపు కూడా కేబినెట్ సభ్యులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. యుఎస్ ఎయిడ్ తరపున ఇప్పటివరకూ నిధులు పొందిన దేశాల జాబితాను క్రోడీకరించి రూపొందించిన మస్క్ వ్యవస్థ వీటిలో తమకు అనుకూలం కాని దేశాల పేర్లను ప్రకటించడం, దారికితెచ్చుకోవడం కోసం మరికొన్ని దేశాలను ప్రకటించడం వంటివి చేస్తున్నట్లు అమెరికా యంత్రాంగంలోనే అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది. అసలు మస్క్ అధ్యక్షతన ఉన్న డోజ్‌పట్ల అమెరికాలో విపక్ష డెమొక్రాట్లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేయడం ఒక ఎత్తు అయితే స్వపక్షంలోనే డోజ్‌పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన వ్యక్తికాదని, మస్క్ అధ్యక్షతన డోజ్ పనిచేయడం అమెరికా రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమేనన్న వాదనను తెరపైకి తెచ్చారు. ట్రంప్ కేబినెట్ సభ్యులు సైతం డోజ్ చీఫ్‌గా మస్క్ వైఖరినితీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవలి కాలంలోనే అమెరికా ప్రభుత్వ ఉద్యోగులనుద్దేశించి ఈవారంలో మీరు ప్రభుత్వం కోసం చేసిన కృషిని తెలియజేయాలని రాత్రి 11.59 గంటల్లోపు తెలియజేయని వారిని విధుల్లో లేనట్లుగా భావిస్తామంటూ జారీచేసిన ఈమెయిల్స్ తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. దీనిపై ఉద్యోగులు మొత్తం ఏకతాటిపైకి వచ్చి మస్క్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. న్యాయస్థానాల్లో సైతం పలు కేసులను దాఖలుచేసారు. ఈపరిస్థితి ఇలాఉంటే ట్రంప్ నియమించిన ఈ మస్క్ వైఖరివల్ల అమెరికా పాలనాయంత్రాంగం కుంటుపడుతుందని,అనవసర వ్యయంపేరిట ఉద్యోగుల తొలగింపు సరైన విధానం కాదని, అవసరం ఉన్నచోట్ల వారిసేవలను వినియోగించుకోవాల్సిందిపోయి వారిని తొలగించడం ఎంత మాత్రం చట్టబద్ధంకాదంటూ కేబినెట్ సభ్యులే వాదిస్తున్నారు. డోజ్‌పై వస్తున్న విమర్శలను చక్కదిద్దేందుకు అత్యవసర కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసినఅధ్యక్షుడు ట్రంప్ సమక్షంలోనే ఆదేశ విదేశాంగమంత్రి మార్క్ రుబియో, డోజ్‌చీఫ్ ఎలాన్‌మస్క్‌లు వాదించుకోవడంచూస్తేఈవ్యవస్థపై అమెరికా కేబినెట్‌లోనే తీవ్ర అసంతృప్తి పేరుకుని ఉన్నట్లు తెలుస్తోంది.కేబినెట్ సమావేశంలో మస్క్ మాట్లాడుతూ విదేశాంగశాఖలో ఎవరినీ ఉద్యోగాలనుంచి తొలగించలేదని, తానుమాత్రం పనిచేయనివారిని తొలగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.వెంటనే స్పందించిన రుబియోఇప్పటికే 1500 మందికిపైగా ఉద్యోగులు ముందే పదవీ విరమణ చేసారని, నేను ఉద్యోగులను తొలగించినట్లు చెప్పుకోవాలంటే మళ్లీ వారిని విధుల్లోనికి తీసుకుని ఆపై తొలగించాల్సి ఉంటుందని వ్యంగ్యోక్తులు విసిరారు. డోజ్‌పగ్గాలు తీసుకున్న మస్క్ వచ్చీరావడంతోనే ముందు ఫెడరల్, ప్రభుత్వ ఉద్యోగులను తొలగించేందుకు సిఫారసులు చేస్తున్నారు. పనిచేయనివారు మాకొద్దని, బాగాపనిచేస్తే ఉన్నత స్థాయి కి తెస్తామంటూ వారికి తాయిలాలు విసురుతున్నప్పటికీ ట్రంప్ చేపట్టిన వివాదాస్పద నిర్ణయాల వల్ల అటు ఉద్యో గులు, ఇటు ప్రభుత్వశాఖల్లోను తీవ్ర నిరసన వ్యక్తంఅవుతోంది. ఓపక్క సుంకాలపేరిట ప్రపంచ దేశాలను దారికితెచ్చుకోవాలన్న ట్రంప్ అభిలాష ఎక్కడా కూడా కొలిక్కిరావడంలేదు.పాలనచేపట్టిన నెలన్నర రోజుల్లోనే ట్రంప్ వైఖరి కేవలం వాణిజ్య ధృక్పథంతో మాత్రమే ఉందని, పాలనాపరంగాను, సంక్షేమం పరంగా లేదని వస్తున్న విమర్శల్లో వాస్తవం లేకపోలేదని ఈ సందర్భంగా మనం నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

> పరుగెత్తేవారు వెనక్కి చూడకుండా ఎలా పరుగెడతారో, విజయంవైపు పయనించేవారు కూడా ముందుకే కానీ వెనక్కి చూడకూడదు.
>
> ఆస్కార్‌వైల్డ్



> శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు.
>
> థామస్ జెఫర్సన్



# దుర్భాషలు మాట్లాడే నేతలపై చర్యలు అవసరమే

**కొంతమంది శాసన సభ్యులు, రాజకీయ నాయకులు తాము ప్రజాప్రతినిధులమనే ఇంగితం కూడా మరచిపోయి వాట్స్ అప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికగా అధికార మదంతో అన్పార్ల మెంట్ పదాలే కాదు, కనీసం ఉచ్చరించడానికి వీలులేని బూతు పదాలను వాడిననేతలను అరెస్టు చేయడం అభినం దనీయం. హద్దులు దాటి కుటుంబ సభ్యులు, మహిళలను అవమానించే విధంగా మాట్లాడిన వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాల్సిందే. ఎన్నికల సంఘం కూడా నైతిక విలువలు పాటించని ప్రజాప్రతినిధులపై చర్యతీసుకోనే విషయంపై కూడా ఆలోచన చేయడం ఉత్తమం. లేదంటే చట్ట సభలు బూతులకు వేదికగా మారే ప్రమాదం వుంటుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రజాస్వామ్యంలో ఎవరైనాఏదైన మాట్లాడొచ్చు అనుకొంటే పొరపాటు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 నుంచి 22 వరకు పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన ప్రతి అంశంలో పౌరులకు సంపూర్ణ భావప్రకటనా స్వేచ్ఛను ఇస్తూనే ఆ స్వేచ్ఛ ఎట్టిపరిస్థితుల్లో సాటి పౌరుని స్వేచ్ఛను, గౌరవానికి భంగం కలిగించకూడదని వివిధ క్లాజులలో పేర్కొన్నారు. ఉదాహరణకి ఆర్టికల్ 10 పౌరుల భావప్రకటనా స్వేచ్ఛగురించి వివరించిన తర్వాత బ్లాక్1(ఎ)లో స్వేచ్ఛ పేరిట శాంతి భద్రతలకు భంగం కలిగించడం, సాటి పౌరులకు పరువు నష్టంకలిగించడం, కోర్టులను ధిక్కరించడం, నైతిక విలువలు పాటించకపోవడం వంటి అంశాలలో ఆంక్షలను విధించింది. రాజ్యాంగంలోని ఆయా అంశాలను దృష్టిలో పెట్టుకొనే చట్టసభలు చట్టాలు రూపొందిస్తాయి. ఇండియన్ పీనల్ కోడ్ పైన తెలిపిన ఆంగ్లలన్నింటికీ నేరాలుగా పరిగణించడమే కాకుండా శిక్షలు కూడా నిర్దేశించారు. చట్టం ముందు అందరూ సమానులు కావడంవల్ల రాజకీయాల పేరుతో సాటిపౌరులను ఏ విధంగా అవమానించినా శిక్షకు అర్హులే. నోరు మాటల కోసం ఏడిస్తే వీపు దెబ్బలకు ఏడ్చింది అనేసామెత. మొన్న మాజీ శాసన సభ్యులు వల్లభనేని వంశీ, నిన్న సినీనటుడు, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ పోసాని కృష్ణ మురళి అరెస్టులు అందుకు నిదర్శనం. అధికారంలో వున్ననాడు నోరుఅదుపులో పెట్టుకొని వుంటే నేడు శరీరాన్ని కటకటాలకు అప్పగించాల్సిన పని వుండేదికాదు. అధికారంలో వుంటే ఏదైనామాట్లాడొచ్చు అనుకొని విర్రవీగే ప్రబుద్ధుల పరిస్థితి ఇలా వుంటుంది. ఎంత ప్రజాస్వామ్యమైన కొన్ని స్వేచ్ఛకు నిబంధనలు పద్ధతులు వుంటాయి. ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త ఎ.జి. గార్డినర్ స్వేచ్ఛ అనేదానికి నిర్వచనం చెబుతూ “నీ చెయ్యి నా ముక్కును తాకడానికి ముందు వరకు నీ స్వేచ్ఛ ముగిసిపోతుంది’ అంటారు. చట్టంప్రకారం పరువు నష్టం, నైతిక విలువలు పాటించకపోవడంవంటి అంశాలలోపరువు నష్టానికి గురైన వ్యక్తేకాకుండా ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా కూడా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.పోలీసులు తగినచర్యలు తీసుకోవచ్చు. ఈకారణంగానే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాన్, లోకేష్ వంటి ప్రముఖుల పరువుప్రతిష్టలకు, గౌరవానికి భంగం కలిగించి న వ్యక్తులపై తెలుగుదేశంపార్టీ అభిమానులు, కార్యకర్తల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదుచేశారు. చట్టసభలలో మాట్లాడే సమయంలో ఉపయోగించకూడని పదాలు వినియోగిస్తే వాటిని ‘అన్ పార్లమెంట్ లాగ్వేజ్’ గా ప్రకటించడంతోపాటు ఆ పదాలను వాడిన సభ్యుడిని,ఆయా పదాలను ఉపసంహరించుకోమని కోరడంతోపాటు ఆ పదాలను రికార్డులను తొలగిస్తారు. అందువల్ల సీనియర్ సభ్యులు చట్టసభలలో విమర్శలను ఛలోక్తులు, సామెతల రూపంలోవాడేవారు. ఆ ఛలోక్తికూడా చాలా హుందాగా వుండేవి. రాజకీయ వేదికలు, చట్టసభలలో అధికార ప్రతిపక్షపార్టీలు విమర్శలు చేసుకొన్న ప్పటికీ హద్దులు దాటేవారుకాదు. విమర్శలుకూడా సిద్ధాంతపరంగా మాత్రమే వుండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, కౌన్సిల్‌లలో దీర్ఘకాలం సభ్యులుగా వున్న అయ్యదేవర కాళేశ్వర రావు, తరిమెల నాగిరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న,వావిలాల గోపాలకృష్ణయ్య, తెన్నేటివిశ్వనాధం, నీలం సంజీవరెడ్డి, కాసుబ్రహ్మానందరెడ్డి, సి.వి.నరసింహా రావు, జూపూడి యజ్ఞన్నారాయణ, కొణిజేటి రోశయ్య,ఎం. వెంకయ్యనాయుడు వంటి ఉద్దండ నాయకులు ప్రజా సమస్యలపై ఎంతో ఆవే శంగా మాట్లాడినా ఎదుటివారి గౌరవ మర్యాదలకుఎప్పుడూ భంగంకలిగించలేదు. 1980 ముందు వరకు కూడా రాజ కీయ నాయకుల ప్రవర్తన, ప్రసంగాలు ఎంతో బాగుండేవి. కొంతమంది ప్రతిపక్ష నాయకులు లేవనెత్తిన అంశాలు, విమర్శలు గ్రంథరూపంలో కూడా ప్రజలలోకి వచ్చేవి.అందుకు ఉదాహరణ కమ్యూనిస్టు నేతతరిమిల



నాగిరెడ్డి తన చట్టసభ్యత్వానికి రాజీనామా చేసిన సందర్భంగా చేసిన ప్రసంగం ‘తాకట్టులో భారతదేశం’ పేరుతో ఒక గ్రంథంగా రూపొందింది. సభలలో హాట్‌హాట్గా చర్చ జరిగినప్పటికీ సభ బయటకు వచ్చిన తర్వాత ప్రేమపూర్వకంగా ఒకరినొకరు పలుకరించుకొనే వారు. ప్రస్తుతం చట్టసభలలో అందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. బహిరంగంగానే కాకుండా చట్టసభలలో కూడా నోటికిఎంతమాట వస్తే అంతమాట అనేస్తున్నారు. ఉచ్ఛంనీచం లేకుండా వ్యక్తిగతం గానే కాకుండా ఇంట్లో వుండే మహిళల పట్ల కూడా నీచంగా మాట్లాడుతున్నారు. వీరిమాటలు, ప్రవర్తన చూస్తుంటే ప్రత్యేక చట్టాలు రూపొందించాలనిపిస్తోంది. రికార్డులను పరిశీలిస్తే దేశంలో అత్యున్నతమైన పార్లమెంటులో కూడా సభ్యులు ఎంతో హుందాగా వ్యవహరించేవారు. ప్రధాన మంత్రులుగా పనిచేసిన వాజిపేయి,పి.వి.నరసింహా రావు వంటి వారు కవితలు చదివి సభ్యులను అలరించేవారు. పలువురు సభ్యులు విమర్శలను ఛలోక్తులుగా చేసేవారు ఛలోక్తులు విసరడంలో కేరళకు చెందిన లోక్‌సభ సభ్యులు పిలుమోడి దిట్ట. ఒకసారి లోక్‌సభలో పిలుమోడి మాట్లాడుతూ “ఈ సభలో ‘సగం మంది గాడిదలే వారికి ఆలోచన శక్తిలేదు’ అని వ్యాఖ్యానించారు. దాంతో సభ్యులు చాలా మంది ఆ మాటలకు నిరసన తెలిపారు. దాంతో ‘ఆ పదాలు ఉపసం హరించుకోవాలి’అని సభాధ్యక్షులు రూలింగ్ ఇచ్చారు.దాంతో పిలుమోడి లేచి ఈ సభలో సగంమంది సభ్యులు గాడిదలు కాదు’ అని అన్నాడు. (తాను తొలుత మాట్లాడుతూ సగంమంది గాడిదలు అని మాత్రమే వాడటం వల్ల) సభాధ్యక్షుని సూచన మేరకు సగం మంది సభ్యులు గాడిదలు కాదు అని ప్రకటిస్తున్నాను ఛలోక్తి విసిరారు. దాంతో సభలో నవ్వులు పువ్వులయ్యాయి. ఇదేవిధంగా మరో సందర్భంలోపిలుమోడి కొంచెం ఆవేశంగా మాట్లాడుతున్న సమయంలో సభాధ్యక్షులు కల్పించుకొని మాట్లాడే సమయంలో కాస్త వెనుక,ముందు చూసుకోవాలనిఅన్నారు. వెంటనే పిలుమోడి సమాధానంగా ‘నాకు వెనుక.. ముందు ఏమిలేదు. నేను గుండ్రంగా వుంటాను’ అని భారీకాయంతో వుండే పిలుమోడి తనమీద తానే జోక్ వేసుకోవడంతో సభ్యులు నవ్వు ఆపుకోలేకపోయారు. 2012,మే 4వ తేదీన రాజ్యసభలో ఇండియన్ ఎకనామిక్స్ కౌన్సిల్ మేనేజిమెంట్ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ఆ సభలో సభ్యునిగా వున్న తధాగత శతపతి ఆ బిల్లుపై మాట్లాడటానికి పైకి లేచినప్పుడు రాజ్యసభ చైర్మన్ కల్పించుకొని దీనిపై తర్వాత మాట్లాడటవచ్చు అన్నారు. దాంతో శతపతి కల్పించుకొని మీకు నేను మాట్లాడటం ఇష్టం లేదా?’ అని వ్యాఖ్యానించారు. దాంతో రాజ్య సభ చైర్మన్ సరేలే మాట్లాడండి కాని ‘యు కెన్ స్పీక్ బట్ యు విల్ హెవ్ టు బి షార్ట్’ అని ఇంగ్లీషులో అన్నారు. దాంతో శతపతి కల్పించుకొని ‘సార్ ఆయామ్ వెరీ షార్ట్, ఐవుడ్ యాక్చువల్లీ లైక్ టు బి సిక్స్ ఫీట్ అండ్ 2 ఇంచ్సెప్, ఐట్ అయామ్ వెరీ షార్ట్’ అని ఇంగ్లీషులో అనడంతో (సభ్యుని ఉద్దేశించి మీకు తక్కువ సమయంలోమాట్లాడాలనే భావంతో చైర్మన్ ‘యువిల్ హేవ్ టు బిషార్ట్ అనడాన్ని శతపతి ఆ పదాలను మీరు పొట్టిగా వున్నారనే అర్థం వచ్చే విధంగా వ్యంగీకరిస్తూ “అయ్యా ఏం చేయను నేను కూడా ఆరు అడుగుల 2అంగుళాలు పొడవు వుండాలని అనుకొన్నాను. కానీ నేను పొటిగా వున్నాను) సభలోని సభ్యులందరూ పక్కున నవ్వారు. ఇటువంటి ఛలోక్తులు, వ్యంగ ప్రసంగాల స్థానంలో వ్యక్తిగత విమర్శలు, బూతులు చోటు చేసుకోవడం విచారకరం. కొంతమంది శాసనసభ్యులు, రాజకీయ నాయకులు తాము ప్రజాప్రతినిధులమనే ఇంగితం కూడా మరచిపోయి వాట్స్ అప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్‌మీడియా వేదికగా అధికారమదంతో అన్పార్లమెంట్ పదాలేకాదు, కనీసం ఉచ్చరించడానికి వీలులేని బూతుపదాలను వాడిననేతలను అరెస్టు చేయడం అభినందనీయం. హద్దులు దాటి కుటుంబ సభ్యులు, మహిళలను అవమానించే విధంగా మాట్లాడినవారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాల్సిందే. ఎన్నికల సంఘం కూడా నైతికవిలువలు పాటించని ప్రజాప్రతినిధులపై చర్యతీసుకొనే విషయంపై కూడా ఆలోచన చేయడం ఉత్తమం. లేదంటే చట్టసభలు బూతులకు వేదికగా మారేప్రమాదం వుంటుంది. నవ్విపోదుగాక నాకేమి సిగ్గు అన్నట్టు నోరు అదుపులోపెట్టుకోని నేతలు వరుసగా అరెస్టులు అవుతున్నప్పటికీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ఇటీవల ఒకసందర్భంగా ‘తాము అధికారం వచ్చినతర్వాత పోలీసు అధికారులను బట్టలూడదీసి రోడ్డుమీద నిలబెడతా’ అని బహిరంగంగాబెదరించారు.ఒకపార్టీ అధ్యక్షుడే ఆవిధంగా మాట్లాడితే ఇకసాధారణ సభ్యులు ఏవిధంగా మాట్లాతారో చెప్పనవసరంలేదు. ●

# పన్నులతో ప్రపంచ యుద్ధం మొదలెట్టిన అమెరికా

డా.డి.వి.జి. శంకరరావు

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచస్థాయి యుద్ధానికి పచ్చజెండా ఊపింది.అది గన్నులతో కాదు. పన్నులతో, సుంకాలతో, సాంప్రదాయకంగా ఆయుధాలతో కాదు. వాణిజ్యంతో. ఉద్దేశ్యం ఒకటే విజేతగా నిలవాలని. ఉద్దేశ్యం నెరవేరుతుందో, లేదో కానీ యుద్ధరంగంలో ప్రకంపనలు అయితే సృష్టిస్తోంది. ప్రత్యర్థిగా ఏదో ఒక దేశమో కాదు, ప్రపంచమంతా ప్రత్యర్థులుగానే భావిస్తోంది. మళ్లీ అమెరికాని ఘనమైన దేశంగా నిలబెడతానన్న ట్రంప్ తన ప్రతినకు ఇలా రూపమిస్తున్నారు. మొదట చైనా, కెనడా, మెక్సికోల దిగుమతులపై పన్నులు పెంచారు. భారత్‌కు సైతం ఇదే తరహా ట్రీట్మెంట్ తప్పదన్నారు. కెనడా, మెక్సీకోల ఉత్పత్తులపై ప్రకటించిన పాతికశాతం పన్నుని తాత్కాలికంగా వాయిదా వేసినా చైనాకు త్వరలో పది శాతం అదనపు పన్ను తప్పదన్నారు. చైనా ఢీ అంటే ఢీ అంటుంది. అమెరికా నుండి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచింది. ప్రస్తుతానికి అమెరికా భారత్‌కి హెచ్చరికలు జారీ మాత్రమే చేసినా,త్వరలో హెచ్చివేతలు తప్పవు. ఫలితంగా ప్రపంచ వాణిజ్యం మార్పుకి లోనవుతుంది. మారిన సమీకరణాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వస్తు,సేవల సరఫరా కుదుపుకి లోనవుతాయి. అమెరికా స్వీయ ఆర్థిక రక్షణ విధానం



పాటిస్తే తప్పేమిటి? అది వారి హక్కు అనిపించవచ్చు. కాదనలేం. కానీ దేశాల నడుమ ఉన్న, ఉండాల్సిన వాణిజ్య ఒప్పందాలను ఒక్క ఉదుటున మార్చితే దుష్పరిణామాలు తప్పవు. బలహీనమైన దేశాలకు రక్షణ ఉండదు. ఉదాహరణకు అమెరికా తాను రైతులకు విపరీతంగా రాయితీలు ప్రోత్సాహకాలు ఇచ్చి పండించిన పంటల్ని వేరే దేశంలో చౌకగా డంప్ చేస్తే అక్కడి స్థానిక రైతులు నష్టపోతారు. వ్యవసాయం కుదేలౌతుంది. అలా జరిగిపోయాక, ఆ దేశం అమెరికాపై, లేదా అలాంటి వేరే దేశంపై ఆధారపడడం పెరిగిపోతుంది. అప్పుడు అమ్మినోడిదే ఆఖరి మాట అవుతుంది. ఉత్పత్తులపై మోనోపలి ఏర్పడి మిగతా దేశాలు నష్టపోతాయి. అందుకోసమే దేశాల మధ్య న్యాయమైన వాణిజ్య ఒప్పందాలు ఉండాలి. ఇరువురికీ మేలు జరగాలి. పోనీ ఈ విధానం ద్వారా అమెరికా ప్రజలు బాగుపడతారా అంటే చెప్పడం కష్టం. దిగుమతులపై సుంకాలు పెరగడం, సరఫరా తగ్గడంతో ద్రవ్యోల్బణం పెరిగి, వస్తువులు ప్రియమోతాయి. అసలే ఆ దేశానికి దిగుమతులపై ఆధారపడడం ఎక్కువ. ఇలా ఇరువురికీ నష్టం కలిగించే యుద్ధానికి ట్రంప్ సిద్ధపడ్డారు. ప్రస్తుతానికి తమ అవసరాలకు,ఎగుమతులకు వేరేఇతర మార్కెట్‌లను చూసుకోవడం,ద్వైపాక్షి కఒప్పందాలు కుదుర్చుకోవడం,ఎదురు పన్నులతో అమెరికాను ఢీ కొట్టడం

# హాల్ టికెట్ల కోసం తప్పని తిప్పలు

కైలసాని శివప్రసాద్

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రైవేటు విద్యాసంస్థలలో లక్షలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థి దశలో అత్యంత కీలకమైన పదవ తరగతి, ఇంటర్ మీడియేట్ మొదటి, రెండవ సంవత్సర వార్షిక పరీక్షలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో దాదాపు ప్రారంభమయ్యాయి. వార్షిక పరీక్షల ప్రారంభ సమయంలో గత కొద్ది రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రైవేటు విద్యాసంస్థల వద్ద హృదయవిదారక దృశ్యాలు కనిపించాయి.ఫీజులు చెల్లించలేక, ఫీజులు చెల్లించేంత వరకుపరీక్షలు రాసేందుకు అవసరమైన హాల్‌టికెట్లు ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇవ్వక విద్యార్థులు అనేక మంది కన్నీటి పర్యంతం అయ్యారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇటువంటి కదు దయనీయమైన దృశ్యాలు కంటిలో నీళ్ల తెప్పిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ పరిణామాలకు బాధ్యులుగా ఎవరిని నిందించాలి? వేలాది, లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత తమకు లేకున్నా తమపిల్లలను కార్పొరేట్‌పాఠశాలలో చేర్పిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులనా? విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా ముందు మాకు చెల్లించవలసినది చెల్లించి హాల్‌టికెట్లు తీసుకెళ్లండి అని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఫీజు బకాయి కొరకు వ్యాపార దృక్పథంతో ఒత్తిడి చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలనా? గత కొద్ది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉద్భవించే ఇటువంటి పరిణామాలపట్ల చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలనా? 90దశకం నుండి గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటూ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో నగర,పట్టణ, గ్రామ స్థాయివరకు ప్రైవేటు,కార్పొరేటు విద్యాసంస్థలు పుట్టగొడుగు లుగా వ్యాపించాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు దేశంలో ఎక్కడాలేవు అనేది నిర్వివా దాంశం.ఈప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులపై నిర్దిష్ట ప్రమా ణాలు లేవు. అదేవిధంగా ఏమాత్రం నియంత్రణా లేదు. ఒక్కో విద్యాసంస్థలో ఒక్కో తరగతికి ఒక్కో ఫీజు మొత్తం వసూలు చేస్తూ ఉండడం గమనార్హం. అయినా బలమైన ఆర్థిక నేపథ్యం ఉన్న వారితోపాటూ ఎగువ,దిగువ మధ్య తరగతి ప్రజలు తమ తాహతకు మించి తమ పిల్లలను ఈ కార్పొరేట్ విద్యాసంస్థలలో చేర్పిస్తున్నారు. కొంత మంది పేద ప్రజలు కూడా అనాలోచితంగా తమ శక్తికి మించి పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థలలో చేర్పించి ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుంటున్నారు. తమకన్నా తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలి. ప్రైవేటు విద్యాసంస్థలలో చదివిస్తే తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది అనే ఉద్దేశ్యంతో పేద,మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో చేర్పిస్తున్నారు. పర్యవసానంగా తమ పిల్లల ఫీజులు చెల్లించేందుకు, చెల్లించలేకవారు అష్ట కష్టాలు అనుభవిస్తున్నారు. అనేకమంది తమఆస్తులు అమ్ము



కుంటున్నారు. కొంతమంది అప్పుల పాలవుతూ అవమానాల పాలవుతున్నారు. అదేవిధంగా మరికొంత మంది తమ పిల్లలను నాణ్యమైన ఉన్నత చదువులు చదివించుకునేందుకు సొంత ఊర్లను,అయినవారిని వదలి సుదూర ప్రాంతాలకు వలస వెళుతూఉన్నారు. అలావెళ్లిన వారు తమపిల్లలను ప్రైవేటు,కార్పొరేట్ విద్యాసంస్థలలో చేర్పించి అష్టకష్టాలు పడుతూ చాలీ చాలని ఆదాయంతో తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా తాము సంపాదిస్తున్న మొత్తాన్ని తమ పిల్లల ఫీజులకు, భవిష్యత్తుకే వెచ్చిస్తూ ఉంటారు. ప్రైవేటు విద్యాసంస్థలలో చేర్పించే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల మొత్తంఫీజులో కొద్దిగా మాత్రమేచెల్లిస్తారు. కాలక్రమేణా కొద్దికొద్దిగా ఫీజ్ చెల్లిస్తూ విద్యాసంవత్సరం చివరిన వార్షిక పరీక్షల సమయంలో మొత్తంఫీజు చెల్లిస్తారు. కొద్దిమంది వార్షిక పరీక్షల సమయంలో కూడా ఫీజులు చెల్లించలేకపోతారు. అలా ఫీజు చెల్లించని వారి పిల్లలను వార్షిక పరీక్షలకు కూర్చోబెట్టమని బెదిరిస్తూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు నానా యాగీ చేస్తాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటూ,విద్యార్థులూ తీవ్ర మనోవ్యథకు గురిఅవుతూ వారు అనుభవించే బాధ వర్ణనాతీతం. అత్యధిక భాగం విద్యాసంస్థలు ఫీజుల కొరకు స్వయంగా విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ఉండడంతో విద్యార్థుల జీవితాల పురోభివృద్ధికి అత్యంత అవశ్యకమైన పది, ఇంటర్ మీడియేట్ చివరి సంవత్సరపు పరీక్షలు రాసే విద్యార్థులు అనేక మంది డిప్రెషన్‌లోకి వెళ్ళిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తోటి విద్యార్థుల ముందు విద్యాసంస్థల ఫీజు కొరకు ఒత్తిడిచేయడంతో అవమానంగా భావించిన విద్యార్థులు కొందరు అక్కడక్కడా ఆత్మహత్యా యత్నాలు చేసుకున్న దృశ్యాలు కూడా ఇటీవల కనిపించడం చాలా బాధాకరం. వేలు, లక్షల రూపాయలున్న ఫీజు మొత్తంలో కేవలం 10 వేలు,20 వేల రూపాయలు బకాయిలు ఉన్న విద్యార్థులను కూడా వార్షిక పరీక్షలకు కూర్చోబెట్టేందుకు, హాల్ టికెట్లు ఇచ్చేందుకు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు, ఒత్తిడికి గురిచేస్తూ ఉన్నాయి. విద్యార్థులకు సంబంధించిన ప్రతి సర్టిఫికెట్ విద్యా సంస్థలలో ఉంటాయి. వార్షిక పరీక్షలైన వెంటనే విద్యాసంస్థ నుంచి పోయేటప్పుడు విద్యార్థికి కచ్చితంగా ఆ సర్టిఫికెట్లు కావాలి. ఆసమయంలో కూడా బకాయి ఉన్నఫీజును విద్యాసంస్థలు రాబట్టుకోవచ్చు. కానీ ఈసమయం మించిపోతే ఫీజురాదు అన్నట్లుగా వార్షిక పరీక్షల సమయంలో ప్రైవేటు విద్యాసంస్థలు కాల్‌మనీ సంస్థలుగా వ్యవహరిస్తూ విద్యార్థులనుంచి ఫీజు బకాయిలు వసూలు చేస్తూఉండడం శోచనీయం.తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అవమానభారంతో తమ పిల్లలఫీజుల కొరకుప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న ఒత్తిడి విషయంపై ఉన్నతాధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఒత్తిడిచేయకుండా వ్యహరిస్తున్నారు. ఇటీవల ఉభయరాష్ట్రాలలో పరీక్షలకు ముందుహాల్ టికెట్లు విద్యార్థుల వాట్స్‌ఆప్ నంబర్లకుపంపి ఈ విషయాన్ని ఉన్నతాధికారులు చాలా గొప్పగా చెప్పుకున్నారు. కానీ ఆ హాల్‌టికెట్లలో హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్ సంతకముండాలి అనే నిబంధన పెట్టారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు బకాయి ఉన్న విద్యార్థులు కచ్చితంగా హెడ్మాస్టర్ లేదా ప్రిన్సిపాల్‌ను కలవాలి. దీనివలన విద్యార్థులకు ప్రత్యేకంగా ఒరిగేదిఏముంది? కేవలం క్యూ ఆర్ కోడ్‌తో సెంటర్ లొకేషన్ కనుక్కోవడానికే హాల్ టికెట్లు ప్రత్యేకంగా విద్యార్థుల మొబైల్ నంబర్‌లకు ఏమాత్రం అవసరం లేదు. సెంటర్ పేరుతో లొకేషన్ పెట్టుకొని నేరుగా గమ్యస్థానానికి చేరుకునే వెసులుబాటు ప్రతివిద్యార్థికి ఇప్పటికే ఆండ్రాయిడ్ మొబైల్ రూపంలో ఉంది. ప్రైవేటు విద్యాసంస్థల అక్రమాలపై

# ప్రజావాక్కు



## మానసిక దివ్యాంగులకు ఆదరణేది?

ఏదో ఊహించని ఘటనతో, తీవ్ర ఒత్తిడితో, కుటుంబ సమస్యలతో, ప్రేమ విఫలంతో వ్యాపార సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో, ఆరోగ్యం కుదుటపడక ఎందరో నవయుకులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు సైతం మతిస్థిమితం కోల్పోతున్నారు.అట్టివారిని ఆస్పత్రులకు తీసుకువెళ్లకుండా మూఢనమ్మకాలతో మంత్రగాళ్లు, పూజారులు, పాస్టర్లు, ఇమామ్‌ల వద్దకు తీసుకువెళ్లి వారి బతుకులను ఛిద్రం చేస్తున్నారు. ఈ అమానవీయాన్ని అధికారులు అడ్డుకొని వారిని మామూలు మనుషులుగా చేయగలరు.

-తూలుగు రమణారావు, అక్కరాపల్లి

## స్వయం ఉపాధి కల్పించాలి

పేదరిక నిర్మూలన లక్ష్యంగావచ్చిన ఐదవ ప్రణాళిక కాలంలో ప్రారంభించిన డ్వాక్రా ఊడలమర్రి లాగా విస్తరించింది. ఇది గ్రామీణఆర్థికానికి మూలస్తంభం లాంటిది. అవుతే దీనివల్ల పొదుపురేట్ పెరగడంతో పాటు మహిళా శక్తి ఇనుమడిస్తుంది. ఇక పోతే మహిళ సంఘాల లోన్స్ దొరకడంవల్లా మహిళలు సమిష్టితత్వంతో పాటు మహిళలు చిన్నచిన్న వ్యాపారవేత్తలుగా తయారు అవుతున్నారు. ఇది స్వయం ఉపాధిగా తయారు అవుతుంది. ఇక మహిళలకు ఇచ్చే రుణాలను 10 నుండి 15 లక్షలకు పెంచితే వారికి పెట్టుబడి పరంగా ఇబ్బందులుండవు. తెలంగాణలాంటి రాష్ట్రాలలో కూరగాయల ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. ఒక్క ఉమ్మడి రంగారెడ్డి లాంటి జిల్లాలు మాత్రమే కూరగాయల సాగులో ముందు ఉంటున్నాయి.మిగతావి అంతంతమాత్రమే.అయితే మొన్నటి ఆర్థిక సర్వే చెప్పిన వీహబ్ విజయవంతం కేవలం సాంకేతికరంగంలో మహిళలను ప్రోత్సహించడంవరకే వీలైంది.

-భారత అవినాష్, జనగామ

## ఆలోచించండి!

మొబైల్ ఫోన్ అనేది నేడు మన జీవితంలో ఒక భాగం అయిపోయింది. ఇంట్లోనే కూర్చుని మొబైల్ ద్వారా మనకి కావలసినవి పొందుతున్నాం. మొబైల్ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అంతే నష్టాలు కూడా ఉన్నాయి. మన అవసరమైనంతవరకు సరైన విధంగా ఈ మొబైల్‌ని వాడాలి.లేకపోతే చిక్కులోపడతాం.ఆర్థికంగా, మానసికంగా ఆరోగ్యపరంగా అనేకరకాలుగా ఇబ్బందులుపడతాం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## ప్రాచీనతను కాపాడాలి

తెలంగాణలోని కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి క్షేత్రం ఎంతో ప్రాచీనమైనది. విష్ణుకుండినుల కాలంనుంచి ఈ ఆలయం ఉనికిలోఉంది. రాతి స్థంబాలతో నిర్మితమై చూడ చక్కగా ఉంటుంది. ఈ రాతిస్థంబాలు ప్రాచీనతకు గుర్తు. కాగా కీసరగుట్ట దేవస్థానం వారు ఆలయ రాతిస్థంబాలకు బంగారు రంగు రసాయన పెయింట్ వేసి ఆలయ ప్రాచీనతను దెబ్బతీశారు. ఆలయ అధికారులు పురాతన ఆలయాల పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించి వాటి ప్రాచీనతను కాపాడాలి. కావున దేవాదాయశాఖ అధికారులు వెంటనే రాష్ట్ర పురావస్తుశాఖ వారిని సంప్రదించి ఆలయ స్థంబాలకు వేసిన రసాయన పెయింట్‌ను శాస్త్రీయంగా తొలగించి యథారూపం కల్పించాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## ఓటు ఎలా వేయాలో తెలియదా?

డిగ్రీపట్టభద్రుల స్థానంలో 2,52,029 మంది డిగ్రీ పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకుంటే ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు. చాలామంది పట్టభద్రులు 1 అంకెను ఇద్దరికి వేశారు. అదేవిధంగా 01,వన్ అని అంకెలో వ్రాసి (01),పైగా కొందరు టిక్‌పెట్టారు. నచ్చిన అభ్యర్థి పక్కన అంకె వేసి రౌండ్ చుట్టారు. ఓకే అని కూడా రాశారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన పెన్నుతోనేవాడకుండా సొంతపెన్నులను వాడారు.చాలా మంది అంకెల్నివేసి పక్కన సంతకాలుపెట్టి, పేర్లురాశారు. ఓటర్లంతా పట్టభద్రులైనా ఎలా ఓటేయాలనే అవగాహన లేదా? ఇ.సి మీడియాద్వారా అవగాహన కల్పించినా ఓటును ఎలావినియోగించాలో రాలేదంటే మనవిజ్ఞానం మనకే తెలియాలి.

-సింగు లక్ష్మీనారాయణ, కొత్తపల్లి, కరీంనగర్

## పాడిరైతుకు భరోసా ఏది?

ప్రపంచ పాల ఉత్పత్తిలో భారత ప్రథమ స్థానంలో ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా లక్షల మంది పాడిని కుటీర పరిశ్రమగా చేపట్టి జీవనోపాధి పొందుతున్నారు. ఇందులో అధిక శాతం మహిళలు ఉన్నారు. అసంఘటిత రంగం కావడంతో బ్యాంకులు కూడా వీరికి రుణాలు అంత సులువుగా మంజూరుచేయడంలేదు.తీరా ఇన్నిఇబ్బందులను ఎదుర్కొనిపాలను ఉత్పత్తి చేసినా వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. పాడి రైతులకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులను ఆదుకుంటేనే మనిషి మనుగడ.

-ఎం. ముత్యం రెడ్డి, సిద్దిపేటజిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

## మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

### - స్త్రీ విముక్తి సంఘటన సభలో వక్తల పిలుపు

**ఒంగోలు టౌన్, మార్చి 9, ప్రభాతవార్త**



అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా ఈమనిపాలెం నందు స్త్రీ విముక్తి సంఘటన జిల్లా జిల్లా కార్యదర్శి శాంతకుమారి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జనాన్ని జీవితం చుట్టూ కాకుండా మతం చుట్టూ ఆలోచించేలా ప్రేరేపిస్తున్నారని, మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా మార్చే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. జనసాహితీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.వి. కృష్ణయ్య మాట్లాడుతూ సౌందర్య ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మహిళలను వాడుకోవడం సామ్రాజ్యవాద వికృతమేనని, వస్తు వ్యామోహ సంస్కృతికి బలైపోతున్న మహిళలను కాపాడుకోవాల్సిన బాధ్యత వుందన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.తిరుమల మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు బందీలు అయ్యారని, హింసాత్మక మార్గంలోకి వెళ్లకుండా చూడటమే తక్షణ కర్తవ్యం అన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి మాట్లాడుతూ ప్రకృతి సంపదను, మానవ శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులు, వారికి ఊడిగం చేస్తున్న పాలకుల వల్లనే ప్రజలకు కష్టాలు అని, కుంభమేళా ఒక వ్యాపారం అని తెలియక అమాయకులు తరలివెళ్ళి తొక్కిసలాటలో బలైపోయారన్నారు. సదస్సులో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షులు డి.రేణుక, ఎపిటిఎఫ్ అనురాధ, విద్యార్థినులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియారిటీ లిస్ట్‌లో సవరణలు చేయాలి

### - అసిస్టెంట్ డైరెక్టర్‌కు హెచ్‌టియు నేతల వినతి

**ఒంగోలు టౌన్, మార్చి 9, ప్రభాతవార్త**



2025 హిందీ సీనియారిటీ లిస్ట్‌లో సవరణలు చేయాలని కోరుతూ హిందీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పఠాన్ మెహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో పలువురు జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత సీనియారిటీ లిస్ట్‌లో 2019 ప్రమోషన్ లిస్ట్‌కు అనుగుణంగా వుండాలని, అంతర్‌జిల్లా బదిలీపై వచ్చిన వారి యొక్క సీనియారిటీని మన జిల్లాలో జాయిన్ అయిన తేదీనే సీనియారిటీగా పరిగణించాలని, 2019 నవంబర్ కంటే ముందు ప్రమోషన్ పొందిన వారి జాబితా కూడా మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిలో ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెచ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పోలు శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జి.భాస్కర్‌రావు, కందుకూరు డివిజన్ అధ్యక్షులు మస్తాన్‌వలి, మహిళా విభాగం నేత ఉజ్మా బాను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ఒంగోలు టౌన్, మార్చి 9, ప్రభాతవార్త**



నెహ్రూ యువకేంద్ర మైభారత్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకె జిల్లా యువజన అధికారి కమల్‌సా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో , దేశ నిర్మాణంలో మహిళల పాత్ర అద్వితీయమని, అదే స్ఫూర్తిగా విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఎస్ఎస్ఎన్ గ్రూప్ ఛైర్మన్ రామలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్‌వైకె ఎంటిఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**జనశిక్షణా సంస్థాన్‌లో...**



స్థానిక గద్దలగుంట శిక్షణా కేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్యామ్‌సునీల్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి ధ్యేయంగా రెండు దశాబ్దాలకు పైగా సంస్థ పనిచేస్తున్నదని, వృత్తి విద్యా శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగడం సంతృప్తి ఇస్తోందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు లక్ష్మీ, నాగమల్లేశ్వరి, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

### లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో పట్టణములో చిన్నచిన్న వ్యాపారం చేసుకునే మహిళలను గుర్తించి వారికి కొంచెం చేయూతగా లైన్స్ క్లబ్ లోగో కలిగినటువంటి గొడుగులను పంచడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఈదరవెంకటేష్, కార్యదర్శి పార్థసారథి, కోశాధికారి స్వామి క్లబ్బు పూర్వ అధ్యక్షులు తమ్మన ఆంజనేయులు, రాంబాబు, గోపి, కిషోర్, విజయ్, శ్రీనివాస్, రవి, శంకరరావు, రాంప్రసాద్ మొదలగు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా క్లబ్ ఫౌండర్ కూ రపాటి రమేష్ పాల్గొన్నారు

## కమ్మ సేవా సంఘం నూతన కార్యాలయం ప్రారంభం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం కమ్మ వారి సేవా సంఘం నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలో అట్టహాసంగాప్రారంభించారు. స్థానిక నిర్మల్ నగర్ నందు నిర్మల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని సంఘం అధ్యక్షులు మండవ మురళి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయం నందు సంఘం సభ్యులతో కలసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ గడిచిన నాలుగు నెలల నుంచి కమ్మ వారి సేవా సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు తమ సంఘం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. రాజకీయాలకు తావు లేకుండా తమ సంఘం పని చేస్తుందని అలన్నారు. గౌరవ అధ్యక్షులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ కమ్మ సేవా సంఘం మంచి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. సంఘం సెక్రటరీ ఆలా హనుమంతరావు మాట్లాడుతూ డోనార్స్ క్లబ్ పేరుతో ప్రతి నెల లక్ష రూపాయలు వరకు పేద విద్యార్థుల ఫీజుల కోసం అందిస్తానని పేర్కొన్నారు,అనంతరం పలువురు పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను సభ్యుల చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి. శ్రీనివాసరావు, కాట్రగడ్డ రఘు, భాపయ్య చౌదరి, అబ్బూరి శ్రీనివాసరావు, దుగ్గినేనీ వెంకట్రావు, బొడ్డ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం

**ఒంగోలు టౌన్, మార్చి 9, ప్రభాతవార్త**



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఉల్లాస భరితంగా జరిగింది. పిల్లలచే పుస్తక పఠనం అనంతరం ఉపాధ్యాయులు జాలాది మోహన్ నీతి కథలు బోధించి స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్రను వివరించారు. ఉపగ్రంధ పాలకులు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో సమానత్వం, హక్కుల పరిరక్షణ, సాధికారత కోసమై మహిళలకు బాసటగా నిలవాలని అందరూ ప్రతినబూనడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది అనిల్, ఇమ్మానుయేల్, పాఠకులు పాల్గొన్నారు. సిబ్బంది అనిల్, ఇమానుయేల్, పాఠకులు పాల్గొన్నారు.

# గట్టెక్కుతామా.. నష్టపోతామా..



### - నేడు పొగాకు వేలం ప్రారంభం
### - ధరలు పెంచాలంటూ..?



**ఒంగోలు, ప్రభాతవార్త**

పొగాకు బోర్డు ఒంగోలు రీజన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలో మొత్తం పొగాకు వేలం కేంద్రాలు 11 ఉన్నాయి. నేటి నుంచి ఒంగోలు-1, కొండపి, పొదిలి, కందుకూరు-1, వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానున్నాయి. మిగిలిన కందుకూరు-2, కనిగిరి, డీసీ పల్లితో పాటు ఒంగోలు-2, టంగుటూరు, వెల్లంపల్లి, కనిగిరి వేలం కేంద్రాల్లో ఈనెల 19వ తేదీ నుంచి మొదలవుతాయి. 2025-2026 సీజన్‌కు సంబంధించి 11 కేంద్రాల పరిధిలో 105.27 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకునేందుకు ఈ ఏడాది బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే ప్రస్తుత సాగు విస్తీర్ణం వస్తున్న ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని 162 మిలియన్ కేజీల వరకు ఈ సీజన్‌లో అమ్మకాలు ఉండవచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న పొగాకు వేలం అక్కడి రైతులకు కొంత ఆశాజనకంగా ఉందని అధికారులు చెప్తున్నారు. బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.337 వరకు ఉంటుంది. మొత్తంగా కేజీ సరాసరి ధర చూస్తే రూ.265.25ల వరకు ఉంది. అయితే ఆంధ్రలో పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది పొగాకు నాణ్యత, ఆశాజనకంగా ఉండటం రైతులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. మొత్తం ఉత్పత్తిలో 50శాతానికి పైగా మొదటి రకం అంటే బ్రైట్ గ్రేడ్ వచ్చాయని బోర్డు అధికారులు చెప్తున్నారు. మిగిలిన గ్రేడ్‌లు కూడా ఆశించిన స్థాయిలో నాణ్యతగా ఉన్నాయంటున్నారు. ఇది వేలంలో రైతులకు సానుకూల అంశంగా మారనుంది. అయితే గ్రేడ్ విధానంలో వారు సరైన జాగ్రత్తలు పాటించి బేళ్లు కట్టాలని అధికారులు సూచిస్తున్నారు. నేటి నుంచి పొగాకు వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. రెండేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉండి రైతులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా మార్కెట్ ఎలా ఉంటుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో వేలంలో దక్కే ధరలపై ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది కంటే ధరలు పెంచితేనే లాభాలు వస్తాయని లేకుంటే నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అటు బోర్డు అధికారులతో పాటు ఇటు రైతులు అభిప్రాయపడుతున్నారు. రెండు సంవత్సరాలు పొగాకు మార్కెట్ రైతులకు లాభాల పంట పండించింది. దీంతో ఈ ఏడాది అనేక మంది రైతులు పొగాకు సాగుపై అధికంగా మొగ్గు చూపారు. బోర్డు పరిమితికి మించి భారీగా పంటలు సాగు చేశారు. రైతులు సాగులో పోటీ పడటంతో పొలాలు, బ్యార్న్‌లు, కౌలు ధరలు విపరీతంగా పెరిగాయి. గత ఏడాది లక్ష ఉన్న బ్యార్ని కౌలు ఈ ఏడాది రూ.2.50లక్షల వరకు పెరిగింది. పొలం కౌలు, కూలీల రేట్లన్ని గతం కంటే ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. ఈ పరిస్థితిల్లో గత ఏడాది కంటే బ్యారన్‌కు రూ.4 నుంచి రూ5. లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతుందని స్వయంగా బోర్డు అధికారులే లెక్కలు వేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వేలం ధరలు కూడా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేజీ పొగాకు సరాసరి ధరను రూ.300లకు తగ్గకుండా ఇవ్వాలని కోరుతున్నారు. గత ఏడాది వేలం ముగిసేసరికి కేజీ సరాసరి ధర రూ.254 మాత్రమే ఉంది. కానీ రైతులు ఆశించిన స్థాయిలో ఈ ఏడాది మార్కెట్ ఉంటుందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### కార్యకర్తలు.. నాయకులలో

## జోష్ పెంచిన చంద్రబాబు పర్యటన





**మార్కాపురం, మార్చి 9, ప్రభాతవార్త**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురం పట్టణంలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటన కార్యకర్తలలో నాయకులలో జోష్‌ను పెంచింది. ఎన్నడూ లేని విధంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు మార్కాపురం పట్టణంలో సుమారు 6గంటల పాటు ఉండి మహిళలతో పార్టీ శ్రేణులతో ప్రజలతో గడపడం పట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా సోదరీమణులతో నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించి చెట్‌చాట్‌లో భాగంగా ప్రతి ఒక్కరి ప్రశ్నకు సమాధానం చెబుతూ వారి అనుమానాలను నివృత్తి చేస్తూ పథకాలపై భరోసా ఇస్తూ ఉల్లాసంగా గడపడం మహిళల్లో ఉత్సాహాన్ని నింపడం పార్టీకి ఎంతో బలం చేకూరిందని, ఆ పార్టీ నాయకులు అంటున్నారు. మెప్మా, డ్వాకా చేనేత, ఇతర చేతి వృత్తుల వారికి ప్రోత్సాహం అందిస్తూ పథకాల తీరుతెన్నులు వివరిస్తూ చంద్రబాబునాయుడు వారితో కొంత సమయం గడపటం కూడా ఆనందాన్నిచ్చిందని వారు అంటున్నారు. కార్యక్రమల ముగింపు సమయంలో చివరిగా పార్టీ కార్యాకర్తలు, నాయకుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, పార్టీ కోసం క్రియాశీలకంగా పని చేసే వారిని అభినందించి, స్వార్థ ప్రయోజనాల కోసం రెండు జండాల విధానాన్ని అవలంభించే నాయకులను మందలిస్తూ, కార్యకర్తలు అభిమానులే పార్టీ క్యాడర్‌అని వారిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన



ప్రసంగం ఆయా పార్టీ నాయకులలో జోష్‌ను నింపింది. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కూడా తమదైన శైలిలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం చేసిన కృషి, జన సమీకరణ అభినందనీయంగా మారింది. ఉభయ జిల్లాలతో పాటు ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి,దర్శి, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గల నుండి కూడా ఆయా ప్రాంత నాయకుల ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో చంద్రబాబు పర్యటన జనసంద్రంగా మారింది. మీ అభిమానం మీ అప్యాయత చూస్తుంటే ఈ రోజు మొత్తం మీతోనే ఇక్కడే గడపాలని అనిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం మార్కాపురం మార్క్ ఏ పాటిదో చెప్పకనే అర్థమవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు.

## ఆంధ్రా హలీమ్ ఆష్

**ఒంగోలు, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షను అవలంభించే ముస్లిం సోదరులు విరమణ సమయంలో అత్యంత ఇష్టంగా సేవించే పానియం ఆంధ్రా హలీమ్ ఆష్. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ వంటకు చాలా ప్రత్యేకం. హలీమ్ ఆష్‌కు ప్రతి మసీదు వద్ద రోజూ పెద్ద పెద్ద గంగాళంలో వండించి ఇఫ్తార్ సమయంలో ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇందు కోసం అవుతున్న ఖర్చును ఈ మసీదు పరిధిలోని వారు రోజుకొకరు చొప్పున వేసుకుంటారు. ఈ పానియాన్ని ఆంధ్రా హలీమ్ అని ముద్దుగా పిలుస్తారు. ముస్లింలే కాకుండా అందరూ ఈ పానియాన్ని ఇష్టపడతారు. మన ప్రాంతాల్లో మసీదుల వద్ద ప్రస్తుతం రంజాన్ మాసంలో ఆష్ వంటకం తయారి సందడి కల్పిస్తుంది. కావాల్సిన పదార్థాలు బొంబాయి రవ్వ లేదా బియ్య రవ్వ 250 గ్రాములు, మటన్ కీమ వంద గ్రాములు, గోదుమ రవ్వ వంద గ్రాములు, నెయ్యి 20 గ్రాములు, లవంగాలు చెక్క 5 గ్రాములు, అల్లం వెల్లులి పేస్ట్ పెద్ద చెంచా, పుదీన కొత్తిమీర కప్పు వంతున, రెండు క్యారెట్లు, రెండు టమోటాలు, రెండు లీటర్ల నీరు ఆష్ వంటకు ఉపయోగిస్తారు. ముందుగా నెయ్యిని వేడి చేసుకుని దాని రవ్వను వేయించుకుని తరువాత హిమాను ఉడికించుకోవాలి. తదుపరి మిగిలినవన్ని పాత్రలో వేసి భాగా విచ్చుకునేలా వేడి చేయాలి. పొంగిపొర్లుతున్న దశలో దించుకోవాలి. ఆష్‌ను వేడిగానే సేవించాలి. కొంత బూంది చేర్చుకుంటే మరింత రుచి అనుభవంలోకి వస్తుంది. శాఖాహారలు మాంసం తీసివేసి మిగిలిన పదార్థాలతో తయారు చేసుకోవచ్చు. ఆష్‌ను సేవించడం వల్ల తక్షణం శక్తి వస్తుందని, జీర్ణక్రియ వేగవంతం అవుతుందని, ఆకలి పెరుగుతుందని పెద్దలు అనుభవంతో చెప్తారు. అందువలనే ఇఫ్తార్ సమయంలో కర్జూరాలతో పాటు ఆష్ కూడా ఖచ్చితంగా చేరుతుంది. రంజాన్ నెలలోనే కాకుండా ఆష్‌ను ఇతర రోజులలోనూ ఆస్వాదించవచ్చు.

## టీడీపీ నాయకులు పులి వెంకటరావు మృతి

**చీరాల, మార్చి 9, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ అక్కాయిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ పులి వెంకటరావు అకాల మరణం పార్టీకి తీరని లోటని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. వెంకటరావు మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# వారి రాజీనామాలకు ఆరు నెలలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

వైకాపాలో చాలా మంది ఎమ్మెల్సీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పనిలో పనిగా తమ పదవులకు సైతం రాజీనామా చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు అవి ఆమోదానికి నోచుకోలేదు. తమ వ్యక్తిగత ఇబ్బందులతో రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. శాసనమండలి చైర్మన్ ఫార్మెట్లో రాజీనామా చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ ఇంత వరకు అవి ఆమోదానికి నోచుకోలేదు. అలాగని ఎమ్మెల్సీలు శాసనమండలికి హాజరు కావడం లేదు. అసలు ఎందుకు ఆమోదించడం లేదు అన్నది తెలియడం లేదు. వారు నిజంగా రాజీనామా కోరుకోవడం లేదా..? లేకుంటే ఇంకో కారణం ఉందా..? న్యాయపరంగా పోరాటం చేయడం లేదు ఎందుకు..? ఒత్తిడి చేయడం లేదు ఎందుకు..? అన్నది ఇప్పుడు ప్రశ్న.

**ఆగష్టులో రాజీనామాలు:**

ఆగష్టులో ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి చక్రవర్తి అయినా సరే శాసనమండలి చైర్మన్ మోసన్‌రాజు రాజీనామాను ఆమోదించలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. చివరకు వ్యక్తిగతంగా చైర్మన్ ను కలిసి స్వచ్ఛందంగా రాజీనామ చేశామని, తమపై ఎలాంటి ఒత్తిడి లేదని పేర్కొన్నారు. అయినా సరే ఆమోదించలేదు. ఆరు నెలలు పూర్తయినా ఇంత వరకు దానికి



అదోగతి లేదు. అసలు మండలి చైర్మన్‌కు రాజీనామాలు ఆమోదించే ఉద్దేశం ఉందా అనే ప్రశ్న వినిపిస్తుంది. రాజీనామా చేసిన వారు సైతం ఇంత వరకు ఏ పార్టీలో చేరలేదు. రాజీనామా ఆమోదించిన తరువాత కూటమి పార్టీలో చేరేందుకు ఎమ్మెల్సీలు సిద్దంగా ఉన్నారు. దీంతో నెలలు తరబడి ఈ అంశం పెండింగ్‌లో ఉండి పోయింది.

**స్పష్టమైన బలం:**

వాస్తవానికి ఎమ్మెల్సీలు రాజీనామా చేసిన తరువాత వారు నచ్చిన పార్టీలో చేరాలన్నది వ్యూహం. అయితే మండలి చైర్మన్‌గా ఉన్న మోసన్ రాజు వైసీపీకి చెందిన నేత. శాసనమండలిలో

### - వైసీపీ వ్యూహం.. గాల్లో ఎమ్మెల్సీలు..?

వైసీపీకి బలం ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటికి ఆ పార్టీకి 38 మంది ఎమ్మెల్సీలు ఉండే వారు. అయితే క్రమేపి వారి సంఖ్య తగ్గుతూ వస్తుంది. మరో రెండేళ్లు ఇలానే కొనసాగితే టీడీపీ బలం పెరుగుతుంది. అదే సమయంలో మండలి చైర్మన్ పదవి కాలం కూడా ముగుస్తుంది. అయితే ఇప్పుడు కానీ ఎమ్మెల్సీల బలం తగ్గితే తనకు ఇబ్బందులు వస్తాయని చైర్మన్ మోసన్ రాజుకు తెలుసు. అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదించడం లేదని తెలుస్తోంది. ఈ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక వ్యూహం ప్రకారం వెళ్తుంది. జగన్‌మోహన్‌రెడ్డి తనను చైర్మన్ మోసన్‌రాజుపై కృతజ్ఞతతో ఉన్నారు. మరో వైపు మండలిలో అర్ధవంతమైన చర్చ నాడుస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వాయిస్ గట్టిగా వినిపిస్తుంది. చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో వైసీపీ ఎమ్మెల్సీలకు అవకాశం ఇస్తున్నారు. మైక్ ఇస్తుండటంతో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయి. చాలా మంది వైసీపీ ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా మాట్లాడుతున్నారు. మొత్తానికి అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదానికి నోచుకోకపోవడం విశేషం.

# నిబద్ధతగల జర్నలిస్టు ఓరుగంటి - మాజీ ఎమ్మెల్యే జంకె



మార్కాపురం, మార్చి 9 ,ప్రభాతవార్త
తొలితరం పాత్రికేయుడు ఓరుగంటి వెంకటరమణయ్య 35వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించగా మాజీ శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సాంకేతికత లేని నాటి రోజులలో పత్రికా ప్రమాణాలను పాటిస్తూ గాలికంటే వేగంగా వార్తలను ప్రజలకు చేరవచేసిన నిబద్ధత గల జర్నలిస్టు స్వర్గీయ ఓరుగంటి వెంకటరమణయ్య అని అన్నారు. తొలి తరం పాత్రికేయుడుగా రాజకీయ నాయకులకు అత్యంత సన్నిహితుడిగా ఉండి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు సేవలు అందించిన మహనీయుడని ఓరుగంటి సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తన పాత్ర పోషించారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించే వారని, పత్రికా ప్రమాణాలను పాటించి ప్రభుత్వాన్ని తన వార్త కథనాలతో ఆలోచింపచేసిన నిజమైన జర్నలిస్టు ఓరుగంటి అని ఆయన కుటుంబానితో తనకున్న సన్నిహిత్యాన్ని ఆయన గుర్తు చేశారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నూకాని వెంకటరమణ మాట్లాడుతూ నేటి తరం పాత్రికేయులు ఓరుగంటి వెంకటరమణయ్యని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాటి రోజులలో ఓరుగంటి వెంకటరమణయ్య, రావులపల్లి చెంచయ్యలు జర్నలిస్టులుగా కొనసాగాలని, వారి ఇరువురు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారై ఉండడం ఈ ప్రాంత అదృష్టమని అన్నారు. అటువంటి వారిని స్మరించుకుంటూ మార్కాపురం ప్రెస్‌క్లబ్‌కు రావులపల్లి నామకరణాన్ని, ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఓరుగంటి వెంకటరమణయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, వారు ఇరువురి సేవలను రమణ గుర్తు చేశారు. ఓరుగంటి రమణయ్య తనయుడు ఓరుగంటి మల్లిక్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ పత్రిక రంగంలో కొనసాగుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వర్ధంతి జయంతిలో నిర్వహించుకోవడం అదృష్టంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్త బ్యూరో మూల అల్లురెడ్డి, వైకాపా నాయకులు కొండయ్య, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓరుగంటి వెంకటరమణయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి



పొన్నలూరు, మార్చి 9 ,ప్రభాతవార్త
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా సిరిగిరి గోపాల్‌రెడ్డిని వైసీపీ అధిష్టానం నియమించింది. రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమించిన గోపాల్‌రెడ్డిని మండలంలోని వైసీపీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు వస్తుందనేది నన్ను ఈపదవికి ఎంపిక చేయడమే నిదర్శనమని అన్నారు. నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని గోపాల్‌రెడ్డి అన్నారు. నాకు ఈ పదవి రావటానికి ముఖ్య కారణమైన వైసీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,ఒంగోలు పార్లమెంటు వైసీపీ ఇన్‌ఛార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవీసుబ్బారెడ్డి,వైఎస్సార్‌సీపీ జిల్లా ఇన్‌ఛార్జీకారుమూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ



మద్దిపాడు, మార్చి 9 ,ప్రభాతవార్త
మద్దిపాడు, చిమట ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందులను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాళ్లకు రూ.7550లకు కొనుగోలు చేయడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ రైతులకు తెలియజేశారు. ఆదివారం ప్రభుత్వ మద్దతు ధరకు కందుల కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్లో కంది పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ముందుగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద కందులు కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలని తెలియజేశారు. కందులు కొనుగోలు చేయాలంటే కందులలో తేమశాతం 12 శాతం, మట్టి పదార్థాలు 2 శాతం, కల్తీ గింజలు 3 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగు మారిన గింజలు 4 శాతం, అపరిపక్వ గింజులు 3శాతం, పురుగు పట్టిన గింజలు 4 శాతం ప్రామాణికాలకు లోబడి ఉన్న రైతుల కందులను మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు.కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకొని రావాలని తెలియజేశారు. అదే విధంగా కొనుగోలు చేసిన కందులకు రైతుల అకౌంట్లోకి నగదు వెంటనే జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులు కందులను తక్కువ ధరకు ధళారుల దగ్గర అమ్ముకోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరకు సొసైటీల దగ్గర అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్రిపూడి, చిమట ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చెంచు కుమారి చిత్రపటానికి పూలమాల వేసి

## నివాళులు అర్పించిన గూడూరి ఎరిక్షన్‌బాబు



యర్రగొండపాలెం,మార్చి 9,ప్రభాతవార్త
పుల్లలచెరువు మండలం పిడికిటివారి పల్లెగ్రామంలో య ర్రగొండపాలెం ఆంధ్రజ్యోతి విలేకరి కాకర్ల నరసింహారావు గారి సతీమణీ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో రిటైర్డ్ సినియర్ అసిస్టెంట్ చెంచుకుమారి పెద్ద కర్మ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆదివారం యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని చెంచుకుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు,కాకర్ల కోటయ్య,చిట్యాళవెంగల్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

## - సీఐటీయు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు



మద్దిపాడు, మార్చి 9, ప్రభాతవార్త
ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో ఆదివారం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మీ, నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి రూ.5434 కోట్ల భారీ బడ్జెట్

## - మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కంకణం
## - సబ్ ప్లాన్ అమలు ద్వారా మైనార్టీల అభ్యున్నతికి కృషి
## - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



బల్లికురవ, మార్చి 9, ప్రభాతవార్త
పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ముద్రించిన రంజాన్ జేబు క్యాలండర్‌ను ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాసాలు, పవిత్ర ఖురాన్ పఠనం, తరావీ నమాజ్ భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్న ముస్లిం సోదరీ, సోదరీమణులకు ప్రతి ఒక్కరికి అల్లా దయతో అంతా మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. రాష్ట్రంలోని మైనార్టీ సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రాధాన్యత కల్పించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో మైనార్టీలకు అడుగడుగునా మోసమే ఎదురైందని మైనార్టీ వర్గాలను మభ్యపెట్టి అప్పటి ప్రభుత్వం సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఇటీవలే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన బడ్జెట్ రూ.5434 కోట్లు మొత్తాన్ని ప్రకటించడంతో మైనార్టీల ముఖాల్లో మళ్లీ చిరునవ్వు చిగురిస్తుందని అన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## - పొదిలి కోర్టు సివిల్ జడ్జి ప్రత్యూష



కొనకనమిట్ల, మార్చి 9, ప్రభాతవార్త
విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొదిలి కోర్టు సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మిస్ వి.ప్రత్యూష అన్నారు. ఆదివారం పొదిలి ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అసమానతలను రూపుమాపాలంటే చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి,ఇ ఫోక్సో చట్టంపై వివరించారు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలికలు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ



కొనకనమిట్ల, మార్చి 9, ప్రభాతవార్త
కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతి పూజ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించారు. సందర్భంగా హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. ఉన్నత చదువులకు వెళ్లాలంటే పదో తరగతిలో సాధించే మార్కులు ఎంతో కీలకమన్నారు. యూటీఎఫ్ నాయకులు పోలు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కడెం ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల వేసిన నృత్యాలు ఎంతో అలరించాయి.

# విద్యార్థులు లక్ష్య సాధనలో విద్యను అభ్యసించాలి

## - జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



కొనకనమిట్ల, మార్చి 9, ప్రభాతవార్త
విద్యార్థులు లక్ష్యసాధనతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని పొదిలి పట్టణానికి చెందిన ఐఎఎస్ ఆఫీసర్, అస్సాం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ అరీజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొదిలి ప్రాంత విద్యార్థులకు భవిష్యత్తుకు దిశ నిర్దేశం చేస్తూ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి విద్యార్థి కష్టపడే మనస్తత్వంతో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకునేందుకు పాఠశాల విద్య నుండే పునాదులు వేసుకోవాలన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా మీ ఆలోచనలను, అభిష్టాలను ఎంచుకుని కష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా పనిచేయకపోతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని హెచ్చరించారు. నేటి సమాజంలో పెద్ద పెద్ద మేధావులంతా నిర్దిష్ట లక్ష్యంతోనే కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్నారని ఉదహరించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి మనోభావాలను తెలుసుకుంటూ సూచనలు సలహాలు ఇచ్చారు. చీరాల జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రెహానా మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యార్థులు క్రమశిక్షణతో చదవడం ద్వారానే జీవితంలో బంగారు బాటకు పునాది వేసుకున్నట్లు అవుతుందన్నారు. అనంతరం 1983-85 జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సి.రామలక్ష్మీ, విశ్రాంత ప్రిన్సిపాల్స్ తులసిదాసు, తారావాణి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరిమూన్ బీబీ, ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, హబిబుల్లా బేగ్ సంస్థ చైర్మన్ కరముల్లా బేగ్, కళాశాల అధ్యాపకులు పూర్వ విద్యార్థులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుబ్బారెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలు అభినందనలు



తాళ్లూరు, మార్చి 9, ప్రభాతవార్త
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన తూము వెంకట సుబ్బారెడ్డిని పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్దకు చేరుకున్న పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా వైకాపా జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రమణ కోటేష్, గుంటి గంగా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పూనూరి దేవదానం, చిన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువత పోరు పోస్టర్ ఆవిష్కరణను జయప్రదం చేయండి

### - దద్దాల నారాయణయాదవ్



వెలిగండ్ల, మార్చి 9, ప్రభాతవార్త
కనిగిరిలో వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు వైఎస్సార్‌సీపీ యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కనిగిరి వైసీపీఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ కోరారు. ఆదివారం వెలిగండ్లలోని జడ్పీటీసీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ జిల్లా కేంద్రాలలో వైఎస్సార్‌పార్టీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం జరుగునని ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం నాడు కనిగిరిలో పోస్టర్ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణ, ఒంగోలు లో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని మండలంలో ఉన్నటువంటి వైఎస్సార్ పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు, వివిధ పదవుల్లో ఉన్నటువంటి నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్లా సుబ్రహ్మణ్యం, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణం ఏడుకొండలు, కుప్పనబోయిన వెంకటరామయ్య, యెలికా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేర్నమిట్టలో ప్రజా చైతన్య యాత్ర



సంతనూతలపాడు, మార్చి 9, ప్రభాతవార్త
ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండో రోజు ఆదివారం సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలో గల శాంతినగర్, అంబేద్కర్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, ఉత్తర బజారు తదితర ప్రాంతాల్లో సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ప్రజా చైతన్య యాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. మంచినీళ్ల పైపులైను నాలుగు ప్రాంతాల్లో గత సంవత్సరం క్రింత వేసిన ఇంత వరకు కనెక్షన్ ఇవ్వని కారణంగా నీళ్ల రాక కొనుక్కోని వాడుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యలను ప్రజలు బృందం దృష్టికివివరించారు. కొన్ని కుటుంబాలకు ఇంటి పన్ను వేయని కారణంగా కుళాయి కనెక్షన్ కోసం వెళ్తే పన్నులు వేయించుకోమని చెబుతున్నారని అధికారులు మాత్రం పన్నులు వేయక నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కమ్మరిపాలెంలో రోడ్డు దెబ్బతిని వాహనాలు, ప్రజలు నిరంతరం ఇబ్బందులు పడతున్నామని, సమస్యను తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా మురుగు నీరు ఊరి బయటకు పోయే మార్గం లేక ఎక్కడికక్కడ మురుగు నిలుస్తున్న కారణంగా దోమలు వ్యాపించి జబ్బులు వస్తున్నాయని శాశ్వతంగా మురికి నీళ్లు బయటకు వెళ్లి పోతురాజు కాలువలో కలిపే మార్గం చూడాలని సమస్యను బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఇళ్ల పట్టాలు ఇచ్చారు, కానీ స్థలాలు చూపలేదని అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. బృందంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు నెరుసుల వెంకటేశ్వర్లు, శాఖా కార్యదర్శి అన్ను వెంకట సుబ్బారావు, నాయకులు తుళ్లూరు సుబ్బారావు, పొత్తూరు చిన్న శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ



సీఎస్‌పురం, మార్చి 9, ప్రభాతవార్త
మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నారాయణస్వామి వారి అభిషేకోత్సవం అర్చకులు శ్రీ మంకాల శివప్రసాద్ వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో గల గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీగిరిరాజు, నరసింహారావు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకటరావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



సీఎస్‌పురం, మార్చి 9, ప్రభాతవార్త
మండలంలోని శీలంవారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం రుత్వికుల వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సమూహుర్తవేళ మొదట విగ్రహ ప్రతిష్ఠ, విమాన శిఖర ప్రతిష్ఠ, రాజగోపుర ప్రతిష్ఠలు నిర్వహించి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు శాంతి కళ్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దాత వాకా సత్యనారాయణ స్వామివారికి వెండి కిరీటంను ఆలయ నిర్మాణ దారులు పిడుగు బాబురావు అందజేశారు. ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా దేకనకొండ తిరునాళ్ల



కురిచేడు, మార్చి 9, ప్రభాతవార్త
మండలంలోని దేకనకొండ, పెద్దవరం, బయ్యవరం పొలిమేర్లలో గల శ్రీసింగరకొండ పై కొలువై ఉన్నటువంటి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఆదివారం నాడు అత్యంత వైభవంగా జరిగింది. కొండపైకి ఉదయం నుంచే భక్తులు బారులు తీరి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొండ దిగువ భాగాన స్వామివారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రికి రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి వాటి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కురిచేడు ఎస్సై ఎం.శివ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# పదో తరగతి విద్యార్థులకు సరస్వతీ పూజ



వెలిగండ్ల, మార్చి 9, ప్రభాతవార్త
మండల పరిధిలోని కొత్త నరసింహాపురంలోని కేవీఎన్ అండ్ ఎల్ హైస్కూల్ నందు ఆదివారం పదో తరగతి విద్యార్థులకు సరస్వతీ పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ముత్తిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు రాబోవు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని క్రమశిక్షణతో భవిష్యత్తులో ఉన్నత స్థానాలను పొందాలని జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను పుట్టిన గ్రామాన్ని గుర్తించి మానవీయ విలువలతో కూడినటువంటి జీవనం కొనసాగించాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ రావూరి సావిత్రి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రసన్న, పవిత్ర, అరుణ, సబితా, ఆదిలక్ష్మీ, నాగవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# భైరవకోనలో ప్రముఖులు పూజలు



సీఎస్‌పురం, మార్చి 9, ప్రభాతవార్త
మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా బాపట్ల అడిషనల్ ఎస్పీ తిరుపతి పాండురంగా విఠలేశ్వరరావు, రిటైర్డ్ ఆర్డీఓ నాగబాబు పలువురు ప్రముఖులు త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ,నగరేశ్వర, భర్గలేశ్వర ఆలయాల్లో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్నగా అర్చకులు వారి చేత విశిష్ట పూజలు నిర్వహింపచేశారు. ఈవో వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజుల ఆధ్వర్యంలో వారికి అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, సరాబు చంద్రమోహన్, భక్తులు పాల్గొన్నారు.

## మహిళలు చైతన్య స్ఫూర్తితో ముందుకు కొనసాగాలి



సంతనూతలపాడు, మార్చి 9, ప్రభాతవార్త
మహిళలు అన్ని రంగాల్లో చైతన్య స్ఫూర్తితో ముందుకు కొనసాగాలని సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పమిడి హారిణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంతనూతలపాడు కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం మాట్లాడారు. డాక్టర్ హారిణి మాట్లాడుతూ పిల్లలను ప్రేమానురాగాలతో పెంచి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కలదన్నారు. మహిళలు తమ హక్కుల సాధన కోసం చైతన్య స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి మాట్లాడుతూ నేటి సమాజంలోనూ మహిళలు అన్ని విధాలుగా అన్యాయానికి గురవుతున్నారని ఆమె ఆరోపించారు. పాలకవర్గాలు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేకుండా పోయిందని అన్నారు. పాలకవర్గాలు మాటలలో మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొంటారని ఆచరణలో అది మాత్రం శూన్యం అన్నారు. మహిళలపై నేడు కూడా అనేక రూపాల్లో హింస కొనసాగుతూనే ఉందని ఆమె తెలిపారు. సమ సమాజ స్థాపన కోసం మహిళలంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మహిళా నేత కిలారి రాజ్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ, నాయకులు అద్దంకి యేసుమణి, విజయ పి.రాధ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

## - రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు



సంతనూతలపాడు, మార్చి 9, ప్రభాతవార్త
రాష్ట్రంలో మహిళలు అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్లు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు వెల్లడించారు. సంతనూతలపాడులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో మార్కాపురంలో స్వయంగా మహిళల సమస్యలపై నేరుగా చర్చించారన్నారు. మహిళలు వారి వారి సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నేరుగా వివరించడం ఎంతో హర్షనీయమన్నారు. ముఖ్యమంత్రి మార్కాపురం సభ గ్రాండ్ సక్సెస్ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మహిళలే సంపద సృష్టికర్తలని సీఎం చంద్రబాబు నాయుడు ఈ సభలో వారి ముందే తెలియజేయడం మహిళల్లో చైతన్య స్ఫూర్తి పెరిగిందన్నారు. మునుముందు రాజకీయ వ్యవస్థలను శాసించేది డ్వాక్రా సంఘాలని, ముఖ్యంగా ఐదు ఆరుగురు పిల్లలు జన్మించినను ప్రసూతి సెలవులు ప్రయోజనాలు వారికి ఉంటాయని సీఎం చంద్రబాబునాయుడు ఈసందర్భంగా ఈ సభలో హామీ ఇవ్వడం హర్షనీయమన్నారు. మహిళలకు పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు గాను కూటమి ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. వైసీపీ పాలన కన్నా కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు అభివృద్ధి ముందంజలో కలదని సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు వెల్లడించారు. రాబోయే జూన్ నెల నుండి పాఠశాల అభ్యున్నతకు ప్రభుత్వం మెరుగైన నిర్ణయాలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అమరావతి రాజధానిగా మరింత అభివృద్ధి చెందనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. మార్కాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మహిళా సదస్సు గ్రాండ్ సక్సెస్‌పై సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత తన ప్రసంగంలో మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ముమ్ముందు రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలు బలోపేతం కానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శిక్షణ




**దొనకొండ,మార్చి 9,ప్రభాతవార్త**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (RSS) ప్రకాశం జిల్లా ఘోష వర్గలో భాగంగా మన దొనకొండ గ్రామంలోనీ శ్రీ ఆనంద ఆశ్రమంలో తేదీ 08/03/2025 నుండి 9/03/2025 వరకు 2 రోజుల పాటు చిన్న పిల్లలకి శంఖం, వేణువు, పణవ ,ఆనక్ లో ప్రాథమిక ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని RSS కార్యకర్తలు నేర్పించడం జరిగింది. ప్రకాశం జిల్లాలోని పలు గ్రామాల నుండి పిల్లలు ఆనందాశ్రమానికి చేరుకోవడం జరిగింది ,మార్కాపురంటౌన్, ఒంగోలు, గిద్దలూరు, పెద్దారవీడు, దోర్నాల, రాగసముద్రం, కలుజువ్వలపాడు ,దొనకొండ, కంకణాలపల్లి,వివిధ గ్రామాల నుండి 70 మంది దాకా శిక్షణ తీసుకోవడం జరిగింది. శిక్షణలో పాల్గొన్న వారికి, శిక్షణ తీసుకున్న చిన్నారులందరికి ఉచిత వసతి, ఉచిత భోజన సౌకర్యము శ్రీ ఆనంద ఆశ్రమం పూజ్యులు శ్రీ భైరవానంద స్వామీజీ వారు కల్పించడం జరిగింది.వారికి RSS తరుపున ధన్యవాదాలు తెలియ చేస్తున్నాం.

# శుభకార్యాలలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

**కొరిశపాడు , మార్చి 9, ప్రభాతవార్త**
అద్దంకి వాస్తవ్యులు రామిశెట్టి నరసింహారావు, శ్రీదేవి దంపతులు కుమారుని వివాహం సందర్భంగా ఆదివారం సింగరకొండ రోడ్డులోని కూకట్ల కన్వెన్షన్ హాలు నందు రిసెప్షన్ వేడుకలలో విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నినూతన వధూవరులు యశ్వంత్ కృష్ణ, భావనలను ఆశ్వీరదించి శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి వంటపాత్రలు విరాళం

**అద్దంకి , మార్చి 9, ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానమునకు ఆదివారం నరసరావుపేట మండలం, రావిపాడు గ్రామ వాస్తవ్యులు కీశ॥ మల్లవరపు శవరయ్య, భార్య అన్నమ్మ గార్ల జ్ఞాపార్ధం వారి కుమార్తె, మనమడు 50వేలు రూపాయలు విలువ గల అన్నదానముకు అవసరమైన వంట పాత్రలు విరాళంగాసమర్పించారు. ఈ కార్యక్రమంలో కుమార్తె విజయనిర్మల, మనమడు బాల మణితేజ తదితరులు వున్నారు.



## వివాహా వేడుకల్లో పాల్గొన్న కరణం బలరామకృష్ణమూర్తి

**కొరిశపాడు , మార్చి 9, ప్రభాతవార్త**
అద్దంకి వాస్తవ్యులు రామిశెట్టి నరసింహారావు, శ్రీదేవి దంపతులు కుమారుని వివాహం సందర్భంగా ఆదివారం సింగరకొండ రోడ్డులోని కూకట్ల కన్వెన్షన్ హాలు నందు రిసెప్షన్ వేడుకలలో చీరాల మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొన్ని నూతన వధూవరులు యశ్వంత్ కృష్ణ, భావనలను ఆశ్వీరదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## నక్కబొక్కలపాడులో పలువురికి మంత్రి రవికుమార్ పరామర్శ

**బల్లికురవ, మార్చి 9 ,ప్రభాతవార్త**
మండలంలోని నక్కబొక్కలపాడు, అంబడిపూడి గ్రామాల లో ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలువురిని పరామర్శించారు. బొల్లినేని కోటేశ్వరరావు కాలుకు చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మంత్రిగొట్టిపాటి రవికుమార్ వారి నివాసానికి వెళ్లి కోటేశ్వరరావు ఆరోగ్య విషయమై వాకబు చేసి పరామర్శించారు. దర్శి కొండయ్య భార్య శారద ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా గ్రామంలో ఇటీవలే చేతికి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న అడిగప్పల వెంకటేశ్వర్లుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట క్లష్టర్ ఇన్‌ఛార్జ్ మల్లీనీడి గోవిందరావు, తెలుగు యువత అధ్యక్షులు దూళిపాళ్ల హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామి, సర్పంచ్ దూళిపాళ్ల బుల్లి రామయ్యలు ఉన్నారు. అదే విధంగా ముప్పవరం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్. ఉదయగిరి హనుమంతరావు మాతృమూర్తి రుక్మిణమ్మ ఇటీవలే మరనించగా ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంటూరి చిన్న సిద్దయ్య ఇటీవలే పాము కాటుతో మరణించగా వారి నివాసానికి వెళ్లి సిద్దయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుం బసభ్యులను పరామర్శించారు. పొలిశెట్టి రాములు అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి రాములు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. తోట నాగేశ్వరరావు మాతృమూర్తి మహాలక్ష్మమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుచ్చకాయల ప్రసాద్ మాతృమూర్తి స్వామ్రాజ్యం దశదిన కార్యక్రమానికి హాజరై స్వామ్రాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.



# నిరుపేద వృద్ధురాలికి ఆర్థిక సాయం

**మార్టూరు, మార్చి 9, ప్రభాతవార్త**
మార్టూరు మండలం చిమ్మిరిబండ గ్రామంలో నివసిస్తున్న అచ్చి వెంకాయమ్మ అనే రైతు కుటుంబానికి చెందిన 85 సంవత్సరాల వృద్ధ మహిళ, తాను వయసులో ఉన్నప్పుడు ఎంతో మందికి అన్నం పెట్టిన చేతులే ప్రస్తుత పరిస్థితులలో ఆకలితో చేతులు చాచే పరిస్థితి వచ్చింది. గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో, మూత్రపిండాల వ్యాధితో పూర్తిగా మంచానికి పరిమితమై జీవన ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని కమిటీ సభ్యులు కమిటీకి తెలియజేసి వెంటనే స్పందించిన కమిటీ ఆదివారం వారి ఇంటి వద్దకు వెళ్లి అచ్చి వెంకాయమ్మని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరైన జీహెచ్ నగర్ ఎక్స్ నెంబర్, కేబుల్ భాష స్పందించి తమ వంతు సమాయంగా రూ.2వేలు ఆ వృద్ధ మాతకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఇదే విధంగా ప్రతి సారి ఒకరికి తాను స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేయుటకు ముందుంటానని తెలియపరిచారు. ఇలాగే ప్రతి ఒక్కరు ముందుండి హెల్పింగ్ హ్యాండ్స్ వారు చేస్తున్న ఈ కార్యక్రమానికి బలం చేకూరాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌వలి, కమిటీ సభ్యులు షేక్ హబీబా, కే.హరిబాబు, పుట్టా అయ్యప్ప స్వామి, కేబుల్ భాష, ఎం.జనార్ధన్, ఎస్‌కే ఖాలేషా, ఆర్‌ఎస్ షమార్ట్ రహిమ, పాల చౌదరి, చెందోలు, బషీరా, చిమ్మిరిబండ, గ్రామ పెద్దలు తాళ్లూరి మార్తా శ్రీను, ఎస్‌కే అల్లాబక్షు, ఎస్‌కే నాగూర్, పల్లపు శ్రీను, పల్లపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## మద్దిపాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొణిజేటి గురుబాబు

**మద్దిపాడు, మార్చి 9 ,ప్రభాతవార్త**
పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పాలపర్తి విజేష్ రాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోనే కమిటీలు ఏర్పాటు క్రమంలో మద్దిపాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా కొణిజేటి గురు బాబును నియమితులు చేస్తూ రాష్ట్ర పీసీసీ కార్యాలయం నుంచి సమాచారం అందడం జరిగింది. ఈ క్రమంలో ఆదివారం నాడు సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాలపరిన తవిజేష్‌రాజు మద్దిపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొణిజేటి గురుబాబును నియమిస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేసి పార్టీ కండువాను కప్పి పలువురు సీనియర్ నాయకులు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పులిపాటి రఘువులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశం నందు పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ బలోపేతానికి చేయాల్సినటువంటి కార్యనిర్వాహన విధులను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల సుబ్బారావు, నట్టే సుబ్బారావు, ఎద్దు శేషాద్రి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు మంత్రి రవికుమార్ ఆశీర్వాదం

**బల్లికురవ, మార్చి 9 ,ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గట్టిపాటి రవికుమార్ ఆదివారం నియోజకవర్గ పరిధిలో జరిగిన పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాలెం గ్రామంలో గంజి ప్రసాద్ కుమారుని వివాహం ఇటీవలే జరగగా ఆదివారం వారి ఇంటికివెళ్లి నూతనవధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అద్దంకి పట్టణ వాస్తవ్యులు రామిశెట్టి నరసింహారావు కుమారుని వివాహం సందర్భంగా హాజరై నూతన వధూవరులు యశ్వంత్ కృష్ణ, భావనలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆపన్నులకు ఆసరాగా నిలవండి

**- లీలావతి వైద్యశాలను ప్రారంభించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**బల్లికురవ, మార్చి 9 ,ప్రభాతవార్త**
నూతనంగా వైద్యశాలలను ప్రారంభించే వారు పేదలకు తమ వంతు సహాయం అందించేందుకు చొరవ చూపాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన చిలకలూరిపేటలో లీలావతి హాస్పిటల్‌ను ప్రారంభించారు. కేవలం వ్యాపార దృక్పధంతోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే నిరుపేదలకు మేమున్నామంటూ భరోసా కల్పించిన రోజున పేద ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించి అనతి కాలంలోనే వైద్య సేవలను మరింత విస్తరించు కోగలుగుతారన్నారు. ప్రభుత్వం ద్వారా అందజేసే సౌకర్యాలను, రాయితీలను వైద్యశాలకు వచ్చే రోగులకు అందిస్తూ వారికి మరింత భరోసా కల్పించాలన్నారు. వైద్య సేవలతో పాటు, ప్రేమ, కరుణ, వాత్సల్యం నిరుపేద ప్రజలకు అందిస్తూ మరింత ముందుకు పోవాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల నిర్వాహకులతో పాటు స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.



## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ సెక్రటరీగా మేడా బద్రీనాథ్

**మార్కాపురం రూరల్, మార్చి 9 ,ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగం సెక్రటరీగా మేడా వెంకట బద్రీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి శనివారం సాయంత్రం అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఎంఎస్‌ఎం ఈ కార్పోరేషన్ రాష్ట్రడైరెక్టర్‌గా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారు. అలాగే ఆర్యవైశ్య అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. బద్రినాథ్ వైసిపి పార్లమెంటు సభ్యులు వైవి సుబ్బారెడ్డికి అత్యంత సన్నిహితులనే విషయం అందరికీ తెలిసిందే. ఈయన తల్లిదండ్రులైన స్వర్గీయ మేడా సుబ్బారావు, లక్ష్మీదేవి (మాజీ కౌన్సిలర్) కుటుంబం మొదటి నుండి రాజకీయంగా మాజీ ఎమ్మెల్యేలు కెపి కొండారెడ్డి, అన్నా రాంబాబు కుటుంబ సభ్యులకు ముఖ్య అనుచర వర్గంగా ఉంటూ వస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ రాష్ట్ర విభాగం సెక్రటరీగా బద్రీనాథ్‌ను నియమించడంపట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ పార్టీలో అత్యంత కీలకమైన ఇంటలెక్చువల్ విభాగానికి రాష్ట్ర కార్యదర్శిగా నాపై ఎంతో నమ్మకంతో నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కెపి నాగార్జున రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



## మోటారుసైకిల్ పైనుండి పడి ఇరువురికి గాయాలు

**రాచర్ల, మార్చి 9, ప్రభాతవార్త**
మోటారుసైకిల్ పైనుండి పడి ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని కాల్వపల్లి బస్టాండ్ సమీపంలో డంపింగ్ యార్డు వద్ద ఆదివారం జరిగింది. చోళ్ళవీడు గ్రామానికి చెందిన శిరిగిరి శ్రీనివాసులు (ఎక్స్ఆర్మీ) గుడిమెట్ల రంగారావులు అను ఇరువురు గిద్దలూరులో జరిగిన కామూరి వారి వివాహ వేడుకలో పాల్గొని తిరిగి చోళ్లవీడు గ్రామానికి వెళుతుండగా కాల్వపల్లి బస్టాండ్ సమీపంలోకి రాగానే బండి అదుపుప్పి ప్రక్కనే ఉన్న చిల్లకంపలో పడిపోయింది. దీంతో ఇరువురి ముఖానికి, తలకు, కాళ్ళు, చేతులకు గాయాలయ్యాయి. రహదారిపై వెళుతున్న వాహనదారులు వెంటనే స్పందించి 108కు సమాచారమందించడంతో వారు వచ్చి గాయపడిన ఇరువురిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఇరువురు మద్యం సేవించి వాహనం నడపడం వలన ఈ ప్రమాదానికి గురైనట్లు తెలిసింది.




## రెండు మోటారుసైకిళ్ళు ఢీకొని నలుగురికి గాయాలు

**త్రిపురాంతకం, మార్చి 9, ప్రభాతవార్త**
రెండు మోటారుసైకిళ్ళు ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని వెల్లంపల్లి సమీపంలోని 544డి జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు యుద్దనపూడి గురవయ్య అతని బంధువు అయిన విమలమ్మలు మోటారుసైకిల్‌పై వెల్లంపల్లి నఉండి గొల్లపల్లి పరిధిలో ఉన్న పొలం వద్దకు వెళుతుండగా అదే సమయంలో దోర్నాల మండలం జమ్మిదోర్నాల గ్రామానికి చెందిన నారి రాజశేఖర్, కరేడి వెంకట నారాయణ అదే సమయంలో దోర్నాలవైపు వెళ్తున్నారు. గురవయ్య పొలం సమీపంలో రోడ్డు దాటే క్రమంలో వెనుకవైపు వస్తున్న రాజశేఖర్ మోటారు సైకిల్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. దీనితో గురవయ్య, విమలమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. రాజశేఖర్, వెంకటనారాయణమ్మకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సహాయంతో త్రిపురాంతకం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గురవయ్య, విమలమ్మలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం వనుకొండ తరలించారు.



## ముస్లీం కులాన్ని దూషించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**యర్రగొండపాలెంరూరల్, మార్చి 9, ప్రభాతవార్త**
భిన్నమతాలవారు అన్నదమ్ముల్లాగా కలిసి ఉండటం యర్రగొండపాలెంలోనే సాధ్యం అవుతుందేమో, మొదటి నుంచి యర్రగొండ పాలెంలో ఒకరి మతాన్ని ఒకరు గౌరవించుకుంటూ, ఒకరి సాంప్రదాయాన్ని మరొకరు విలువనిస్తూ అంతా కలిసిపోయి నివశిస్తుంటారు.అప్పుడప్పుడు మత భావజాలం గల కొందరు మతపరమైన సాంప్రదాయ ఆనవాయితీలను ఎత్తి చూపుతూ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి ఘటనకు ఆజ్యం పోశాడు ఓ దుర్మార్గుడు. యర్రగొండపలెంలో శనివారం సాయంత్రం భారీగా రామదండు ర్యాలీ జరిగింది. ఆ ర్యాలీలో పట్టణంలోని అన్ని కులాలకు చెందిన వారు పాల్గొని ఆ యాత్రకే శోభను తెచ్చారు. ఆయాత్ర శోభలో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారులగుండా సాగింది. ఆధ్యాంతం ర్యాలీ ఎలాంటి ఆర్భాటాలకు తావు లేకుండా సాగిపోయింది. అయితే పట్టణంలోని పాత ఊరిలో ఉన్న పెద్ద మజీద్ పరిసరాల ముందు ఆది నుంచి ఓ సాంప్రదాయం కొనసాగుతుంది. ఊరేగింపులు సాగేటప్పుడు మజీద్ దాటేంతవరకు ఎలాంటి మేళాలు, తప్పెట్లు, మైక్‌లు, శబ్దాలు రాకుండ మజీద్ పరిసరాలు దాటి వెళుతుంటారు. పూర్వం నుంచి ఈ సంపద్రాయం కొనసాగుతుంది. ఆ సంప్రదాయాన్ని ఇక్కడ అన్ని మతాల వారు గౌరవించుకుంటూ పాటించే పరిస్థితి కొనసాగుతుంది. అయితే ఈ మత చందసవాదుడైన లింగాల సుబ్బనారాయణాచారి రాత్రి జరిగిన ర్యాలీ వీడియో చిత్రీకరిస్తూ ఇక్కడి మజీద్ పరిసరాలలో జరిగే సంప్రదాయ పద్ధతిని ఎత్తిచూపుతూ ముస్లీం సమాజాన్ని పరుష పదజాలంతో తిట్టడం అందులో రికార్డు అయింది. రికార్డు అయిన విషయం గమనించని ఆ వ్యక్తి తాను తీసిన వీడియోను కొన్నిగ్రూపులలోకి పోస్టు చేశాడు. ఈ క్రమంలోనే ఇక్కడి హిందు, ముస్లీంల ఐక్యత దెబ్బతినే విధంగా ఈ వీడియో సంఘటన వైరల్‌గా మారింది. దాంతో ముస్లీంలు ఎవరికి వారు రోడ్డెక్కారు. ఆ మత చందసవాదుడు ఉండే ఇంటిని వెతికే పనిలో పడ్డారు. వందల సంఖ్యలో ముస్లీం యువకులు అతడి ఇంటిని చుట్టుముట్టారు. ముస్లీం యువకుల రాకను గమనించిన ఆ మతవాది ఇంట్లోనుంచి తాళం బిగించుకుని పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంటివద్దకు వచ్చారు. పరిస్థితి సర్దుమనగకపోవడంతో సిఐ ప్రభాకర్ రావు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముస్లీం పెద్దలతో చర్చలు జరిపిన ఆయన ముస్లీం మతంపట్ల దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తానని చెప్పడంతో ముస్లీంలు శాంతించారు. సదరు వ్యక్తిని సిఐ ప్రభాకర్ రావు సిబ్బందితో కలిసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్పి యు నాగరాజు యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సిఐతో జరిగిన సంఘటనల గురించి వాకాబు చేశారు. ఈ సంఘటనపై ఎస్పై చౌడయ్య మాట్లాడుతూమతాలను, కులాలను కించపరుస్తున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు మజీద్‌లకు చెందిన ఇమామ్‌లతోపాటు ముస్లీం యూత్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, ముస్లీం నాయకులు సయ్యద్ జబీల్ తదితరులు ఉన్నారు.




## గుంటి గంగా భవానీ అమ్మవారికి విశేష పూజలు

**తాళ్లూరు, మార్చి 9 ,ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్ల పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.



# శ్రీశైలవాసుని సేవలో మంత్రి రవికుమార్




**బల్లికురవ, మార్చి 9, ప్రభాతవార్త**
భూ కైలాసంగా పేరుపొందిన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారిని దర్శించుకుని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటుగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వీరికి ఘన స్వాగతం పలికారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద కూడా మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ్రత్యేక ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి తీర్ధ ప్రసాదాలను, స్వామి వారి చిత్రపటాలను వీరికి బహుకరించారు. వీరి వెంట దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ భర్త లలిత్ సాగర్ కూడా ఉన్నారు.

## నూతన వస్త్రాల బహుకరణ వేడుకకు హాజరైన జడ్పీచైర్‌పర్సన్

**తాళ్లూరు, మార్చి 9 ,ప్రభాతవార్త**
మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో వైకాపా కార్యకర్త గువ్వల చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు, కుమార్తె నూతన వస్త్రాల బహుకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి సొసైటీ మాజీ డైరెక్టర్ గువ్వల వెంకట శ్రీనివాసులురెడ్డి, నాయకులు గూడా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా ఇంటలెక్చువల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ

**మార్కాపురం, మార్చి 9 ,ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభ్యాగం జనరల్ సెక్రటరీగా డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి శనివారం సాయంత్రం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ కనుకదుర్గ వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర మహిళా వైద్య విభాగంలో విధులు నిర్వహించిన విషయం విధితమే. అలాగే శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్‌గాను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌గాను బాధ్యతలను నిర్వఘ్న రామంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెప్పల్లి కనుకదుర్గ మాట్లాడుతూ పార్టీలో అత్యంత కీలకమైన ఇంటలెక్చువల్ విభాగానికి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంట్ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ముఖ్యమంత్రి సభ విజయవంతం పట్ల కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కందుల

**మార్కాపురం, మార్చి 9, ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురం పట్టణంలో జరిగినముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పర్యటనను జయప్రదం చేసిన ప్రజలకు పార్టీ కార్యకర్తకు, అభిమానులకు శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఉందని తెలిసినప్పటి నుండి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, కార్యక్రమం విజయవంతం కోసం కష్టపడ్డారని అన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా ఉండేందుకు పోలీసు శాఖ చేసిన కృషి అభినందనీయమని పోలీసు శాఖక కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అన్ని శాఖల అధికారులకు, ప్రధానంగా మహిళా సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు.



# మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

**వెలిగండ్ల, మార్చి 9 ,ప్రభాతవార్త**
ఆదివారం మండలంలోని పద్మాపురం బీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు దేవండ్ల మాధవ కుమార్తె ఓణీల ఫంక్షన్‌కు హాజరై చిరంజీవి లక్ష్మీ జ్వాలాశ్రీని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు కర్ణాటక భాస్కర్ రెడ్డి, అక్కి వెంకటరెడ్డి, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## కార్యకర్తలు నాయకులలో జోష్ పెంచిన చంద్రబాబు పర్యటన

**మార్కాపురం, మార్చి 9 ,ప్రభాతవార్త**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మార్కాపురం పట్టణంలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటన కార్యకర్తలలో నాయకులలో జోష్‌ను పెంచింది. ఎన్నడూ లేని విధంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు మార్కాపురం పట్టణంలో సుమారు 6గంటల పాటు ఉండి మహిళలతో పార్టీ శ్రేణులతో ప్రజలతో గడపడం పట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా సోదరీమణులతో నాలుగు గంటల పాటు సమీక్ష నిర్వహించి చెట్‌చాట్‌లో భాగంగా ప్రతి ఒక్కరి ప్రశ్నకు సమాధానం చెబుతూ వారి అనుమానాలను నివృత్తి చేస్తూ పథకాలపై భరోసా ఇస్తూ ఉల్లాసంగా గడపడం మహిళల్లో ఉత్సాహాన్ని నింపడం పార్టీకి ఎంతో బలం చేకూరిందని, ఆ పార్టీ నాయకులు అంటున్నారు. మెప్మా, డ్వాకా చేనేత, ఇతర చేతి వృత్తుల వారికి ప్రోత్సాహం అందిస్తూ పథకాల తీరుతెన్నులు వివరిస్తూ చంద్రబాబునాయుడు వారితో కొంత సమయం గడపటం కూడా ఆనందాన్నిచ్చిందని వారు అంటున్నారు. కార్యక్రమల ముగింపు సమయంలో చివరిగా పార్టీ కార్యాకర్తలు, నాయకుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, పార్టీ కోసం క్రియాశీలకంగా పని చేసే వారిని అభినందించి, స్వార్ధ ప్రయోజనాల కోసం రెండు జండాల విధానాన్ని అవలంభించే నాయకులను మందలిస్తూ, కార్యకర్తలు అభిమానులే పార్టీ క్యాడర్ అని వారిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రసంగం ఆయా పార్టీ నాయకులలో జోష్ ను నింపింది. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కూడా తమదైన శైలిలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం చేసిన కృషి, జన సమీకరణ అభినందనీయంగా మారింది. ఉభయ జిల్లాలతో పాటు ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవార్గల నుండి కూడా ఆయా ప్రాంత నాయకుల ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో చంద్రబాబు పర్యటన జనసంద్రంగా మారింది. మీ అభిమానం మీ అప్యాయత చూస్తుంటే ఈ రోజు మొత్తం మీతోనే ఇక్కడే గడపాలని అనిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం మార్కాపురం మార్క్ ఏ పాటిదో చెప్పకనే అర్ధమవుతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు.




## బాలిక సాధికారితకు ఎల్లప్పుడూ కృషి చేస్తాం

చీరాల, మార్చి 9,ప్రభాతవార్త



చీరాల రోటరీ కమ్యూనిటీ హాల్ నందు శనివారం రాత్రి జరిగిన సమావేశంలో బాలిక సాధికారితకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని, ఇటువంటి సేవలు ఎంతో ఆనందాన్ని, తృప్తిని ఇస్తున్నాయని పాస్ట్ డిస్ట్రిక్ట్ 3150, 3020 గవర్నర్ డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు అన్నారు. డాక్టర్ చిలుకూరి శరత్ బాబు, డాక్టర్ అన్నపూర్ణ ఆర్థిక సహకారంతో మూడు లక్షల రూపాయలు విలువ గల 76 సైకిళ్లని ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న నిరుపేద బాలికలకు చీరాల రోటరీ క్లబ్, క్షీరపురి రోటరీ, వేటపాలెం రోటరీ క్లబ్ సభ్యుల ద్వారా డాక్టర్ శరత్‌బాబు చేతుల మీదుగా సైకిళ్లు అందజేయడం జరిగింది. బాలికలు విద్యా రంగంలో విశేషంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు, బి.హేమంత్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, జీవై ప్రసాద్, నరేంద్రబాబు, డీవీ సురేష్, గుర్రం రాఘవరావు, మురళీకృష్ణ, శ్రీనివాసబాబు, భాను ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకట సురేష్, బాలికలు పాల్గొన్నారు.

## కనిగిరి డయాలసిస్ కేంద్రానికి రూ.50వేలు విరాళం అందించిన పాలపర్తి రమణయ్య

పామూరు, మార్చి 9, ప్రభాతవార్త



కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రభుత్వ వైద్య శాలల అభివృద్దితో పాటు మోడల్ స్కూల్స్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి తమవంతు విధిగా డయాలసిస్ కేంద్రాల మరమ్మత్తుల కోసం పామూరు నీటి సంఘం అధ్యక్షులు పాలపర్తి రమణయ్య ఆదివారం నాడు ఎమ్మెల్యేకు రూ.50వేలు నగదును అందజేశారు. అభివృద్దే ధ్యేయంగా కనిగిరిని పరుగులు పెట్టిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనే కనిగిరి మోడల్ నియోజకవర్గంగా రూపుదిద్దుకోగలదన్నారు. నిత్య ప్రజాసేవకుడైన ఉగ్ర నరసింహారెడ్డి మనకు లభించడం ఈ ప్రాంతం చేసుకున్న పుణ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, మాజీ డీలర్ పాలపర్తి రమణయ్య, డీలర్ గంధం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మిరియం వారి వివాహ వేడుకల్లో దద్దాల ఇతర నాయకులు

పామూరు, మార్చి 9, ప్రభాతవార్త



చిలంకూరు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త మిరియం రామారావు, పార్వతిల కుమారుడు కిరణ్ కుమార్, వధువు విశ్వజల వివాహ వేడుకలు ఆదివారం నాడు స్థానిక పువ్వాడి కళ్యాణ మండపంలో పార్టీ శ్రేణులు, బంధుమిత్రులు వివిధ పార్టీలకు చెందిన నాయకుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పామూరు వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కల్లూరి రామిరెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ గయాజ్, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల ఆదినారాయణరెడ్డి, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, కోడూరి రామసుబ్బారెడ్డి, చిలంకూరు సర్పంచ్ మలినేని శ్రీనివాసులతో పాటు టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, రియల్టర్ ఆకుపాటి వెంకటేష్ తదితరులు హాజరై నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించిన వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల

పామూరు, మార్చి 9, ప్రభాతవార్త





ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందడం వేరొకరికి కాలు విరగడంతో విషయం తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ నేరుగా వారి స్వగృహాలకు వెళ్లి బాధిత కుటుంబాలను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మేలంగి దావీదు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం జరిగింది. అతని కుటుంబానికి రూ.20వేలు దద్దాల నారాయణయాదవ్, రూ.10వేలు మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి రూ.30వేలను అందించారు. అదేవిధంగా మండలంలోని కంభాలదిన్నె పంచాయతీకి చెందిన వైసీపీ మూడో వార్డు మెంబరు నీలం కొండమ్మ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలికి తీవ్రమై చికిత్స పొందుతుండగా దద్దాల నారాయణయాదవ్ పరామర్శించి రూ.10వేలు అందజేశారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏర్పడిన తరువాత పేదలపై పలు భారాలు మోపిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నీలం రమణమ్మ, ఎంపీటీసీ నీలం శ్రీరాములు, మాల్యాద్రి, ఎంపీటీసీ గోలినేని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిముఖ దుర్గాంబ సేవలో ఆకుపాటి

పామూరు, మార్చి 9, ప్రభాతవార్త



పవిత్ర పర్యాటక పుణ్యక్షేత్రమైన భైరవకోనలోని భైరవేశ్వరుడు, త్రిముఖ దుర్గాంబ దేవికి ఆదివారం జిల్లా బాపట్ల జిల్లా ఏఎస్పీ తిరుపతి పాండురంగ విశ్వేశ్వర్, రిటైర్డ్ డీఆర్వో నాగబాబు దంపతులు, ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, కరారు చంద్రమోహన్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, ఆలయ ప్రధానఅర్చకులు, చైర్మన్‌లు వారిని పూర్ణకుంభంతో ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

పామూరు, మార్చి 9,ప్రభాతవార్త



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా ప్రశ్నించే గొంతును అణిచి వేస్తూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న ఎన్డీఏ పాలనపై ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తలు, ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ అవినీతి అరాచకాల గురించి ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి కుటుంబానికి జరుగుతున్న మోసాలపై వైసీపీ కార్యకర్తలు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలో బూత్ కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వ అసమర్థ పాలన గురించి ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన సహాయ సహకారాలను వివరించాలన్నారు. గ్రామ స్థాయిలో త్వరలో కమిటీలను ఏర్పాటు చేసి జరిగిన లోపాలను సరిదిద్దుకుని పార్టీకి పూర్వ వైభవంగా తీసుకొచ్చేందుకు వార్డు స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. భేషజాలకు పోకుండా అందరూ సమన్వయంతో పని చేస్తే 2029లో 175కి 175 సీట్లు వైసీపీకి రావడం ఖాయమన్నారు. ఇప్పటికి ఏ ప్రాంతంలో జరిగిన ఎన్డీఏ కూటమిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అమ్మ ఒడి లేదు, రైతు భరోసా పథకం ఏ పథకం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఆర్థిక సమస్య అంటూ ప్రజలను మభ్యపెట్టడం సమంజసం కాదన్నారు. సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు సుబ్బయ్య, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ గయాజ్, సామాజిక కార్యకర్త జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినారాయణ, వాకమళ్ళ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, పిడికిటి వెంకట నారాయణ, కోడూరి రామసుబ్బారెడ్డి, మహబూబ్ భాసా, ఎలికా అచ్చయ్య, మితికిల బాలకృష్ణయ్య, బారా షరీఫ్, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మన్నెం మాధవ, సాంబిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

### - సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి డిమాండ్

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త




అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్ రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు, సమాజ పరిణామ క్రమం, శాస్త్రీయ ఆలోచన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యోగ కార్మి కులపై ప్రభావం, రాజకీయాలు- కార్మిక వర్గ వైఖరి అంశాలను 2 రోజుల పాటు 4 శిక్షణా తరగతులను జిల్లా నాయకులు వివరించారు. దర్శిలో జరుగుతున్న 2వ రోజు సీఐటీయు జిల్లా శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల వలన ప్రభుత్వానికి కోట్లాది రూపాయల సెస్ ద్వారా ఆదాయం వస్తుందని ఆ నిధులు 2 వేల కోట్ల రూపాయలు గత వైసీపీ ప్రభుత్వం వివిధ పథకాలకు వాడుకుని కార్మికులకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వకుండా క్లైమ్స్ పెండింగ్‌లో పెట్టిందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలో అధికారంలోకి వస్తే వైసీపీ ప్రభుత్వం ఆపని క్లైమ్స్‌కి నిధులు విడుదల చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని భవన నిర్మాణ కార్మికులకు సెస్ నిధులు పునరుద్దరణ చేస్తామని హామీని అమలు చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మోటారు వాహన చట్టం వలన ప్రమాదాలు జరిగితే డ్రైవర్స్‌కి జరిమానాలు, జైలు శిక్షలు, ఇన్సూరెన్స్ రద్దు, వాహనాలు సీజ్ చేయడం వంటి కఠనతరమైన శిక్షలను అమలు చేయాలని మోదీ ప్రభుత్వం తెచ్చిందని, ఈ చట్టాన్ని సీఐటీయు వ్యతిరేకిస్తుందని అన్నారు. సీఐటీయు నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న నెలకు 6 వేల వేతనం ఇవ్వడం అన్యాయమని రూ.10వేలు ఇవ్వాలని, నెల నెల వేతనాలు ఇవ్వాలని, పని ముట్లు, పరికరాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ కార్మికులు,గోపాల మిత్రలు, ఆశా, అంగన్‌వాడీ పంచాయతీ తదితర కార్మిక నాయకులు పాల్గొని మాట్లాడారు. సీఐటీయు దర్శి నాయకులు ఈమని నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ గా వ్యవహారించగా దర్శి మండల కార్యదర్శి ఉప్పు నారాయణ, షేక్ కాలేభాషా, ఆలూరి ఇస్మాయిల్, గోవిందమ్మ, చలమయ్య, ఎం.నాతాన్, బాలమ్మ, సీతామహాలక్ష్మి రాణి, ఆశీర్వాదం, రైతు సంఘం కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, గర్నెపూడి జాన్ సామ్యేల్ పాల్గొన్నారు.

## శ్రీశైలం భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి వారిని దర్శించుకున్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త





విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తదితరులు శనివారం సాయంత్రం శ్రీశైలం చేరుకుని భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి వారిని దర్శించుకున్నారు.

## సమాజ అభివృద్దిలో మీడియా పాత్ర గొప్పది: గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త



దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. దర్శి పట్టణం కురిచేడులో ఆదివారం ఎస్ఎస్‌సీబీపీఎల్ కేబుల్ ఆఫీసు, ఏసీఎన్ న్యూస్‌ను ఆమె ప్రారంభించారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సీఐ రామారావు, శేఖర్ పంతులు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా పని చేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో మీడియా పని చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు,దారం సుబ్బారావు,శోభారాణి,వల్లెపు నారాయణ,దుగ్గెంపూడి చెంచయ్య,గోపు వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ, మునగా శ్రీను, అంజయ్య తదితరులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సందిరెడ్డి వారి నామకరణ వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త





దర్శిలో పార్టీ కార్యకర్త సందిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కుమారుని శాంతి పూజా కార్యక్రమం, నామ కరణ కార్యక్రమం పులిపాడు దగ్గర ఉన్న శివాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని రాజశేఖర్‌రెడ్డి కుమారునికి జగన్‌మోహన్‌రెడ్డిగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కేవీరెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి, కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎస్ఎం భాష, చింతలపూడి శ్రీనివాసులురెడ్డి, మిల్లర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## నూతన లీలావతి హాస్పిటల్‌ను ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త



చిలకలూరిపేటలో డాక్టర్ లావు సుష్మ ఏర్పాటు చేసిన నూతన లీలావతి హాస్పిటల్‌ను ప్రారంభించిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

## శిద్దా సుధీర్ కుమార్‌కి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

దర్శి, మార్చి 9, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శిద్దా రాఘవరావు తనయుడు యువ పారిశ్రామికవేత్త, యువ నాయకులు శిద్దా వీర వెంకట సుధీర్ కుమార్, లక్ష్మీ శృతి లకి వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం ఒంగోలులోని వారి నివాసంలో దర్శి నియోజకవర్గంలోని పలువురు నాయకులు జిల్లాలోని పలువురు నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తలెఇపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిద్దా సుధీర్ కుమార్ దంపతులు పది కాలాల పాటు ఇలాంటి వివాహ వార్షికోత్సవాలు ఎన్నో జరుపుకోవాలని అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ శిద్దా కార్యాలయ ప్రతినిధి మండాది సుబ్బారావు, పలువురు నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్లో అక్రిడ్జ్ హైస్కూల్ విద్యార్ధుల ప్రతిభ

నాగులుప్పలపాడు, మార్చి 9, ప్రభాతవార్త



ఎయిమ్స్ ఒలంపియాడ్ హంట్లో నాగులుప్పల పాడులోని అక్రిడ్జ్ హైస్కూల్ విద్యార్ధులు ప్రతిభకనపరిచారు. జాతీయ స్థాయిలో ఆ పాఠశాల విద్యార్ధులు వివిధ ర్యాంకులు సాధించారు. పాఠశాల(నాల్గో తరగతి) విద్యార్ధిని రోషిణి జాతీయ స్థాయిలో నాల్గో ర్యాంకు సాధించారు. పి.ఉదయ్ (ఆరో తరగతి) రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, షేక్ దిల్వార్ జానీ(ఏడో తరగతి) రాష్ట్ర స్థాచిలో ఏడో ర్యాంకు, హనుమలోహిత(రెండో తరగతి) జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు, సౌమ్యశ్రీ(ఆరో తరగతి) జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభకనపరిచిన విద్యార్ధులను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వాహకులు ఎండీ కలీమ్ ఖాన్ కడియాల ప్రభాకర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అక్రిడ్జ్ హైస్కూల్ డైరక్టర్ బాలకృష్ణ, ఇన్‌ఛార్జీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొని విద్యార్ధులను అభినందించారు. గ్రామీణ స్థాయిలో నూ అత్యుత్తమ స్థాయిలో తమ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలియజేసింది.

## 12న వైఎస్సార్‌సీపీ యువత పోరును జయప్రదం చేయండి

కనిగిరి, మార్చి 9, ప్రభాతవార్త



కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో మార్చి 12న జరిగే వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమం ఉంటుందని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా తెలియజేశారు.

## విద్యార్థుల ఫీజు పోరును జయప్రదం చేయండి

### - మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

కనిగిరి, మార్చి 9, ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మార్చి 12న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద జరుగు విద్యార్థుల ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అర్హులైన విద్యార్థులకు కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు నిధులు విడుదల చేయలేదని దీంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక ఒత్తిడికి గురి చేయకుండా విద్యార్థులకు ఫీజు నిధులను మంజూరు చేయాలన్నారు. ఈనెల 12న జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం నూతన అధ్యక్షుడిగా కొప్పరపు వెంకట సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నిక

కనిగిరి, మార్చి 9, ప్రభాతవార్త




కనిగిరి పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం నూతన అధ్యక్షుడిగా కొప్పరపు వెంకట సత్యనారాయణ(సత్యాలు) ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. షిర్డీ సాయిబాబా దేవస్థానం ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య సోదరులు, ప్రముఖులు సమావేశమై దేవస్థానం అధ్యక్షుని ఎన్నిక చేశారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కొప్పరపు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. శ్రీషిర్డీ సాయిబాబా చల్లని దీవెనలు కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి లభించాలని, ప్రజలు సుఖంగా, సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు కొప్పురపు సత్యాలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థాన అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఐవి నారాయణ, వాసవి సత్ర సముదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, కేటీఆర్, టంగుటూరి గోవిందరావు, కొలిపర్తి మారుతి కుమార్, వెలుగూరి చంద్రశేఖర్, వెంకట సుబ్రహ్మణ్యం, బాబు, కోట సురేష్, ఒలేటి చిన్న, తడికమళ్ళ వెంకటేశ్వర్లు, యువరాజ్, కనిగిరి మండల ఆర్యవైశ్య అధ్యక్షులు మామిడి రమేష్, ఇతర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబా దేవస్థానం అధ్యక్షుడు కొప్పురపు సత్యాలను సన్మానించిన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, మార్చి 9, ప్రభాతవార్త



కనిగిరి పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుపు వెంకట సత్యనారాయణ(కొప్పెరపు సత్యాలు)ను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. షిర్డీ సాయిబాబా దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కొలిపర్తి మారుతి కుమార్, వెలుగురి చంద్రశేఖర్, ఐవీ నారాయణ, బాబు, మామిడి రమేష్, ఒలేటి చిన్న, కోట సురేష్‌బాబు, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రిత్విక్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన జడ్పీటీసీ మడతల, ఎంపీపీ దంతులూరి

కనిగిరి, మార్చి 9,ప్రభాతవార్త



కనిగిరి మండలం చాకిరాల గ్రామానికి చెందిన కళ్ళు రాఘవ రెడ్డి కుమారుడు రత్విక్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న కనిగిరి జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు వారి నివాసానికి చేరుకుని మృతదేహానికి సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూరసాని నరసారెడ్డి, గంజి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో డైరక్టర్ కళ్ళు శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

కనిగిరి, మార్చి 9, ప్రభాతవార్త



కనిగిరి పరిధిలోని యేరువారిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ప్రధానోపాధ్యాయురాలు ముంతాజ్ బేగం అధ్యక్షతన ఆదివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు యు.నారాయణరెడ్డి, జి.సంజీవి, పి.శ్రీనివాసాచారి, జి.కరుణకుమారి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు జరగనున్న పరీక్షలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, అలాగే విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్లు, ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌లు సాధించే విధంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను కొనియాడారు. విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా సిద్దమవ్వాలి అనే విషయాలపై కొన్ని సూచనలు చేయడం జరిగింది. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు అలాగే విద్యాబుద్దులు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవీంద్రబాబు, డి.వెంకటయ్య, సర్పంచ్ శివారెడ్డి, పెద్దన్న, నాగిరెడ్డి, రమణారెడ్డి, స్కూల్ సిబ్బంది నారాయణ, రాజ, సుబ్బారెడ్డి, మల్లిఖార్జున, రాజశేఖర్‌రెడ్డి, యువీ గురుప్రసాద్, భారతి, యశోద, హజరత్తయ్య, రమేష్, తిమోతి పాల్గొన్నారు.

## ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

నాగులుప్పలపాడు, మార్చి 9, ప్రభాతవార్త



చీరాలలోని ఎన్జీవో భవనం మీటింగ్ హాల్ నందు ఉమ్మడి ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గం ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మాజీ సలహాదారు షేక్ యూసఫ్ మెహరాలి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా జమండ్లమూడి శ్రీనివాసరావు, సహా అధ్యక్షులుగా ఎన్.కృపాచార్యులు, జనరల్ సెక్రటరీగా జి.సాయి మహేష్, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, మరొక ఇద్దరిని కోశాధికారిగా సూర్యనారాయణని, మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ముక్తకంఠంతో జీవో 65 ను వ్యతిరేకిస్తూ సదరు జీవోను రద్దు చేయడం కొరకు డిమాండ్ చేస్తామని తెలియజేశారు.

## విశేష సేవలందించిన మహిళలకు ఘన సన్మానం

వేటపాలెం, మార్చి 9, ప్రభాతవార్త



స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కొన్ని సంవత్సరాలుగా అమ్మవారికి సేవలు అందిస్తున్నటువంటి మన ఆలయ మహిళ గౌరవ అధ్యక్షులు పత్తి నాగలక్ష్మి, శ్రీరామ్ లక్ష్మి, భారతి, నాగమణి, మహిళా కానిస్టేబుళ్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేటపాలెం ఎస్సై పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. మహిళలను గౌరవించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

10-3Pg5.qxd:10-3Pg5.qxd 01/01/01 6:56 AM Page 1



# వాణిజ్యబంధం బలోపేతానికే..

### సుంకాల తగ్గింపుపై భారత్ వివరణ

### ట్రంప్ ఒత్తిడికాదని వెల్లడి



**వాషింగ్టన్, మార్చి 9:** భారత్ అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందన్న అంశాన్ని తాను బహిరంగంగా లేవనెత్తడం వల్లే ఆ దేశం ఆందోళన చెంది సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ విషయంపై భారత అధికారిక వర్గాలు మాత్రం ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చుతున్నట్లు సమాచారం. సుంకాల తగ్గింపునకు చర్యలు నిజమే అయినప్పటికీ.. ఆయన ఆరోపణలతో తాము ఈ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి.

'గతంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో భారత్ వరుసగా ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాలపై సుంకాలను తగ్గించింది. ప్రస్తుతం ఐరోపా సమాఖ్య, యుకెతోనూ పలు ఒప్పందాల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్యంతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి వీటిని తగ్గించాలని న్యూఢిల్లీ నిర్ణయం తీసుకుంది. అంతే కానీ, అమెరికా భారత్‌పై విధించనున్న సుంకాల అమలుకు సమయం దగ్గరపడుతున్నందుకు కాదు' అని భారత అధికారులు చెబుతున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నివేదికల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులు మినహా దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తొలగించాలని అమెరికా భారత్‌ను కోరింది. న్యూఢిల్లీకి వాషింగ్టన్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 118.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

కాగా 2030 నాటికి దీనిని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో భారత్ ముందుకు వెళ్తోంది. గత నెల ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో 2025 చివరి నాటికి ఇరుదేశాల మధ్య పరస్పరం ప్రయోజనకరమైన బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) తొలిదశపై చర్చలు జరపడానికి ట్రంప్ అంగీకరించారు. ఇందులో భాగంగానే మరిన్ని వస్తువులకు మార్కెట్‌ను తెరవడం, సుంకాల అడ్డంకులను తొలగించడానికి ఇరుదేశాల నేతలు ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం విదితమే.

న్యూఢిల్లీని టారిఫ్ కింగ్‌గా అభివర్ణిస్తూ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ 2న భారత్, చైనాలపై విధించే సుంకాలు అమెరికా దశను మార్చనున్నాయని అన్నారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై భారత్ విదేశాంగశాఖ స్పందించింది. సుంకాలు, సుంకాలేతర అడ్డంకులను అధిగమించడానికి బిటిఎ కింద అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని పేర్కొంది.

### ఎంపిలతో సిఎం స్టాలిన్ అత్యవసర సమావేశం

# పార్లమెంటులో వినిపించాల్సిన అంశాలపై చర్చలు



**చెన్నై, మార్చి 9:** లోక్‌సభ సీట్ల పునిర్వభజన హిందీభాషను దక్షిణాది రాష్ట్రాలపై రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని డిఎంకె ఎంపిలకు తమిళనాడు సీఎం ఎంకెస్టాలిన్‌సూచించారు. ఈనెల 10వ తేదీనుంచి పార్లమెంటు సమావేశాలుప్రారంభం కానున్న నేపథ్యంలో పార్టీ ఎంపిలకు ఆయన దిశా నిర్దేశంచేసారు. ఆదివారం డిఎంకె ఎంపిలతో నిర్వహించిన స్టాలిన్ తమిళనాడు పార్లమెంటరీ ప్రాతినిధ్యం పరిరక్షించేందుకు ఐక్యంగా ఉండాలని, జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు కేటాయిస్తే నష్టపోతామని అన్నారు. ఈమేరకు ప్రభావిత రాష్ట్రాలపార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలని ఎంపిలకు సూచించారు. తమిళనాడు హక్కులు నిలబెట్టుకోడానికి ఇండియా కూటమి, ప్రజాస్వామ్య శక్తులతోకలిసి పనిచేయాలనిచెప్పారు. తమిళనాడుకు కేంద్రంనుంచి రావాల్సిన న్యాయమైన నిధుల వాటాను డిమాండ్ చేస్తూనే దక్షిణాదిపై హిందీభాషను రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఎంపిలకు సూచించారు. ఈ మేరకు సమావేశానికి సంబంధించిన అంశాలను తన ఎక్స్ ఖాతాలో స్టాలిన్‌పోస్టుచేసారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజనచేస్తే దక్షిణాది రాష్ట్రాలకు మాత్రమే కాకుండా ఒడిశా, పశ్చిమబెంగాల్‌తో సహా ఇతర రాష్ట్రాలకు ఆది నష్టంచేకూరుస్తుందని ఆయన చెప్పారు. సోమవారం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్, హిందీ ఇంపోజిషన్ అంశాలు చర్చకువస్తే వాటిని తీవ్రంగా వ్యతిరేకించాలని పార్టీ ఎంపిలకు సూచించారు. ఒకవేళ డీలిమిటేషన్ చేయాల్సివస్తే 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేయాలని స్టాలిన్ స్పష్టంచేసారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వడంలేదని గందరగోళపరిస్థితులు సృష్టిస్తోందని డిఎంకె ఎంపిలు ఆరోపిస్తున్నారు. గతంలో జనాభా నియంత్రణ చర్యలను కేంద్రం చేపట్టిందని, వాటిని దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా అమలుచేసాయని ఎంపిలు చెపుతున్నారు.

ఉత్తరాదితోపోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిందని డీలిమిటేషన్‌ద్వారా నియోజకవర్గాలు పునర్విభజన చేస్తే తమిళ నాడు తోపాటు దక్షిణాది రాష్ట్రాలకూ నష్టం వాటిల్లుతుందని ఎంపిలు చెపుతున్నారు. ఇదే విషయాన్ని స్టాలిన్‌సైతం నమ్ముతున్నారని చెపు తున్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాజకీయ పార్టీలమద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో కేంద్రానికి వ్యతిరేకంగా వారినికూడా భాగస్వాముల నుచేసేందుకు స్టాలిన్ నిర్ణయించారని డిఎంకె ఎంపిలు తెలిపారు.

# కెనడా ప్రధాని రేసులో మాజీ బ్యాంకర్




**ఒట్టావా, మార్చి 9:** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవి నుంచి వైదొలగనున్నట్లు ఈ జనవరిలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సారథిని ఎన్నుకునేందుకు అధికార లిబరల్ పార్టీ సిద్ధమైంది. ఇందుకోసం ఆదివారం పార్టీలో ఓటింగ్ నిర్వహించనుంది. ఈ రేసులో నలుగురు కొనసాగుతున్నారు. అమెరికా నుంచి కెనడా సుంకాల సవాలు ఎదుర్కొంటున్న వేళ.. కెనడా పాలనా పగ్గాలు ఎవరు చేపట్టనున్నారనే విషయం ఆసక్తిగా మారింది.

**రేసులో నలుగురు:** లిబరల్ పార్టీ సారథి రేసులో మార్క్ కార్నీ, క్రిస్టియా ఫ్రీలాండ్, కరినా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్‌లు ఉన్నారు. వీరిలో కార్నీ, ఫ్రీలాండ్ మధ్య తీవ్ర పోటీ ఉన్నప్పటికీ. మాజీ బ్యాంకర్ మార్క్ కార్నీ నూతన ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ కెనడాకు మాజీ గవర్నర్‌గా పనిచేసిన మార్క్ కార్నీ.. అంతకుముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గానూ చేశారు. ఇక ట్రూడో ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన క్రిస్టియా ఫ్రీలాండ్ గత డిసెంబరులో తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె రాసిన సుదీర్ఘ లేఖ ట్రూడో రాజీనామాకు దారితీసిందనే వాదన కూడా ఉంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి సుంకాల సవాళ్లు ఎదురవుతున్న వేళ కెనడా నూతన ప్రధాని ఎంపిక మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. వీటిని ఎదుర్కొనేందుకు తమ వద్ద ప్రణాళికలు ఉన్నాయని ప్రధాని రేసులో ఉన్న లిబరల్ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. సీక్రెట్ ఓటింగ్ ద్వారా పార్టీ అధినేతను ఎన్నుకోనుండగా.. ఇందులో సుమారు 1.40 లక్షల మంది ఓటర్లు పాల్గొననున్నారు. విజేతగా నిలిచిన వారిచే గవర్నర్ జనరల్ నూతన ప్రధానిగా ప్రమాణం చేయిస్తారు.




## కుల్‌భూషణ్ కిడ్నాప్‌కు సహకరించిన జెయుఐనేత కాల్చివేత

**ఇస్లామాబాద్, మార్చి 9:** భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను కిడ్నాప్‌చేయడంలో పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు సాయంచేసిన మానవ అక్రమరవాణాదారుడు ముఫ్తీషా మీర్ హత్యకు గురయ్యాడు. బలూచిస్తాన్‌లో ముఫ్తీషా మీర్‌పై ఇప్పటికే రెండు సార్లు హత్యాయత్నాలు జరిగాయి. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి టర్బాట్‌లోని మసీదులో ప్రార్థనలు ముగించుకుని బయటకు వస్తుండగా మోటారు సైకిళ్లపై వచ్చిన గుర్తుతెలియన గన్‌మెన్లు ఆయనపై పలురౌండ్ల కాల్పులుజరిపినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు వెంటనే మీర్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. ముఫ్తీషా మీర్ మత సంస్థ జమియత్ ఉలేమా ఇ ఇస్లాం జెయుఐలో సభ్యుడు. ప్రముఖ వ్యక్తుల్లో ఒకరుగా చెలామణి అవుతూ ఆయుధాలు, మానవ అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడేవాడని మీడియా సంస్థలు చెపుతున్నాయి. పాక్‌లోని పలు ఉగ్రవాదసంస్థలకు ఆయనకు లింకులున్నాయని, తరచూ టెర్రర్ శిబిరాలకు వెళుతూ వారుభూభాగంలో అక్రమంగా చొరబడటానికి సాయంచేసేవాడని తెలిపాయి. జెయుఐ పార్టీకిచెందిన మరో ఇద్దరు వ్యక్తులను గతవారం దుండగులు ఖుజ్దార్‌ప్రాంతంలో కాల్చి హత్యచేసారు. నౌకాదళంలో విధులు నిర్వర్తించి పదవీవిరమణచేసిన తర్వాత జాదవ్ ఇరాన్‌లోని చాబహార్‌లో వ్యాపారం చేసేవారు. 2016లో ఆయనను ఇరాన్‌లోపాక్ ఏజెంట్లు అపహరించారు. ఆ తర్వాత బలూచిస్థాన్‌లోకి ఆయన ప్రవేశిస్తే అరెస్టుచేసినట్లు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో గూఢచర్యం ఆరోపణలపై పాకిస్థాన్ మిలిటరీకోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించి ఇరాన్‌లో ఉంటున్న జాదవ్‌ను పాక్ అపహరించిందని ఆరోపించింది. ఆ మరణశిక్షను సవాల్‌చేస్తూ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అప్పటి నుంచి ఇంకా ఈ కేసు విచారణలోనే ఉంది.

# నేను అలా చేస్తే.. 'కీవ్ సేనలు కుప్పకూలుతాయి'

### ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్



**వాషింగ్టన్, మార్చి 9:** రష్యాతో యుద్ధం శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారంటూ ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మండిపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా తమ 'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. యుద్ధక్షేత్రంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. యుద్ధం విషయంలో పుతిన్‌ను పక్కన పెట్టి.. కేవలం ఉక్రెయిన్‌నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారనే ట్వీట్‌పై మస్క్ ఈ మేరకు స్పందించారు. 'ఉక్రెయిన్ విషయంలో ముఖాముఖికి రావాలంటూ గతంలో పుతిన్‌కు సవాలు విసిరాను. మరోవైపు.. కీవ్ సైన్యానికి మా స్టార్‌లింక్ వ్యవస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఒకవేళ ఈ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. రణరంగంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయి. ఏదేమైనా ఉక్రెయిన్‌కు ఓటమి అనివార్యం. అయినప్పటికీ యేళ్ల తరబడి సాగుతున్న ఊచకోత విసుగు పుట్టిస్తోంది. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారు' అని మస్క్ పేర్కొన్నారు. మరోవైపు వైట్‌హౌస్ సమీపంలో భారీ ఉక్రెయిన్ జెండా ఆవిష్కరణకు నిధులు ఎవరు కేటాయించారు? అంటూ 'ఎక్స్' వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు మస్క్ స్పం దిం చారు. 'టాప్ 10 ఉక్రెయిన్ సంపన్నులపై.. ము ఖ్యంగా మొనాకోలో విలాస భవనాలు కలిగి ఉన్నవారిపై ఆంక్షలు విధించాలి. తద్వారా ఇటువంటి కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుంది' అని తెలిపారు. ఇదిలా ఉండగా.. రష్యా దాడుల్లో ఉక్రెయిన్ కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతి నడంతో ప్రస్తుతం స్టార్‌లింక్ సేవలం దిస్తోంది. సైన్యానికి ఇది ఎంతో ఉపయుక్తంగా నిలిస్తోంది.

# నాటో, ఐక్యరాజ్యసమితి నుంచి అమెరికా నిష్క్రమించాలి

### ట్రంప్ సలహాదారు చేసిన పోస్టుకు డోజ్ చీఫ్ మస్క్ మద్దతు



**వాషింగ్టన్, మార్చి 9:** ఉత్తర అట్లాంటిక్ ఒప్పందసంస్థ (నాటో)కూటమిపై బిలియనీర్ ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలుచేసారు. నాటో కూటమి నుంచి అమెరికా నిష్క్రమించాలని డొనాల్డ్‌ట్రంప్ సీనియర్ సలహాదారు మైక్‌లీ సోషల్ మీడియాలోచేసిన పోస్టుకు మస్క్ మద్దతు పలికారు. వెంటనే అగ్రరాజ్యం నాటో, ఐక్యరాజ్యసమితినుంచి నిష్క్రమించాలనికోరారు. ఐరోపాదేశాల రక్షణకోసం అమెరికా సొమ్ములు చెల్లించడం ఎంతమాత్రం సమంజసమైన విషయం కాదన్నారు. ఇప్పటికే నాటో భవిష్యత్తుపై ఆదేశాల్లో సందిగ్ధత కొనసాగుతున్న క్రమంలో మస్క్ వ్యాఖ్యలు అనుమానాలు లేవనెత్తాయి. గతంలో నాటో దేశాల్లో నిధుల కేటాయింపుపై ట్రంప్‌మాట్లాడుతూ కూటమి నిర్ణయించిన విధంగా అన్నిదేశాలు రక్షణ వ్యవస్థ బలోపేతానికి తమ జీడీపినుంచి తగినమొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. నాటోలోని ఇతర దేశాలు తమ వంతునిధులను కేటాయించకపోతే తమ రక్షణ దళాలను వెనక్కితీసుకుంటామని హెచ్చరించారు. రక్షణ వ్యయాన్ని భారీగా పెంచే లక్ష్యంతో ఈయూ దేశాలు గడచిన వారం బ్రస్సెల్స్‌లో అత్యవసర శఖరాగ్రసమావేశం నిర్వహించాయి. తమ రక్షణ వ్యవస్థలను బలోపేతంచేసుకునేందుకు 800 బిలియన్ యూరోలతో ప్రణాళిక ప్రతిపాదించాయి. రక్షణ కోసం సభ్యదేశాలకు 162.5 బిలియన్ డాలర్ల రుణాలను అందించే యూరోపియన్ కమిషన్ ప్రతిపాదనపైచర్చించాయి. తాజాగా ఉక్రెయిన్ పట్ల అమెరికా తీరు ఐరోపా దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. అసలు యుఎస్ వ్యూహం ఏమిటో ఇప్పటికీ స్పష్టంగా తెలియడంలేదని ఈయూ రక్షణ కమిషనర్ ఆడ్రియస్ కుబిలియస్ వ్యాఖ్యానించారు.

## నేటినుంచి రెండోవిడత బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ, మార్చి 9:** పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో రెండో విడత సోమవారంనుంచి ప్రారంభం అవుతున్నాయి. ఈసమావేశాల్లోనే కీలక బిల్లులను ఆమోదింపచేసుకనేందుకు ఎన్డీయే సర్కారు కృషిచేస్తుంటే మణిపూర్ అంశాన్ని మళ్లీ సభల్లో లేవనెత్తేందుకు విపక్షాలు వ్యూహాలు అమలుచేస్తున్నాయి.

మణిపూర్‌లో సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా తర్వాత గతనెల 13నుంచి రాష్ట్రపతి పాలన అమలులో ఉన్న సంగతి తెలిసిందే. ఇపుడు మణిపూర్‌ప్రభుత్వ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెడతారు. అదేవిధంగా ఓటర్ గుర్తింపు కార్డులపై డూప్లికేట్ ఎపిక్ సంఖ్యల సమస్య గురించి ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ డూప్లికేట్ ఎపిక్ సంఖ్యలతో ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడు తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే మణిపూర్‌లో తాజా హింసాకాండ ట్రంప్ ప్రభుత్వంతో భారత్ వ్యవహారశైలి వంటి సమస్యలను కూడా ప్రతిపక్షలు లేవనెత్తేందుకు యోచిస్తున్నాయి.

బడ్జెట్ పద్దులకు పార్లమెంటు ఆమోద ముద్రపొందడం, బడ్జెట్ సంబంధిత అంశాలను పూర్తిచేయడం, మణిపూర్ బడ్జెట్, వక్ఫ్‌సవరణ బిల్లుకు ఆమోదం పొందడంపై ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెంచింది. కాగా సోమవారంనుంచి ఏప్రిల్ 4వ తేదీవరకూ పార్లమెంటు రెండో విడతబడ్జెట్ సమావేశాలు 20 సార్లు జరుగుతాయని అంచనా. కీలక అంశాలన్నింటికంటే మణిపూర్ బడ్జెట్, వక్ఫ్‌సవరణ బిల్లులపైనే ఎన్డీయే సర్కారు దృష్టికేంద్రీకరిస్తే విపక్షాలు మాత్రం దేశంలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రస్తావించి ఎన్డీయేను ఇరుకున పెట్టాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి.

## టైగర్ రిజర్వుగా మాధవ్‌నేషనల్ పార్కు

**న్యూఢిల్లీ, మార్చి 9:** వన్యప్రాణుల సంరక్షణలో భారత దేశం నిరంతరం ముందుంటుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మాధవ్ నేషనల్‌పార్కును టైగర్ రిజర్వుజోన్‌గా మార్చడంపై ప్రధాని స్పందించారు. జంతుప్రేమికులకు ఇదొక శుభవార్త అన్నారు. భారత్ వన్యప్రాణుల వైవిధ్యానికి నిలయమని ప్రధాని అన్నారు. ప్రకృతితో మమేకమై వన్యప్రాణులను పూజించే సంస్కృతి మనదని అన్నారు. ప్రకృతి జంతువులను రక్షిస్తూ భూమిని సురక్షితమైన గ్రహంగా కొనసాగించేందుకు భారత్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మాధవ్‌టైగర్ రిజర్వు ఫారెస్టుకు సంబంధించి కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌చేసిన ట్వీట్‌ను ప్రధానిమోడీ తన సోషల్‌మీడియా ఖాతాకు జతచేసారు. భూమిపై పర్యావరణ వైవిధ్యం పునరుద్ధరించేందుకు ప్రధాని మోడీ చరిత్రాత్మక ప్రాధాన్యం ఇస్తున్నారని కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్ కొనియాడారు. ప్రధానికృషితోనే పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణులసంరక్షణలో గొప్పపురోగతిని సాధించామన్నారు. మధ్యప్రదేశ్ మాధవ్ నేషనల్ పార్కును టైగర్ రిజర్వుగా ప్రకటించడంపై ఆయన హర్షం ప్రకటించారు. దీనితో దేశవ్యాప్తంగా టైగర్ రిజర్వు జోన్ల జాబితా 58కి చేరింది. అలాగేమధ్యప్రదేశ్‌లో తొమ్మిదవజోన్‌గా మాధవ్ టైగర్‌రిజర్వు నిలిచిదని కేంద్రమంత్రి చెప్పారు. ఈ అభివృద్ధి నిస్వార్థంగా, అవిశ్రాంతంగా పనిచేస్తున్న అటవీ అధికారుల కృషికి నిదర్శనమని మంత్రి భూపేంద్రచెప్పారు. ఈ ట్వీట్‌ను ప్రధానికి కేంద్రమంత్రి ట్యాగ్‌చేస్తే మోడీ కూడా రీట్వీట్‌చేసి జవాబిచ్చారు. ఇటీవల ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని గిర్ అభయారణ్యంలోనూ ప్రధాని మోడీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆసియా సింహాల ఆవాసాలను కాపాడేందుకు స్థానిక గిరిజనులు మహిళలుచేస్తున్న కృషిని కొనియాడారు.





## న్యూయార్క్ నగరాన్ని కమ్మేసిన కార్చిచ్చు పొగలు!

**న్యూయార్క్, మార్చి 9:** న్యూయార్క్ నగరంలో కార్చిచ్చు కమ్మేస్తోంది. లాంగ్ ఐలాండ్‌లోని హోంప్టన్స్‌లో మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. తీవ్రమైన గాలుల కారణంగా దట్టమైన పొగ ఆకాశం అంతా వ్యాపిస్తోంది. కొన్ని ప్రధాన రహదారులను అధికారులు మూసివేసారు. హోంప్టన్స్‌లో నాలుగు చోట్ల ఈ మంటలు పుట్టుకొచ్చాయి. మధ్యాహ్నం ఒంటిగంటకల్లా మోరిచెస్ ఈస్ట్‌పోర్టు, వెస్ట్ హోంప్టన్స్‌తో సహా పలుప్రాంతాలకు ఇవి వ్యాపించాయి. దీనితో ఆప్రదేశాలు దట్టమైన పొగతో నిండిపోయాయి. మూడుచోట్ల మంటలు అదుపులోకి తీసుకురాగా హోంప్టన్స్‌లో 50శాం అగ్నికీలలను ఆర్పేసారు. ఈ కార్చిచ్చు కారణంగా రెండు వాణిజ్యభవనాలు కాలిపోయాయి. అయితే స్థానికంగా ఉన్న గృహాలకు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు చెపుతున్నారు. పెద్ద ఎత్తున గాలులు వీస్తుండటంతో దట్టమైన పొగ నగరం అంతా వ్యాపించింది. న్యూయార్క్ గవర్నర్ హోచుల్ అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. స్థానికులను ఆప్రాంతంనుంచి తరలిస్తున్నామని చెప్పారు. మంటలు అదుపుచేసేందుకు హెలికాప్టర్లతో నీటిని చల్లుతున్నట్లు తెలిపారు. పొగకారణంగా వాయు నాణ్యత క్షీణించిందని ఆమె కలవరం వ్యక్తం చేసారు.




## కరోలినా రాష్ట్రాల్లో కార్చిచ్చుకు కారణమైన మహిళ అరెస్టు

**నార్త్‌కరోలినా, మార్చి 9:** అమెరికాలోని ఉత్తర కొరోలినా దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో గతవారం మొదలైన కార్చిచ్చు ఇప్పటికీ వ్యాపిస్తూనే ఉంది. ఇప్పటివరకూ నాలుగువేల ఎకరాల్లో అటవీ సంపద కాలిబూడిద అయిందని అధికారులు చెపుతున్నారు. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌కు చెందిన 49 ఏళ్ల అలెగ్జాండ్రా బియలౌసా అనే మహిళ ఈ మంటలకు కారణమని గుర్తించామని తెలిపారు. వేల ఎకరాల అటవీసంపద, నివాసగృహాలను ప్రమాదంలో పడేసారని ఆరోపిస్తూ ఆమెను అరెస్టు చేసామన్నారు. ఏప్రిల్ 15న ఆమె హోరి కౌంటీకోర్టులో హాజరుకావాల్సి ఉంటుందని, దోషిగా తేలితే తనపై వచ్చిన ప్రతి ఆరోపణకు అలెగ్జాండ్రాకు కోర్టు 30 రోజులు జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తుందని తెలిపారు. దక్షిణ కరోలినా ఫారెస్ట్రీకమిషన్ అధికారులు తెలిపిన వివరా లప్రకారం కోవింగ్టన్ లేక్స్ సబ్ డివిజన్‌లోని ఒక చెట్టువద్ద అలెగ్జాండ్రా మంటపెట్టింది. అది పక్కనే ఉన్న ఇతర ప్రదేశాలకు వ్యాపించింది. అయితే మంటలను ఆర్పడానికి ఆమె ప్రయత్నం చేసినప్పటికీ తగినన్ని నీరు లేకపోవడంతో అవి అదుపుకాలేదు. అప్పటికే వేగంగా వ్యాపిస్తూ పక్కనే ఉన్న వాకర్‌వుడ్స్ యాజమాన్యంలోని వృక్షాలమీదుగా మిర్టిల్‌బీచ్ సమీపంలోని పలు నివాసాలకు అంటుకున్నాయి. ప్రస్తుతం మంటలు 55శాతం అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ కొరోలినా రాష్ట్రంలోని పొడి వాతావరణపరిస్థితులు ఈ కార్చిచ్చులకు మరింత ఆజ్యంపోస్తున్నాయి. దీనితో నాలుగువేల ఎకరాలకుపైగా కాలిపోయాయి. ఆప్రాంతాల ప్రజలను ఖాళీచేయించి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అనవసర వస్తువులు చెత్తను కాల్చడంపై ఆంక్షలు ప్రకటించినట్లు ఫైర్ అధికారులు వెల్లడించారు.



### అసద్‌వర్గీయులు,భద్రతా దళాలమధ్య ఘర్షణలు

# 1000మందికిపైగా మృతి

**డమాస్కస్, మార్చి 9:** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మద్దతుదారులు అలావైటీ రెబెల్స్ తిరుగుబాటుతోస్థానికంగా మళ్లీ హింస చెలరేగింది. భద్రతా దళాలు, అసద్ విధేయులమధ్య జరిగిన ఘర్షణల్లో వెయ్యిమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సిరియా అంతర్యుద్ధం ఆరంభం అయిన తర్వాత అత్యంత ఘోరమైన ఘటనగా పేర్కొంటున్నారు. బ్రిటన్‌లోని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్‌హ్యూమన్ రౌట్స్ సిరియా ఘర్షణల వివరాలు తెలిపింది. అసద్ మద్దతుదారులు తొలుత ప్రభుత్వ దళాలపై దాడులు చేసారని, ఇందుకు ప్రతిగా భద్రతా బలగాలు ప్రతిదాడికి దిగాయి. ఇప్పటివరకూ ఈ ఘర్షణల్లో వెయ్యిమందికిపైగా మృతిచెందారు. వారిలో 745 మందిసాధారణపౌరులు కాగా 125 మంది భద్రతా బలగాలసిబ్బంది, 148 మంది అసద్ మద్దతుదారులున్నారు. ఇక లాతికాయ నగరం సమీపప్రాంతాల్లో విద్యుత్తు తాగునీటి సదుపాయాలని కూడా అలావైట్లు అడ్డుకుననట్లు తేలింది. తిరుగుబాటుదారులు మెరుపువేగంతో సిరియాను ఆక్రమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అసద్ తన కుటుంబంతోసహా రష్యాకు పారిపోయారు. తిరుగుబాటుదారులు డమాస్కస్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేసారు. దీన్ని వ్యతిరేకిస్తూ గతవారం అసద్ మద్దతుదారులు జబ్లేనగరంలో భద్రతా సిబ్బందిని మట్టుబెట్టాయి. అసద్ తెగకు చెందిన అలావైట్లు అధికంగా ఉండే ప్రాంతాల్లోకి ప్రవేశించిన ప్రభుత్వ దళాలు పెద్ద ఎత్తున ప్రతీకార దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వారి ఇళ్లకు నిప్పంటించడంతో ఘర్షణలు తీవ్రస్థాయికి చేరాయి. బనియాస్ పట్టణంలోజరిగిన ఘర్షణల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలు వీధుల్లో, ఇళ్లలో పడి ఉన్నట్లు స్థానికులు చెపుతున్నారు. వాటిని తీసుకునేందుకు కూడా ఎవ్వరూ సాహసం చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేసారు. ఇక దాడుల్లో మృతిచెందిన ఐదుగురు సిరియన్ దళాలకు శనివారం అంత్యక్రియలు చేసారు. దీనికి వేలాదిమంది ప్రజలు హాజరయ్యారు.

## కాలిఫోర్నియా స్వామినారాయణ్ మందిరంపై విద్వేషరాతలు



**వాషింగ్టన్, మార్చి 9:** అమెరికాలోని హిందూ ఆలయాలపై దాడులు కొనసాగుతున్నాయి. కాలిఫోర్నియ రాష్ట్రంలోని హిందూ ఆలయంపై కొందరు విద్వేషపూరిత రాతలు రాసారు. చినో హిల్స్‌లోని బాప్స్ శ్రీస్వామినారాయణ్ మందిరంపై కొందరు ఈదుశ్చర్యలకు పాల్పడ్డారు. ఆలయ అధికారులు ఎక్స్ వేదికగా ఈ దుశ్చర్యగురించి వెల్లడించారు. భారత్ ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించింది. విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటన చేస్తూ కాలిఫోర్నియాలోని చినో హిల్స్‌లో హిందూదేవాలయంపై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రార్థనా స్థలాలకు తగిన భద్రత కల్పించాలని కూడా కోరారని జైస్వాల్ అన్నారు. గత ఏడాది సెప్టెంబరులోనూ ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా శాక్రమెంటోలోని బాప్స్ శ్రీస్వామినారాయణ మందిరంపై విద్వేషపూరిత రాతలు రాసారు. దానికి ముందుసైతం న్యూయార్క్‌లోని బాప్స్ మందిరం వద్ద దుండగులు ఇదేవిధంగా వ్యవహరించారు.

10-3Pg6exHMNWJQE.qxd:10-3Pg6exHMNWJQE.qxd 01/01/01 9:54 AM Page 1



# నూతన పర్యాటక పాలసీకి అనుగుణంగా భూ కేటాయింపులు

**విజయవాడ,మార్చి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులను పెద్దఎత్తున ఆకర్షించేందుకు కొత్త పర్యాటక భూ కేటాయింపుల విధానానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులు, పెట్టుబడులు, ప్రోత్సాహకాలు, భూ కేటాయింపులకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం ఏపీ టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 20242029ని సర్కార్ రూపొందించింది.

జంగిల్, లగ్జరీ, బీచ్ రిసార్ట్‌లకు 15 ఎకరాల వరకూ భూమిని కేటాయించనుంది. థీమ్ పార్కులకు 25 ఎకరాలు, గోల్ఫ్ కోర్సులకు 150 ఎకరాల వరకూ భూ కేటాయింపులు చేయాలని సర్కార్ భావిస్తోంది. ఇక మెగా, అల్ట్రామెగా ప్రాజెక్టులకు ప్రభుత్వం ఎస్ఐబీపీలో నిర్ణయించినంత మేర భూమి కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. చిన్న తరహా పర్యాటక ప్రాజెక్టులకు 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన, మెగా ప్రాజెక్టులకు 66 ఏళ్ల వరకూ లీజు లేదా ఫ్రీహోల్డ్ ప్రాతిపదికన భూకేటాయింపులు చేసే అవకాశం ఉంది. అలాగే బిడ్డింగ్ ప్రాతిపదికన ఎంపికచేసే ఎంఎస్ఎం ప్రాజెక్ట్ 18 నెలల్లోపు, మెగా ప్రాజెక్టులు గరిష్ఠంగా 4 ఏళ్లలోపూ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్ఆర్ఓ విలువపై 1 శాతంగా లీజు అద్దె ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.

రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూమిని పర్యాటక ప్రాజెక్టులు, అందుకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏపీలో పర్యాటక వనరులైన సముద్ర తీరాలు, అటవీప్రాంతం, కాలువలు, నదీతీరాలు, కొండ ప్రాంతాలు, ప్రసిద్ధి గాంచిన దేవాలయాలు, పురాతనమైన కట్టడాలు, సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వింతలున్న ప్రాంతాలు ఇలా వేర్వేరు చోట్ల విభిన్నమైన పర్యాటక ప్రాజెక్టులు పీపీపీ విధానంలో తీసుకొచ్చేలా కార్యాచరణ సిద్ధం చేసింది.

పీపీపీ ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడులను ఆకర్షించి ఎక్కువ ఆదాయం ఆర్జించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి లభించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని యోచిస్తోంది.

ఏపీ టూరిజం ల్యాండ్ అలాట్ మెంట్ పాలసీ రూపకల్పనలో భాగంగా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపైనా సర్కార్ అధ్యయనం చేసింది. కేరళ, తమిళనాడులో ప్రస్తుతం 99 ఏళ్ల లీజు ద్వారా ప్రాజెక్టులకు భూ కేటాయింపులు జరుగుతున్నాయి. మహారాష్ట్రలో 30 నుంచి 95 ఏళ్ల లీజు లేదా విక్రయంపై భూ కేటాయింపులు చేస్తున్నారు. ఒడిశాలో వేలం విధానాన్ని అనుసరిస్తున్నారు.

ఏపీలో వివిధ ప్రాజెక్టులను పెట్టుబడి ఆధారంగా కేటాయించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది.

కోటి నుంచి రూ.50 కోట్ల వరకూ ఎంఎస్ఎం ప్రాజెక్టులుగానూ, రూ.50 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు లార్జ్, రూ.500 కోట్లలోపు మెగా, రూ.500 కోట్ల పైబడి పెట్టుబడి వచ్చే వాటిని అల్ట్రామెగా ప్రాజెక్టులుగా పరిగణించనుంది. రహదారుల పక్కన, తీరప్రాంతాల్లో ప్రాజెక్టుకు ఒకటి నుంచి మూడు ఎకరాల్లోపు, మల్టీప్లెక్స్ ప్రాజెక్టులకు 2 నుంచి 3 ఎకరాలు, హోటళ్లకు 5 ఎకరాల వరకూ, టెంట్ సిటీలకూ ఐదు ఎకరాల వరకూ స్థలం కేటాయించాలని నిర్ణయించింది.

# వైట్‌హౌస్ సమీపంలో ఆగంతకుడిపై సీక్రెట్ సర్వీస్ బృందం కాల్పులు

**వాషింగ్టన్, మార్చి 9:** అమెరికా అధ్యక్షభవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పులుజరిగాయి. ఒక అనుమానితుడిపై అమెరికా సీక్రెట్ సర్వీస్ బృందం కాల్పులుజరిపింది. అమెరికా కాలమానం ప్రకారం ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రిచోటుచేసుకుంది. అంతర్జాతీయ మీడియాలో తెల్లవారేసరికి భారీ వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. ఇండియానా నుంచి వాషింగ్టన్‌కు వస్తున్న ఒక వ్యక్తి కదలికలను స్థానిక పోలీసులు గుర్తించారు. ఆతడు వైట్ హౌస్ సమీపంలో ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్‌కు సమాచారం ఇచ్చారు. దీనితో అప్రమత్తం అయిన అధికారులు అధ్యక్షభవనానికి సమీపంలో పార్కుచేసి ఉంచిన ఒక వాహణాన్ని గుర్తించారు. సమీపంలో ఒక వ్యక్తి నడిచి వెళుతుండగా ఆతడి వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు రావడాన్ని గమనించిన ఆతడు వెంటనే తన వద్ద ఉన్న తుపాకీ బయటకు తీసాడు. దీనితో అనుమానితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్ని స్తుండగా ఘర్షణ జరిగింది. ఆతడు కాల్పులుజరిపేందుకు ఉపక్రయిస్తుండగా సిబ్బందికూడా నిందితుడిపై కాల్పులుజరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఫ్లోరిడాలో ఉన్నారు. ఈ ఘటనలో అనుమానితుడు గాయపడినట్లు మాత్రమేచెప్పారు. ఆతడిని ఆసుపత్రికి తరలించామని, సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని వారంతా సురక్షితమేనని వెల్లడించారు. అయితే ఆగంతకుడి పరిస్థితి ఎలా ఉందన్నది మాత్రం వెల్లడించలేదు. ఘటనపై మరింత లోతుగా దర్యాప్తును ప్రారంభించారు.

# అటవీ శాఖలో ఎఐ టెక్నాలజీ

## జంతువుల రక్షణ, అక్రమ కలప రవాణా అడ్డుకట్టకు ఎంతో ఉపయోగం

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త :** ప్రస్తుతం ఏ నోట విన్నా, ఎక్కడ ఉన్నా ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మాటే వినిపిస్తోంది. ఇటు ప్రైవేట్ సంస్థలు మొదలకొని ఇటు ప్రభుత్వ సంస్థల వరకు ఎఐ వినియోగంపై దృష్టి పెడుతు న్నాయి. దీని వినియోగం ద్వారా ఇటు ధనం, ఆటు సమయం రెండూ కూడా వృథా కాకుండా ఉండటంతో ఏఐ పై అందరి దృష్టి పడుతోంది.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ విభాగాల్లో దీన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే పేదవారి కోసం నిర్మించే ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో ఎటువంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా ఏఐ సహకారంతో సదరుల ఇళ్ళ నిర్మాణ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా ఇళ్ళకు జియో మ్యాపింగ్ చేసింది. దీంతో పాటు అటవీ శాఖలో కూడా ఎఐ టెక్నాలజిని అందుబాటులోకి తీసుకు వచ్చేం దుకు ప్రణాళికలకు సిద్ధం చేస్తోం ది. దీని ద్వారా జంతువుల వలసల నమూనా, జాతుల గుర్తింపు, వేట, అడువుల్లో తరచుగా జరిగే అగ్నిప్రమా దాలు తదితర కార్యక్రమాలను ఎ ప్పటి కప్పుడు పరిశీలించేందుకు సిసి కెమెరాలపై ఆధార పడుతు న్నారు. కెమెరాలతో వన్యప్రాణుల సంచారం, తెలుసుకునేందుకు అడవుల్లోని వ్యూహాత్మక ప్రదేశాల్లో ఈ కెమెరాలను అమర్చారు. అయితే, కెమెరాలలో అమర్చిన ఎస్‌డి కార్డ్‌లు చిత్రాలతో నిండిపోతాయి. అంతే కాకుండా వీటిని అధికారులు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా మారుస్తూ ఉండాలి.ఎస్‌డి కార్డుల నుంచి డేటాను ఎప్పటికప్పుడు తీసుకోవడం మాన్యువల్‌గా జరుగుతోంది. ఇది ఖరీదైన వ్యవహారంతోటు ఎక్కువ సమయం పడుతోంది.

అంతేకాకుడా కెమెరా ద్వారా తీసిన ఫోటోలను సరైన సమయంలో తీసుకోవడం సాధ్యం కావడం లేదు.ఇటువంటి అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకున్న అటవీశాఖ వీటికి సరైన పరిష్కార మార్గంగా ఏఐ ఆధారితక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించింది.ఈ నూతన టెక్నాలజితో అల్గారిథమ్‌లు, కెమెరా ట్రాప్‌ల నుండి డీప్‌లెర్నింగ్ టెక్నిక్‌ల ద్వారా డేటాను ప్రాసెస్ చేసి, వాటిని సరైన ప్రాతిపదికలో డేటాను ఎప్పటికప్పుడు పరిశీలించి సదరు సమాచారాన్ని సరైన సమయంలో అటవీ అధికారులకు అందిస్తాయి. సదరు సమాచారాన్ని అందుకున్న అధికారులు సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. ఈ నూతన ఎఐ టెక్నాలజీ ద్వారా అటవీ జంతువుల ఎన్ని ఉన్నాయి.అవి ఎక్కడ ఉన్నాయి. అవి ఏ దిశగా ప్రయాణి స్తున్నాయి. తదితర సమాచారం అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాకుండా బర్డ్ స్పాటింగ్ జోన్‌లు, ఎకో టూరిజం జోన్‌లు, జంతువుల మధ్య ఘర్షణ, వేటగాళ్ల నుంచి సదరు జంతువులకు రక్షణకు సంబంధించిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తీసుకోవచ్చు. అంతే కాకుండా అటవికి వచ్చే కొత్త జంతువులు, పక్షులు, వాటి సంఖ్య, అవి ఎక్కడ నివసిస్తున్నాయి. తదితర అంశాలను సులభంగా తెలుసుకోవచ్చు. వీటితో పాటు అడువుల్లో ఉండే విలువైన కలప, జంతువులు అక్రమ రవాణా, అగ్ని ప్రమాదాలు తదితర అంశాలపై నిశిత పరిశీలనకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అడవుల్లో ఎక్కడైనా అనధికారి కార్యక్రమాలు వివరాలతోపాటు అవి జరిగే ప్రాంతాలను అక్షాంశాలు, రేఖాంశాలతో సహా పూర్తి సమాచారాన్ని వెంటనే అధికారులకు అందించవచ్చు. అంతేకాకుండా సదరు సమాచారాన్ని మొబైల్ యాప్‌తో లింక్ చేయడంతో క్షణాల్లో సమాచారం అందుతుంది. ఈ ఎఐ టెక్నాలజీకి సంబంధించి ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వా నించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

ఈ ఏఐ టెక్నా లజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ఫర్హాబాద్ గేట్, వ్యూ పాయింట్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని కొన్ని వ్యూహాత్మక ప్రదేశాలలో ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. అంతే కాకుండా ఈ నూతన టెక్నాలజి ద్వారా డేటా భద్రత, ఆడిట్ లాగ్‌లను నిర్వహించడానికి ఏజెన్సీ ప్రోగ్రామ్‌లను కూడా అభివృద్ధి చేయన్నుట్లు అధికారులు చెబుతున్నారు.

# మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన గాయని కల్పన

## అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యకు వినతి



**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), మార్చి 9, ప్రభాతవార్త:** సికిందరాబాద్‌లోని బుద్ధభవన్‌లోని తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయంలో గాయని కల్పన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. తాను ఆత్మహత్యకు పాల్పడలేదని నిద్రమాత్రల మోతాదు ఎక్కువ కావడంతో అపస్మా రకస్థితిలోకి వెళ్లినట్లు చెప్పారు. తాను నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసు కున్నానంటూ.. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తన ప్రైవేట్ విడియోలతో ట్రోల్ చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కల్పన డిమాండ్ చేశారు. తన భర్తపై మీడియాలో తప్పుడు ప్రచారం జరు గుతోందని, దాన్ని ఆపేయాలని విజ్ఞప్తి చేస్తూ కల్పన ఓ విడియో విడుదల చేశారు. ఒత్తిడి కారణంగా నిద్రపట్టలేదని, అందుకే టాబ్లెట్స్ వేసుకున్నట్లు తెలిపారు. కాగా, కల్పనపై అసత్యప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసు కుంటామని శారద హామీ ఇచ్చారు.

# వర్గీకరణ చట్టం వచ్చేదాకా ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలి

## ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ




సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 9, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆగమేఘాల మీద ఉద్యోగాల భర్తీ చేయాలని చూడటం, గ్రూప్ 1, 2తో పాటు అనేక పోస్టులకు వారంలోనే ఫలితాలు ప్రకటించటం చూస్తూ ఉంటే ఉద్యోగ నియామకాల విషయంలో ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని స్పష్ట మవుతోందన్నారు. తక్షణమే ఫలితాల ప్రకటన ఆపకపోతే ఎస్సీ నిరుద్యోగుల ఆగ్రహానికి మీ రాజకీయ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని సీఎంకు, సీఎస్‌కు, మంత్రికి, పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్‌కు మెయిల్ ద్వారా పంపించామని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాలల వత్తిడికి తలొగ్గి పనిచేస్తున్నారని, అందుకే వర్గీకరణ జరగకముందే ఉద్యోగాలు భర్తీ చేసి, మాలలకు లాభం చేకూర్చాలని చూస్తున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజే నిండు శాసనసభలో వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉద్యోగాలన్నీ మాలలకే చెందే విధంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణ పూర్తి అవ్వకముందే డీఎస్సీ ఫలితాలు ఇచ్చి, నియామకాలు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల మాదిగ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబోయే అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును తీసుకువస్తామని చెప్తూనే దానికి విరుద్ధంగా ఫలితాలు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణలో కోర్టు తీర్పును ఇరు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు స్వాగతించారని గుర్తు చేశారు. చంద్రబాబు వర్గీకరణకు కట్టుబడి ఉన్నారు, రేవంత్‌రెడ్డి వర్గీకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నారు కానీ మాలల వత్తిడిలో ఉండి, మాదిగలకు అన్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. షమీమ్ అక్తర్ నివేదికలో అనేక లోపాలున్నాయని, అవి మాదిగ కులాలకు శాపంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాసన సభలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి, వత్తిడికి లోనయ్యి పనిచేసేకంటే రాజీ నామా చేయాలని అన్నారు. ఈ రోజు నుంచి వర్గీకరణ చట్టం వచ్చే వరకు జిల్లాల్లో నిరవధిక దీక్షలు చేస్తామని, అసెంబ్లీ సమావేశాలు పూర్తి అయ్యే వరకు అన్ని జిల్లా, మండల కేంద్రాలలో దీక్షలు చేస్తామని పేర్కొన్నారు. వర్గీకరణకు మద్దతు ఇచ్చే అన్ని సంఘాలను, రాజకీయ పార్టీలను కలుపుకుని ముందుకు పోతామని, అన్ని యూనివర్సిటీలలో వర్గీకరణ చట్టం కోసం దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రాంతి దళ్ పృధ్వీరాజ్‌యాదవ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ, తెలంగాణ విట్టల్, సీనియర్ జర్నలిస్ట్ ఇస్మాయిల్, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి.వి.నరసింహ మాదిగ, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి దప్పు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామారావు శ్రీనివాస్ మాదిగ, దుప్పెలి అనిల్ మాదిగ, అరుణ్ మాదిగ, మహిళా నాయకులు రేణుక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో మళ్లీ పెచ్చుమీరుతున్న హింస

## రాకపోకలకు తీవ్రస్థాయిలో కుకీ మిలిటెంట్ల అడ్డంకులు




**ఇంఫాల్, మార్చి 9:** ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు తారస్థాయికి చేరాయి. రాష్ట్రపతి పాలన అమలుకు వచ్చిన తర్వాత అక్కడమైయిటీ, కుకీ మిలిటెంట్లు తమ ఆయుధాలు అప్పగిస్తున్నా రోజురోజుకూ కుకీలకు భద్రతా బల గాలకు మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. మణిపూర్‌ప్రభుత్వం నుంచి ప్రత్యేక పరిపాలన మండలి ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్ నెరవేరేదాకా రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరగకూడదని కుకీలు నిరసన తెలుపుతున్నారు. రాష్ట్రంలో స్వేఛ్ఛా యుత రాకపోకలను అడ్డుకునేందుకు కుకీలు ప్రయ త్నించారు. దీనితో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా బలగాల రక్షణలో రాష్ట్రంలోని జిల్లాల్లో బస్సులు తిరగడం కూడా ప్రారంభించారు. రాజధాని ఇంఫాల్‌కు 45 కిలోమీటర్లదూరంలోని కాంగ్‌పోక్పిజిల్లాలోభద్రతా బలగాలను అడ్డుకుంటున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. రహదారిని దిగ్బంధించడానికి ప్రయత్నించిన కుకీ తెగకు చెందిన మహిళలపై భద్రతా బలగాలు లాఠీఛార్జిచేసాయి. ఈ ఘటనలో చాలా మంది గాయపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా కూడా రోడ్డు దిగ్బంధాలు ఉండకూడదని కేంద్రం ప్రకటించింది. అయితే కుకీలు అడ్డుకోవడంతో పలుప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. కుకీలు భద్రతా బలగాల వాహనాలపై రాళ్ల రువ్వడంతోపాటు రోడ్లను తవ్వడం టైర్లను కాల్చడం, బారికేడ్లను ఏర్పాటు చేయడం వంటివిచేసారు. రెండేళ్లనుంచి మెజార్టీ మైయిటీ, మైనార్టీ కుకీలమధ్య తెగల హింస కొనసాగుతోంది. తమ ఆధిపత్యంకోసం ఇరుతెగలు దాడులుచేసుకుం టున్నాయి. ఈ హింసలో 250 మ ంది మరణించారు. సుమారు 50వేలమంది నిరాశ్రయు లయ్యారు. కార్యకలాపాల సస్పెన్షన్ ఒప్పందంపై సంతకం చేసిన సుమారు రెండు డజన్ల మిలిటెంట్‌గ్రూపులు, కుకీనాయకులు రాష్ట్రంలో స్వేఛ్ఛగా తిరగ దానికి అనుమతించేముందు తమకు ప్రత్యేకపరిపాలన మండలి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# నేటి నుంచి తెలంగాణ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో గోడ గడియారాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 9:** రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేసేందుకు ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. సోమవారం ఉదయం పరీక్ష ప్రారంభమయ్యే నాటికి అన్ని కేంద్రాల్లోని గదుల్లో గడియారాలు సిద్ధం చేయాలని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య జిల్లాల ఇంటర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,532 ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డు తాజా నిర్ణయంతో అన్ని కేంద్రాల్లోని పరీక్ష గదుల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గోడ గడియారం కొనుగోలుకు రూ.100 చొప్పున మంజూరు చేశామని ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే వాల్ క్లాక్ రూ.100కు రాదని, మరికొంత సొమ్ము చెల్లించి అధికారులే గడియారాలు కొని పరీక్షా కేంద్రాలకు సరఫరా చేయాలని పలువురు ఇంటర్ బోర్డును కోరారు. కాగా తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 20 వరకు జరగనున్నాయి. ఆయా తేదీల్లో రోజూ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమైన సంగతి తెలి సిందే.

అయితే విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి వచ్చే ముందు సెల్‌ఫోన్లు, క్యాలి క్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు చేతి వాచ్‌లు కూడా బయటే వదిలేసి రావాలని, వాటితో పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని ఆంక్షలు పెట్టింది. దీంతో ఇంటర్ పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థుల స్మార్ట్, రిస్ట్ వాచ్‌లను అనుమతించలేదు. తొలి రోజు నుంచే విద్యార్థులు చేతికి వాచ్‌లు లేకుండానే పరీక్షలకు హాజరవుతున్నారు. మరోవైపు అధికారులు సమయాన్ని సూచిస్తూ అర గంటకు ఒకసారి గంట కొడతారని, ఇన్విజిలేటర్లు కూడా సమయం చెబుతారని ఇటీవల బోర్డు కార్యదర్శి ప్రకటించారు.

అయితే రాష్ట్రంలో చాలాచోట్ల ఈ విధానాన్ని పాటించలేదని ఫిర్యాదులు వచ్చాయి. సమయం తెలియక విద్యార్థులు ఆందోళన చెందారు. సమయం తెలియక పరీక్షలను సరిగ్గా రాయలేక పోయామని పలువురు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.

# సమీకృత గురుకులాలకు రూ.11,600 కోట్ల కేటాయింపు

## తెలంగాణ డిప్యూటీ సీఎం విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** తెలంగాణలో 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి 11,600 కోట్ల రూపాయలు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలోనే ఎక్కడ ఇంత వరకు లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత కొద్ది నెలల క్రితం మూడు పాఠశాలలు మంజూరు చేసి నిధులు కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా 55 పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మాణం చేయబోతున్నామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మాదిరిగా దేశంలో ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ఉండవని స్పష్టం చేశారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అందులో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు కూడా అక్కడే వసతి కల్పించడానికి గృహ సముదాయాన్ని నిర్మిస్తామని చెప్పారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు సాంకేతికంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ విద్యా బోధన జరుగుతుంన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కావలసిన ల్యాబ్స్, లైబ్రరీ తో పాటు మినీ థియేటర్ కూడా ఉండేలా డిజైన్ చేసినట్లు వెల్లడించారు. పేద బడుగు బలహీనవర్గాల కుటుంబాలకు ఉపయోగపడేలా, అంతర్జాతీయ స్థాయిలో ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి విధంగా సిలబస్ ను కూడా రూపొందించినట్లు పేర్కొన్నారు. సమాజానికి మేలు చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ప్రపంచాన్ని శాసించే సంస్థల్లో పని చేసే విధంగా ఇందులో చదివే విద్యార్థులు ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పోగేస్తున్న ప్రతి పైసా ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రజా ప్రభుత్వం వినియోగిస్తోందని స్పష్టం చేశారు.

# యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

## కలెక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలి

## తెలంగాణ రెవెన్యూ ,హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మార్చి 9 ,ప్రభాతవార్త :** యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక చేయాలని రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి మంత్రి తన నివాసంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా యుద్ధ ప్రతిపాదికనలబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలన్నారు. ఇం దిరమ్మ ఈ పథకంలో కలెక్టర్లు మరింతక్రియాశీలకంగా వ్యవహరించాలని, వీటిపై కలెక్టర్లకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని, కాలయాపన చేయకూడ దన్నారు.లబ్ధిదారుల ఎంపికలో స్థానిక శాసన సభ్యుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని కలెక్టర్‌లే తుది నిర్ణయం తీసుకోవాలన్నారు.ఎంపికలో నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలినిర్మాణం పూర్తి అయిన 2 బి హెచ్ కే ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి అసంపూర్తిగా ఉన్న వాటిని కాంట్రాక్టర్లు పూర్తి చేయని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాల న్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగునీరు, త్రాగునీరుకు ఎలాంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ జిల్లాలోని ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డు కు భూసేకరణను వేగవతం చేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

# రన్యారావుపై కేసు నమోదు చేసిన సిబిఐ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 9:** కన్నడ నటి రన్యారావు (34) ఇటీవల దుబాయ్ నుండి అక్రమంగా బంగారాన్ని రవాణా చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం రన్యారావును డీఆర్ఐ అధికారులు కస్టడీలో ఉంచుకుని విచారణ చేస్తుండగా, అక్కడ విచారణ అనంతరం సీబీఐ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. రన్యారావు కాల్ డేటాలోని వివరాల ఆధారంగా ఢిల్లీ, ముంబైలలో కూడా సీబీఐ అధికారులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం.తన సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీ డాక్టర్ కె. రామచంద్రరావు పేరు ఉపయోగించి కేసు నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిం చినా ఫలితం దక్కలేదు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికా రులు ఆమె వద్ద నుంచి 14 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అయితే ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.

డీఆర్ఐ విచారణలో ఆమె తరచుగా దుబాయ్ వెళ్లి వస్తూ బంగారం అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో రన్యారావుపై సీబీఐ అధికారులు శనివారం కేసు నమోదు చేశారు. దీంతో వారు త్వరలో రన్యారావును విచారించే అవకాశం ఉంది.

రన్యారావు వద్ద నుంచి ఇప్పటికే రూ.2.06 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.2.67 కోట్ల నగదుతో సహా మొత్తం రూ.17.56 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు అనుమతితో ఆమెకు సంబంధించిన ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు సీజ్‌చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు.

# టీఎన్జీవో స్టేట్ ట్రెజరర్ రామినేని శ్రీనివాస్‌రావు మృతి

## కెసిఆర్,కెటిఆర్,హరీశ్‌రావు సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి9:** తెలంగాణ ఉద్యమకారుడు, టీఎన్జీవో స్టేట్ ట్రెజరర్,ప్రభుత్వ ఆబ్కారీ శాఖలో సూపరిండెంట్, రామినేని శ్రీనివాస్‌రావు మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ఉద్యోగ సంఘాల నేతగా వారి కృషి చిర స్మరణీయమన్నారు. వారి మృతి విచారకరమన్నారు. వారి మృతి తో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన సానుభూతిని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. తెలంగాణ ఎన్జీఓ సంఘం నాయకుడు శ్రీనివాసరావు మరణం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర సంతాపం ప్రకటించారు.ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.తెలంగాణ సాధన ఉద్యమంలో శ్రీనివాస్ చేసిన పోరాటం అనిర్వచనీయమన్నారు.

10-3P□g7exHMNWJQE.qxd:10-3P□g7exHMNWJQE.qxd 01/01/01 9:55 AM Page 1



# భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం




## ములుగు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా

### పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**ములుగు, మార్చి 9, ప్రభాతవార్త :** ఆదివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ తో కలిసి రామచంద్రాపురం, జంగాలపల్లి, కాసిం దేవిపేట గ్రామాల లో వివిధ నీటి పారుదల కాలువల క్రింద భూమి కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించినారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతులకు మెరుగైన నష్ట పరిహారం ఇప్పించుటకు సహకరిస్తామని, రైతులు భూ సేకరణ కు సహకరించాలని కోరినారు. రామప్ప, లక్నవరం లింక్ మెయిన్ కెనాల్ వలన జంగలపల్లి, కాశిందేవిపేట రైతుల భూములకు సాగునీరు అందడం తో పాటు లక్నవరం జలాశయం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని, రామచంద్రపురం ద్వారా వెళ్లే 1ఆ, 2ఆ డిస్ట్రిబ్యూషన్ కాలువల క్రింద రామచంద్రపురం, మల్లం పల్లి గ్రామాల లో వ్యవసాయ భూములకు సాగు నీరు అందుతుందని తద్వారా మెరుగైన దిగుబడి వస్తుందని, రైతులు భూ సేకరణ కు సహకరించాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, తహసిల్దార్ విజయ భాస్కర్, ఇరిగేషన్ అధికారులు, రామచంద్రాపురం, జంగాలపల్లి, కాసిందేవిపేట గ్రామాల రైతులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హజ్‌కు రాష్ట్రం నుండి 6,947 మంది యాత్రికులు

### భారత్ హజ్ కమిటీ ఆమోదం

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త :** తెలంగాణ నుండి మొత్తం 6,947 మంది యాత్రికులు ఏప్రిల్ చివరిలో ప్రారంభం కానున్న హజ్ యాత్రను చేపట్టను న్నారు, 19 సంవత్సరాలలో మొదటి సారిగా రాష్ట్రం నుండి వచ్చిన అన్ని దరఖాస్తులను భారత హజ్ కమిటీ ఆమోదించింది. వీరిలో 6,519 మంది దరఖాస్తుదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. 65 ఏళ్ల మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు, మెహ్రామ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న మహిళలు (45 ఏళ్ల పైబడినవారు) డ్రా లేకుండానే ఎంపికయ్యారు. ఇర దరఖాస్తు చేసుకున్న తర్వాత రద్దు చేసుకున్న కారణంగా, 51 మెహ్రామ్ కోటా స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల దరఖాస్తుదారులతో సహా మొత్తం 9,011 మంది యాత్రికులు హైదరాబాద్ నుండి బయలుదేరుతారు. కాగా ప్రతి రాష్ట్రంలోని ముస్లిం జనాభా ఆధారంగా హజ్ కోటా స్లాట్‌లను కేటాయిస్తారు. తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ ఏర్పాట్లకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి అభ్యర్థనలు సమర్పించారు. రేవంత్ రెడ్డి ఈ అభ్యర్థనలను యూనియన్ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపడంతో దాన్ని మార్పులు చేయకుండా అగీకారం తెలిపింది. ఇక హజ్ వెళ్లే ప్రతి 150 మంది యాత్రికులకు ఒక ఇన్స్పెక్టర్‌ను యమించాలని భారత హజ్ కమిటీ ఆమోదించింది, గతంలో 200 మంది యాత్రికులకు ఒక ఇన్స్పెక్టర్‌ను నియమించారు. అదనంగా, రిజర్వ్ కేటగిరీ వయస్సును 70 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలకు తగ్గించింది. తెలంగాణ యాత్రికులకు సహాయం చేయడానికి మక్కాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చైర్మన్ బియాబానీ కూడా అభ్యర్థించారు. ఎంపికైన యాత్రికులకు తెలంగాణ హజ్ కమిటీ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. చివరిగా ఆమోదించబడిన హజ్ యాత్రికులు మార్చి 10 లోపు మొదటి మరియు రెండవ వాయిదాలను చెల్లించాలి. మార్చి 10 తర్వాత మూడవ విడత చెల్లింపు ప్రకటన కోసం యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని భారత హజ్ కమిటీ సూచించింది.

# నేతన్నల రుణ మాఫీకి రూ.33 కోట్లు మంజూరు

### చేనేత, జౌళి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు లక్ష రూపాయల లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందు కోసం 33 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చేనేత రంగాన్ని గాడిలో పెట్టేందుకు అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకొన్నామన్నారు.
తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ శాఖలు, సంస్థలు, సమాఖ్యల నుండి బట్టలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకొన్నామని చెప్పారు. దీనివలన నేతన్నలకు నిరంతర ఉపాధి కలగడమే కాకుండా, వారి జీవనోపాధి మెరుగుపడటానికి, అలాగే చేనేత పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. చేనేత రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీ మరియు మన స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ చేసుకునేవిధంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అలాగే సిరిసిల్ల జిల్లాలో యార్న్ డిపో స్థాపించుకొన్నామని, ఇందుకోసం రూ.50 కోట్ల కార్పస్ ఫండ్ మంజూరు చేసామని వివరించారు. అతేకాకుండా తెలంగాణ చేనేత అభయహస్తం పథకాన్ని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
కాగా, చేనేత కార్మికులకు రూ.33 కోట్ల రుణమాఫీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కార్మికుడికి రూ. లక్ష వరకూ రుణమాఫీ చేసేందుకు సిద్ధమైంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రుణాల మాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం రుణమాఫీ చేస్తూ జీవో విడుదల చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు 2017 వరకు రుణమాఫీ చేసింది. జిల్లా సహకార వ్యాంకుల నుంచి, జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించింది. ఇక ఉమ్మడి నల్గొండ జిల్లాలో బారీ స్థాయిలో వస్త్ర వ్యాపారం జరుగుతుంది. ఇక్కడ తయారీ రంగం కూడా ఉంది. సుమారు ఈ ఇమ్మడి జిల్లాలో సుమారు 20 వేల మంది వరకూ చేసేత కార్మికులు ఉంటారు. పోచంపల్లి, గట్టుప్పల్, అట్టపాక, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి, చండూరు, మునుగోడు తదితర ప్రాంతాల నుంచి చీరల వ్యాపారం అదికంగా సాగుతూ ఉంటోంది. ఇక్కడ సుమారు 40 పైగా సొసైటీలు ఉండగా, వాటిల్లో వేలాది కుంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారు.


నిరసన ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య

# ప్రభుత్వ స్థలాల విక్రయ యోచన విరమించుకోవాలి

### ప్రభుత్వ హాస్టళ్లకు, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలి

### జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 9, ప్రభాతవార్త:** ప్రభుత్వం హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను వేలంవేసి అమ్మాలనే ఆలోచన చేస్తోం దని, దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ప్రభుత్వ స్థలాలలో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలంటే ప్రజల ఆస్తులని, వాటిని ప్రజాఅవసరాలకు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, పాఠశాలు నిర్మించటానికి ఉపయోగించాలి కానీ అమ్మకూడదని హెచ్చరించారు. రాష్ట్రంలో బిసి హాస్టళ్లు ప్రారంభించి 27 సంవత్సరాలు అయినప్పటికీ ఒక్క హాస్టల్‌కు కూడా సొంత భవనం లేదని గుర్తు చేశారు. వందల కోట్లు పెట్టి ఫ్లైఓవర్స్ నిర్మిస్తున్నారు కానీ, పేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు, గురుకులాలపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రశ్నించారు. స్వంత భవనాలు లేకపోవటంతో హాస్టళ్లు అద్దె భవనాలలో చాలీ చాలని వసతులతో నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లాపల్లి అంజి, నందగోపాల్, మణికంఠ, అనంతయ్య, మల్లేష్, రాజేందర్, మోదీ రాందేవ్, నిఖిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# బిట్టుపల్లిలో పెద్దపులి సంచారం

### భయాందోళనలో రాత్రుళ్లు గ్రామస్తుల జాగారం

**మంథని రూరల్, ప్రభాతవార్త:** మంథని మండలంలోని బిట్టుపల్లి గ్రామ శివారులో శనివారం సాయంత్రం పెద్దపులి రోడ్డు దాటుతుండగా గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు చూడడంతో పెద్దపులి భయంతో గ్రామ ప్రజలు రాత్రులు నిద్ర లేకుండా జాగారం చేస్తున్నారు. బిట్టుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి సతీష్ అనే రైతు శనివారం రాత్రి తన పొలం నుండి ఇంటికి వస్తుండగా పెద్దపులి రోడ్డు దాటుతుండగా చూశాడు ఈ విషయం గ్రామస్తులకు తెలియజేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురై ఫారెస్ట్ అధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు.. ఫారెస్ట్ అధికారులు పోలీసులు వచ్చి పాదముద్రలను గుర్తించి పెద్దపులి పాదం ముద్రలుగా గుర్తించారు.
బిట్టుపల్లి గ్రామ శివారులో పెద్దపులి సంచరిం చడంతో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. జిల్లా ఫారెస్ట్ అధికారి శివయ్య బిట్టుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడి భయాందోళనకు గురికా వద్దని ఆందోళన చెందవలసిన పనిలేదని శనివారం రాత్రి ఊర్లో ప్రజలందరితో మాట్లాడారు. ఆదివారం ఉదయం పెద్దపులి పాదముద్రలు మళ్లీ కనిపించాయి శాస్త్రులపల్లి వైపుకెళ్లిపోయినట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా పెద్దపులి సంచారం బిట్టుపల్లి గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయ్నాదోళనకు గురవుతున్నారు.

# మహిళా దినోత్సవ సభలో రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే

### సిఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు విమర్శలు



ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 9:** మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు ధ్వజమెత్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారని... అబద్ధానికి ప్యాంట్, షర్టు వేస్తే రేవంత్ రెడ్డిలా ఉంటుందని విమర్శించారు. ఆదివారం పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామ న్నారని... ఆ రుణాలు ఎలా ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఒకవేళ రూ.21 వేల కోట్ల రుణాలు నిజంగానే ఇచ్చి ఉంటే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి తోడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా గోబెల్స్ ప్రచారంలో ఆరితేరారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిందే ఇస్తూ... రూ.21 వేల వడ్డీ లేని రుణం అని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కాంగ్రెస్ సర్కారు మరింత మోసం చేస్తోందని, ఇచ్చే రూ.5 లక్షల వడ్డీ లేని రుణం కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది గుండు సున్నా అని, కాంగ్రెస్ ప్రచారం అంతా బోగస్, డొల్ల అని హరీశ్ రావు విమర్శించారు. ఆదివారం రోజు మీ అబద్ధాలు వినలేక సభ నుంచి మహిళలు వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో మా ప్రభుత్వం యునిఫాం కుట్టేందుకు మహిళ సంఘాలకు రూ.50 చొప్పున ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా అవే రూ.50 ఇచ్చారని మహిళలు చెబుతున్నారు. కానీ రూ.75 ఇస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాటుసారా నిరోధకులకు 60 మందికి క్యాష్ అవార్డులు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త :** గంజాయి, డ్రగ్స్ ను, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్ట డంలో ఎన్‌ఫోర్స్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ టీమ్‌లు పరుగులు పెడు తున్నాయి. మద్యం అమ్మకాలపై దెబ్బతీస్తున్న నాటుసారా తయారీ, అమ్మ కాలు, రవాణపై మరోపక్క.. ఎక్సైజ పోలీసులు ఉక్కుపాదం మోపు తున్నారు. నాటుసారాపై రెండుమార్లు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌లో ఎక్సైజ్ పోలీసులకు చేదోడువాదోడుగా ఎన్‌ఫోర్స్ మెంట్ టీములు, పోలీసుల సహకారం తెలంగాణ లో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ వి.బి.కమలాన్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖలో నూతనో త్సాహం నింపుతున్నారు. నాటుసారా తెలం గాణలో కొన్ని ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే ఉంది. నాటుసారా తయారీ జిల్లాలో వరంగల్, మహ బూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలో ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో అధికారులకు డైరెక్టర్ ఇచ్చిన మార్గదర్శనంతో నిత్యం దాడులు నిర్వహిస్తు తమదైనముద్ర వేసు కుంటున్నారు.

**25 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక దృష్టి..**
తెలంగాణ మొత్తం 33 జిల్లాల్లో కేవలం 13 జిల్లాల్లోనే నాటుసారా తయారీ ప్రభావం ఉంది. ఈ జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణ జరుగు తున్న 25 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు ప్రణాళి కలు వేసి గత రెండు నెలలుగా దాడులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులకు తోడు ఎస్టీఎఫ్ టీమ్‌లు, సివిల్ పోలీసులు సహకారం అందిస్తు ఉండడంతో నాటుసారా పూర్తి స్థాయిలో కంట్రోలకు వచ్చింది.

**60 మందికి క్యాష్ అవార్డులు..**
గతరెండు నెలల్లో 25 ఎక్సైజ్ పోలీసులు నాటుసారాపై నిర్వహిస్తున్న దాడుల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది ఎక్సైజ్ పోలీసులను గుర్తించారు. నాటుసారాపై దాడులు భారీగా నిర్వహించి అరికట్టిన వారికి క్యాష్ రివార్డులు ఇవ్వాలని నిర్ణ యం తీసుకున్నారు. ఈ మేరకు 60 మందిని గుర్తించి వీరందరికి అబ్కారీ భవన్ నాంపల్లి హైదరాబాద్‌లో కాష్ అవార్డులు ఇవ్వనున్నారు.
రెండు నెలల్లో సాధించిన ప్రగతి..జనవరి, ఫిబ్రవరి రెండు నెలల్లో నాటుసారాపై 2753 కేసులు నమోదు చేశారు. 2578 మందిని అరెస్టు చేశారు. 13,122 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.
39,887 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారాకు బెల్లంతోపాటు వినియోగించే 4,720 కేజీల అలంను స్వాధీనం చేసుకున్నారు. 424 వాహనాలను, నాటుసారా తయారీపై రూ. 29,55,000 జరిమానాలు విధించారు.

**రెండు నెలల్లో జిల్లాల వారీగా కేసుల నమోదు**
ఎక్సైజ్‌శాఖలో 10 డివిజన్లు ఉన్నాయి. ప్రతి ఉమ్మడి జిల్లాను ఒక డివిజన్‌గా ఎక్సైజ్ శాఖలో పరిణిస్తారు. 2025లో రెండు నెలల్లో అదిలాబాద్‌లో 369 కేసులు, కరీనంగర్‌లో 257, మహబూబ్‌నగర్‌లో 223, వరంగల్‌లో 1142, మెదక్‌లో 58, నిజామాబాద్‌లో 152, నల్లగొండలో 282, ఖమ్మంలో 154, రంగారెడ్డిలో 116, హైదరాబాద్‌లో నిల్‌గా కేసులు నమోదు అయ్యాయి. 2024లో జనవరి, ఫిబ్రవరిలో పది డివిజన్లలో 1674 కేసులు అవుతే.. 2025లో రెండు నెల్లల్లో 2753 కేసులు నమోదు అయ్యాయి.

# 'ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు కేంద్రం నిధులు కేటాయించాలి'



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఎన్ఐఆర్‌డిపిఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అకడమిక్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 9, ప్రభాతవార్త:** ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు కేంద్రం నిధులు కేటాయించాలని ఎన్ఐఆర్‌డిపిఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అకడమిక్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు నిధులు కేటాయించకపోవటాన్ని నిరసిస్తూ ఆదివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఎన్ఐఆర్‌డిపిఆర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ ధర్నా నుద్దేశించి ఎన్ఐఆర్‌డిపిఆర్ అకడమిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జ్యోతి, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, పెన్ష నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మణి మాట్లా డుతూ జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థకు (ఎన్ఐఆర్‌డిపిఆర్) గత 65 సంవత్స రాలుగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఉందని, హఠాత్తుగా 2025-26 బడ్జెట్‌లో కేంద్రం నిధులు నిలివేయటంతో సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం డిస్‌ఎంగేజ్‌మెంట్ ప్రక్రియను ఆపాలని, ఎన్ఐఆర్‌డిపిఆర్‌కి పూర్తి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. పెన్షనర్ల పెన్షన్, పదవీవిరమణ ప్రయోజనాలు ఒపిఎస్ కింద గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుండి అందించబడాలని, ఎన్‌పీఎస్ ఉద్యోగులకు కూడా ఇదే వర్తింప చేయాలని కోరారు. ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ వేతన స్కేలు, సదుపాయాలు యధాతథంగా కొనసాగించాలని, భవిష్యత్తులో కేంద్ర వేతన సవరణలు ఏమైనా ఉంటే అవి ప్రస్తుత ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత హామీ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత రూల్స్, రెగ్యులేషన్స్, సర్వీస్ కండిషన్స్ కొనసాగించాలని, సంస్థలో ఖాళీగా ఉన్న సీనియర్ స్థానాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ ధర్నా కార్య క్రమానికి సీపీఎం రాష్ట్ర నాయ కులు డి.జి. నరసింహరావు, బీఆర్ఎస్ రాజేంద్ర నగర్ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, సీఐటియూ నాయకులు ఎస్ఎస్ఆర్‌ఏ ప్రసాద్ హాజరై మద్దతు తెలిపారు. ధర్నాలో ఎన్ఐఆర్‌డిపిఆర్ ఉద్యోగులు, పెన్షనర్స్ పెద్దఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

# ఎర్ర సత్యాన్ని రెడ్లే దొంగ దెబ్బతీశారు..

### పదవుల కోసం డికె అరుణ, రేవంత్‌రెడ్డి ఎన్ని పార్టీలు మారారు..?

### మహబూబ్‌నగర్ బిసి జెఎసి రాజకీయ అవగాహన సదస్సులో తీన్మార్ మల్లన్న

**మహబూబ్నగర్ బ్యూరో, మార్చి 9, ప్రభాతవార్త:** మన బీసీ పులి బిడ్డ ఎర్ర సత్యం అన్నను రాజకీయంగా ఎదుర్కోలేక రెడ్డిలు దొంగ దెబ్బ తీసి చంపారని తీన్మార్ మల్లన్న అలాయాస్ చింతపండు నవీన్ గుర్తు చేశారు. మా వాటా మా ఇజ్జత్ మా పదవులు మాకే కావాలన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ ఐక్యవేదిక రాజకీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మా వాటా మా ఇజ్జాత్ మా పదవులు మాకు కావాలని రాజ్యాధికారం దక్కే వరకు తామంతా కలిసే ఉంటామని ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న ఎర్ర సత్యం అమర్ రహే ఎర్ర సత్యం అమర్ రహే అంటూ నినదించారు. అధికారం కోసం ఎంపీ డీకే అరుణ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని పార్టీలు మారారో మీరే చూసారని చెప్పారు. బీసీలు నమ్మిన పార్టీ కొరకు నమ్మిన సిద్ధాంతం కొరకు పార్టీలు మారే రకం కాదన్నారు. వీళ్లకు ప్రజా సంక్షేమం కన్న అధికార దాహం కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారారని మండిపడ్డారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఇడబ్ల్యుసి తొలగించాలని డిమాండ్ చేశారు.

# సన్నధాన్యం బోనస్ కోసం రైతుల ఎదురుచూపులు

### ఒక్కో జిల్లాలో రూ. 10 కోట్ల వరకూ పెండింగ్

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సన్న రకం ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నుండి రావాల్సిన బోనస్ సొమ్ముల కోసం రైతాంగం ఎదురు చూస్తోంది. ధాన్యం అమ్మి నెలల తరబడి అవుతున్నా పలువురు రైతులకు అది అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మొదట్లో ఒకటి, రెండ్రోజుల్లోనే బోనస్ జమ కాగా, ఇప్పుడు రోజుల తరబడి నిరీక్షి ంచాల్సి వస్తుండటంపై రైతులు అసహనానికి లోనవుతున్నారు. ప్రస్తుత యాసంగి పెట్టుబడి కోసం రైతు భరోసా అందక పోగా, కనీసం ధాన్యం బోనసైనా వస్తుందనుకుంటే నెలల తరబడి జాప్యం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్దతు ధర లేకున్నా క్వింటాకు రూ.500 బోనస్ దక్కుతుందని భావించి కొనుగోలు కేంద్రాలో ధాన్యం విక్రయించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడానికి తోడు, రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఎక్కువగా ఈ రకాలనే సేద్యం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈసారి 61శాతం వరి సాగు పెరిగింది. పోయినేడు వానాకాలంలో వరి సాగు విస్తీర్ణంలో సన్నాల వాటా 25.05 లక్షల ఎకరాలు (38 శాతం) కాగా, ఈసారి అది 40.44 లక్షల ఎకరాలకు (61 శాతానికి) పెరిగింది.
గతేడాది వానాకాలం 40.89 లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లు సాగైతే, ఈసారి అది 26.33 లక్షల ఎకరాలకు తగ్గింది. కానీ రెండు, మూడు నెలలుగా చాలా మందికి ఈ బోనస్ జమ కాకపోవడంతో ఇస్తారా? లేదా? అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రతిరోజూ వందలాది మంది రైతులు బోనస్ జమ అయిందేమోనని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఒక్కో జిల్లాలో రూ.10 కోట్లకు పైగా బోనస్ పెండింగ్‌లో ఉంది. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 40వేల మందికి పైగా రైతులకు రావాల్సిన సుమారు రూ.పది కోట్లకు పైగా బోనస్ పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

# రాష్ట్రాభివృద్ధిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో చర్చకు సిద్ధం

### డ్రామాలాడుతున్న బిజెపి, బిఆర్ఎస్

### మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** బిజెపి బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని, కలసి డ్రామాలు ఆడుతున్నారని మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఎంపీ బలరాం నాయక్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది జీరో అని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ విమర్శించారు. ఆల్ పార్టీ ఎంపీల సమావేశానికి హాజరుకావాలని బిజెపి బిఆర్ఎస్ కాంగ్రెస్ ఎంపీలకు ఫోన్లు చేసి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమాచారం ఇచ్చినా రాకపోవడం దురదృష్టకరం అని ఆవేదన చెందారు. తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించాలనే కాంక్ష ఉండాలేకానీ, బిజెపి, బిఆర్ఎస్ నేతలు తూతూ మంత్రంగా చెప్పారని అనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పదేపదే ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని బిజెపి, బిఆర్ఎస్ నేతలు అప హాస్యం చేయడంలో తగదని, ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ఏయే ప్రాజెక్టులు తెలంగాణకు కావాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలను అడి గారో ఎంపీ బలరాంనాయక్ వివరించారు. బిజెపి,బిఆర్ఎస్ రెండు పార్టీల నుంచి ఎవరో కనీసం ఒక్క రొక్కరైనా శనివారం జరిగిన ఎంపీల సమావేశానికి వస్తా రని అనుకున్నామని చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలకు ప్రజల సమస్యలు పట్టవని ఆరోపించారు. కాంగ్రెస్ మీద కుట్రలు చేయడం తప్ప ఆ రెండు పార్టీల నేతలకు వేరేపని లేదని విమర్శిం చారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయిం పులు చేయకుండా ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతు న్నారని ఎంపీ బలరాం నాయక్ ఫైర్ అయ్యారు.
సిఎం రేవంత్‌రెడ్డిపై బిజెపి నేతలు నిందలు వేస్తున్నారని ఎంపి బలరాం నాయక్ మండిపడ్డారు. ప్రజాభవన్‌లో సమావేశం పెడితే అధికారులు కూడా వస్తారని చెప్పారు. ప్రజాభవన్ అందరిదీ ఏ పార్టీ ఎంపీలు అయినా రావచ్చని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలుకడితే కొత్త అప్పులు ఇస్తామని కేంద్రప్రభుత్వం కొర్రీలు పెడుతోందని ఆగ్రహించారు. తెలంగాణ అభివృద్ధిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటికి కూడా వెళ్లి చర్చిస్తామని ఆయన అన్నారు. గతంలోనూ వెళ్లామని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చింది ఎంత తెలంగాణకు ఇచ్చింది ఎంత అనే వివరాలు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి లోక్‌సభ సభ్యులు సమాధానం చెప్పాలని బలరాంనాయక్ నిలదీశారు. తెలంగాణకు కరెంట్ ఇచ్చే సీలేరు ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి కడుతున్న టాక్స్ ఎంత.. కేంద్రం తెలంగాణకు ఇస్తుంది ఎంత అని ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నల వర్షం కురిపించారు.

10-3pg10.qxd:10-3pg10.qxd 01/01/01 7:05 AM Page 1



# 'ఐ లీగ్'లో హైదరాబాద్ శ్రీనిధి గెలుపు



**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఐ లీగ్-2025లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ (ఎస్‌డీఎఫ్‌సీ) గెలుపు జోరు కొనసాగుతున్నది. పంజాబ్‌లోని మహిల్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి టీమ్ 1-0 తేడాతో ఢిల్లీ ఎఫ్‌సీపై అద్భుత విజయం సాధించింది. ఈ సీజన్‌లో ప్రత్యర్థి వేదికలపై శ్రీనిధికి ఇది నాలుగో గెలుపు కావడం విశేషం. ఆఖరి వరకు హోరా హోరీగా సాగిన పోరులో శ్రీనిధి తరఫున డేవిడ్ కాస్టెండా మునోజ్ (62ని) ఏకైక గోల్ చేశాడు. ఎస్‌డీఎఫ్‌సీ మూడు మార్పులతో బరిలోకి దిగడం కలిసొచ్చింది. 62వ నిమిషంలో డేవిడ్ కాస్టనెడా ఈ గోల్ చేశాడు. తొలుత రెండు జట్లు స్పష్టమైన అవకాశాలను సృష్టించకుండా పోజిషన్‌ను పంచుకున్నాయి. కొన్ని హాఫ్‌అవకాశాలు తప్ప, మొదటి అర్ధభాగం పెద్దగా ప్రభావం చూపలేదు. ఒక్క గోల్ లేకుండా ముగిసింది. రెండవ అర్ధభాగాన్ని మరింత దూకుడుగా ప్రారంభించిన డెక్కన్ వారియర్స్ ఆట వేగాన్ని నియంత్రించడం ప్రారంభించింది. కొన్ని సెట్‌పీస్‌లను గోల్స్‌గా మార్చడంలో విఫలమైన తర్వాత, వారు చివరికి 62వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించారు. అయితే, శ్రీనిధి ఆతిథ్య జట్టు నుండి దాడులను తట్టుకోవలసి వచ్చింది, కానీ గోల్ కీపర్ ఆర్యన్ లాంబా నేతృత్వంలోని వారి దృఢమైన రక్షణ క్లీన్ షీట్‌ను కాపాడుకోగలిగింది. అదనపు సమయం ఆరు నిమిషాల తర్వాత, రిఫరీ చివరి విజిల్ మోగించి, డెక్కన్ వారియర్స్ సీజన్‌లో ఏడవ విజయాన్ని నిర్ధారించాడు.

## ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో..
# భారత్ షట్లర్ ఆయుష్ సంచలనం




**న్యూఢిల్లీ:** ఓర్లీన్స్ మాస్టర్స్-2025లో భారత్ యువ షట్లర్ ఆయుష్ శెట్టి సెమీ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. ఫ్రాన్స్‌లోని ఓర్లీన్స్‌లో జరిగిన ఓర్లీన్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన ఉన్నత ర్యాంక్ పొందిన రాస్మస్ గెమ్కేపై ఆయుష్ అద్భుత విజయం సాధించాడు. ప్రపంచ 48వ ర్యాంక్‌లో ఉన్న ఆయుష్, పలైస్ డెస్ స్పోర్ట్స్‌లోని కోర్టు 1లో గంటా 21 నిమిషాల్లో 21-16, 21-23, 21-17 స్కోరుతో పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌ను గెలుచుకోవడం ద్వారా ప్రపంచ 33వ ర్యాంక్‌లో ఉన్న జెమ్కేను కంగుతినిపించాడు. అంతకుముందు ఆయుష్ హాంకాంగ్‌కు చెందిన ప్రపంచ 38వ ర్యాంకర్ జాసన్ గుణవన్‌ను 50 నిమిషాల్లో 21-17, 21-17 తేడాతో వరుస గేమ్‌లతో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 19 ఏళ్ల ఈ భారత ఆటగాడు తొలి రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ లోహ్ కీన్ యూను వరుస గేమ్‌లలో ఓడించాడు.





## ఐపిఎల్‌కు ముందు.. గుజరాత్, కోల్‌కతాకు
# కొత్త కోచ్‌లు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 ఈ నెల 22 నుండి ప్రారంభం కానుంది. దీనికి ముందు గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచాజీలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. తమ జట్లకు కొత్తగా అసిస్టెంట్ కోచ్‌లను నియమించుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ యాజమాన్యం మాజీ ఆటగాడు, మాజీ ఆస్ట్రేలియా వికెట్‌కీపర్ 37 ఏళ్ల మాథ్యూ వేడ్‌ను అసిస్టెంట్ కోచ్‌గా నియమించుకుంది. వేడ్ 2022, 2024 సీజన్లలో గుజరాత్ టైటాన్స్‌లో సభ్యుడిగా ఉన్నాడు. వేడ్ ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయినప్పటికీ ప్రైవేట్ లీగ్‌ల్లో పాల్గొంటున్నాడు. ఐపీఎల్‌లో వేడ్ మొత్తంగా 15 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 12 గుజరాత్ తరఫున ఆడాడు. 2022 సీజన్లో గుజరాత్ టైటిల్ గెలిచిన జట్టులో వేడ్ కీలక సభ్యుడిగా ఉన్నాడు. వేడ్ వచ్చే ఐపీఎల్ సీజన్లో హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రా, బ్యాటింగ్ కోచ్ పార్థివ్ పటేల్, అసిస్టెంట్ కోచ్‌లు ఆశిష్ కపూర్, నరేందర్ నేగిలతో కలిసిపని చేస్తాడు. అలాగే ఐపీఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ వెస్టిండీస్ మాజీ పేసర్ ఒటిస్ గిబ్సన్‌ను సహాయక కోచ్‌గా ఎంపిక చేసుకుంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 650కి పైగా వికెట్లు పడగొట్టిన 55 ఏళ్ల గిబ్సన్. 1995 నుంచి 99 మధ్య వెస్టిండీస్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం కోచింగ్ వైపు మళ్లిన గిబ్సన్ ఇంగ్లండ్ జాతీయ జట్టుకు రెండు పర్యాయాలు బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు. 2010-14 మధ్య వెస్టిండీస్ హెడ్ కోచ్, 2017-19 మధ్య దక్షిణాఫ్రికా ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన గిబ్సన్ అనుభవం తమ జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా భావిస్తోంది. ప్రస్తుతం కోల్‌కతా జట్టుకు చంద్రకాంత్ పండిత్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా, బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్, స్పిన్ బౌలింగ్ కోచ్‌గా కార్ల్ క్రో పనిచేస్తున్నారు.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ప్లే ఆఫ్స్‌కు మూడు జట్లు





## టోర్నీ నుండి రాయల్ ఛాలెంజెర్స్ ఔట్
## ఫలితం లేని యుపి వారియర్స్ గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో మూడు జట్లు పే ఆఫ్స్‌కు చేరుకున్నాయి. ప్రస్తుతానికి ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న జట్లలో ఉన్నాయి. ఇక ఈ టోర్నమెంట్ నుండి డిపెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు అన్యూంగా నిష్క్రమించింది. దీంతో పాటు, యుపీ వారియర్స్ జట్టు కూడా ప్లే ఆఫ్స్ రేసు నుండి వైదొలగింది. లక్నో వేదికగా తాజాగా జరిగిన మ్యాచ్‌లో ఇప్పటికే టోర్నీ నుంచి ఔటైన యూపీ చేతిలో బెంగుళూరు 12 పరుగులతో ఓటమి పాలైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూపీ టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 225 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జియా వోల్ అజేయ అర్ధ సెంచరీ (56 బంతుల్లో 99 నాటౌట్, 17 ఫోర్లు, 1 సిక్సర్) త్రుటిలో సెంచరీని చేజార్చుకుంది. బౌలర్లలో జార్జియా వారేహమ్ కి 2 వికెట్లు దక్కాయి. ఇక రికార్డు ఛేదనతో బరిలోకి దిగిన ఆర్సీబీ వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ ఫైటింగ్ ఫిఫ్టీ (33 బంతుల్లో 69, 6 ఫోర్లు, 5 ఫోర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచింది. మొత్తం మీద 19.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ దీప్తి శర్మ, సోఫీ ఎకిల్ స్టోన్ చెరో మూడు వికెట్లతో సత్తా చాటారు. ప్లే ఆఫ్స్ రేసులో లేమని భావించిన యూపీ తెగించి ఆడింది. ఓపెనర్ వోల్ ఆకాశమే హద్దుగా చెలరేగింది. ఆమెకు మరో ఓపెనర్ గ్రేస్ హారీస్ (39) కూడా సహకరించింది. వీరిద్దరూ కలిసి ఆర్సీబీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని 49 బంతుల్లోనే 77 పరుగులు జోడించారు. కిరణ్ నవగిరే విధ్వంసం (16 బంతుల్లో 46, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) సృష్టించడంతో యూపీకి ఎదురే లేకుండా పోయింది. చివరి బంతికి రెండు పరుగులు చేస్తే, సెంచరీ పూర్తవుతుందన్న దశలో దీప్తి రనౌట్ కావడంతో వోల్ సెంచరీ మిస్సయ్యింది. తను 99 పరుగులతో అజేయంగా నిలిచింది. దీంతో టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు (99 సోఫీ డివైన్) ని వోల్ సమం చేసింది. మిగతా బౌలర్లలో చార్లీ డీన్ కు ఒక వికెట్ దక్కింది. ఛేదనతో బరిలోకి దిగిన ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (4) తన పేలవ ఫామ్‌ను కొనసాగించింది. మరో ఓపెనర్, తెలుగు ప్లేయర్ సబ్బినేని మేఘన (27), ఎలీస్ పెర్రీ (28) కాసేపు కుదురుగా ఆడారు. వారి తర్వాత బ్యాటర్లు కూడా విఫలమయ్యారు. చివర్లో స్నేహ్ రాణా (26) సిక్సర్లతో విరుచుకు పడటంతో జట్టు స్కోరు 210+ పరుగుల మార్కు దాటింది. మిగతా బౌలర్లలో చినెల్ హెన్రీకి రెండు, అజంలి సర్వానికి ఒక వికెట్ లభించింది.



## ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..
# భారత్‌కు సెమీస్ బెర్త్
## వెస్టిండీస్‌పై 7 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ టీ20-2025 టోర్నీలో ఇండియన్ మాస్టర్స్ టీమ్ మరోవిజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో భాగంగా రాయ్పూర్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది. ఈ విజయంతో టీమిండియా తమ సెమీస్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత మాస్టర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీస్కోర్ సాధించింది. భారత బ్యాటర్లలో సౌరబ్ తివారీ (37 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60), అంబటి రాయుడు (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీలతో మెరవగా, ఆఖరిలో కెప్టెన్ యువరాజ్ సింగ్ విధ్వంసం సృష్టించాడు. విండీస్ బౌలర్లను యువరాజ్ ఉతికారేశాడు. కేవలం 20 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు గుర్‌క్రీత్ సింగ్ మానన్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. వెస్టిం డీస్ బౌలర్లలో బెన, కార్టర్, టేలర్ తలా వికెట్ సాధించారు. అనంతరం భారీ లక్ష్య ఛేధనలో విండీస్ ఆఖరి వరకు పోరాడింది. 253 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కరేబియన్లు, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేశారు. వెస్టిండీస్ బ్యాటర్లలో డ్వైన్ స్మిత్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సతో 79), విలియమ్ పెర్కిన్స్(52) హాఫ్ సెంచరీలు సాధించాడు. లెండల్ సిమిన్స్(13 బంతుల్లో 1 ఫోరు, 5 సిక్స్‌లతో 38) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కానీ ఆఖరిలో వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో వెస్టిండీస్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ మూడు వికెట్లు పడగొట్టగా, పవన్ నేగి రెండు, ఇర్ఫాన్ పఠాన్ ఒక్క వికెట్ సాధించారు.

# గోల్డ్ లోన్‌పై ఆర్‌బిఐ కఠిన నిబంధనలు!

**న్యూఢిల్లీ, మార్చి 9:** బంగారం అంటే కేవలం అలంకార ప్రియం మాత్రమే కాదు, ఆర్థికంగా ఆదుకునే భరోసా కూడా. సామాన్యుల నమ్మకం ఇదే. కష్టం వస్తే గోల్డ్ లోన్‌తో గట్టెక్క వచ్చు అనుకునే వాళ్లకు గడ్డు కాలం రాబోతుంది. భద్రం అని బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెడితే..బ్యాంకు సిబ్బంది చేతివాటంతో అసలుకే ఎసరు వస్తోంది. కస్టమర్ల తాకట్టు పెట్టిన బంగారాన్ని దారి మళ్లిస్తూ మోసాలకు పాల్పడిన బ్యాంకు సిబ్బంది వైనాలు ఇటీవల సంచలనం రేపాయి.మరోవైపు దేశవ్యాప్తంగా మోసాలు కొకొల్లుగా జరిగాయి. జరుగుతున్నాయి. ఇట్లాంటి వాటిని కట్టడి చేసేం దుకు ఆర్‌బీఐ కొరడా ఝులిపించబోతుంది. లోన్ తీసుకునేది ఎవరు? తాకట్టు పెట్టే బంగా రం వారిదేనా? అని ఆరా తీయడం సహా అందుకు సంబంధించిన ఆధారాలను విధిగా సమర్పించాలనే నిబంధన తీసుకురాబోతుంది ఆర్‌బీఐ. గోల్డ్ లోన్ జారీ చేయాలంటే తాకట్టు బంగారం తమదేనని వినియోగదారులు కంప ల్సరీగా ఆధారాలు ఇవ్వాలి. ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్ సహా కస్టమర్ల ఇలాంటి వివరాలన్నింటిని విధిగా తీసుకోవడం సహా ఏ పర్పస్ కోసం లోన్ తీసుకుంటున్నా రో.. అందుకోసమే నగదు వాడుతున్నారా? లేదా? అని చెక్ చేసేలా విధి విధానాలు రాబోతున్నాయి. గోల్డ్ లోన్ తీసుకునే వారికి 20వేలకు మించి నగదు చేతికి ఇవ్వవద్దని, 20వేలకు మించి బ్యాంక్ అకౌంట్ ద్వారా ట్రాన్సాక్షన్ జర గాలని ఇప్పటికే నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఎన్‌బిఎఫ్‌సిలను ఆదేశించింది ఆర్‌బీఐ.



గోల్డ్ లోన్స్ అడ్డగోలుగా పెరుగుతోన్న క్రమంలో వీటన్నింటికీ కళ్లెం వేసేందుకు నిబంధనలను మరింత కఠినతరం చేసే దిశగా ఆర్‌బిఐ చర్యలు చేపట్టబోతుంది. ఏ బ్యాంక్‌కు వెళ్లినా..ఏ ఫైనాన్షియల్ ఆఫీస్‌కు వెళ్లినా గంటలో, అరగంటలో గోల్డ్‌లోన్ ఇవ్వబడును అని తాటికాయంత అక్షరాలతో ఆకర్షణీయమయిన ప్రకటనలు కన్పిస్తాయి. లోన్ మంజూరు కావాలంటే అప్రయిజర్లే కింగ్ మేకర్లు బంగారాన్ని పరీక్షి ంచి, తూకం వేసి ఎంత రుణం ఇవ్వాలో నిర్ణయిస్తారు. అక్కడే మోసాలకు తెరలేస్తోంది. పైకం కొద్దీ లోన్ మంజూరు చేయడం. కొన్ని సార్లు గిల్టు నగలను తాకట్టు పెట్టి బ్యాంక్‌లను బురిడీ కొట్టించడం వంటి బ్యాంక్ గ్రౌండ్ ను వెరిఫై చేసుకున్నాకే రుణాలు ఇవ్వా లని బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేయ బోతుందని తెలుస్తోంది. ఇక నుంచి ఇలా బంగారం తాకట్టు పెట్టగానే అలా రుణం జారీచేయ డం ఉండదు. ఎవరు? ఏ అవస రం కోసం లోన్ తీసుకుంటున్నారు? తాకట్టు పెట్టే బంగారం వారిదేనా?

# చిన్న బ్యాంకుల్లో ఎఫ్‌డిలతో ఎక్కువ రిటర్నులు

**ముంబై, మార్చి 9:** తాజాగా చాలా బ్యాంకులు తమ ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లను తగ్గించడం ప్రారంభించినందున చాలా మంది పెట్టుబడి దారులు ఇప్పుడు మెరుగైన రాబడిని పొందడానికి ఇతర పెట్టుబడి మార్గాలను అన్వేషిస్తున్నారు. మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైన రాబడి కోసం చూస్తుం టే మీకు అనేక గొప్ప ఎంపికలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైన వడ్డీ రేట్లు పొందాలనుకుంటే, అలాగే పూర్తి లిక్విడిటీని కొనసాగించా లనుకుంటే చిన్నఫైనాన్స్ బ్యాంకులలో పొదుపు ఖాతాలు మంచి ఎంపిక కావచ్చు. ఈ బ్యాంకులు 7 శాతంవరకు వడ్డీనిఅందిస్తాయి, ఇది సాంప్రదాయ బ్యాంకుల కంటే చాలా ఎక్కువ. అయితే వీటిల్లో డిపాజిట్లపై రూ.5 లక్షల వరకు డీఐసీజీసీ ద్వారా బీమా రక్షణ కూడా ఉంటుంది. అయితే ఈ బ్యాంకుల్లో వడ్డీరేట్లు కాలానుగుణంగా మారవచ్చు. మీకు పూర్తి భద్రత, ప్రభుత్వ హామీ కావాలంటే పోస్ట్ ఆఫీస్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఉత్తమ ఎంపికలుగా ఉంటా యని నిపుణులు చెబుతు న్నారు. అలాగే ఈ స్కీమ్ ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా చేసు కోవచ్చు. ప్రభుత్వ బాండ్లు, ఆర్‌బీఐ బాండ్లు మీరు పూర్తి భద్రతతో ఎఫ్‌డీ కంటే మెరుగైన వడ్డీని కోరుకుంటే ప్రభుత్వబాండ్లు, ఆర్‌బీఐబాండ్లు సరైన ఎంపికగా ఉంటాయి. అవి చాలాకాలం పాటు స్థిరమైన రాబడిని ఇస్తాయి. ప్రభుత్వ హామీతో సురక్షి తమైన పెట్టుబడిగాఉంటుంది. ఎఫ్‌డీ కంటే మెరుగైన వడ్డీ రేటు ఉంటుంది. మీరు కొంచెం రిస్క్ తీసు కొని క్రమంతప్పకుండా ఆదాయం పొందాలనుకుంటే, డివిడెండ్ చెల్లించే బ్లూచిప్ స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడం మంచి ఎంపిక కావచ్చు. స్టాక్ ధర పెరిగితే మూలధన పెరుగు దల సాధ్యమవుతుంది. అలాగే బ్లూచిప్ కంపెనీ లు స్థిరత్వాన్ని అందిస్తాయని కాబట్టి మెరుగైనా రాబడిని పొందవచ్చు. ద్రవ్యోల్బణం నుంచి రక్షణకు బంగారాన్ని ఎల్లప్పుడూ అత్యంత నమ్మదగిన మార్గంగా పరిగణిస్తారు. మీరు భౌతిక బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా సావరిన్ బంగారు బాండ్లు స్కీమ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ద్రవ్యోల్బణం నుంచి రక్షి ంచుకోవడానికి బంగారంపై పెట్టుబడి అద్భుతమైన మార్గంగా ఉంటుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లు, బాండ్లలో నిల్వకు ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు.



# వాణిజ్యం

# కార్ల కొనుగోలులో మహిళలే ఎక్కువ..

**ముంబై, మార్చి 9:** ఇటీవల విడుదలైన ఓ నివేదిక ప్రకారం, కార్లను కొనుగోలు చేస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. దీనిలో ప్రతి ఏటా గణనీయమైన ప్రగతి నమోదవుతుంది. మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వివరాలు తెలుసుకుందాం. ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న మహిళలందరూ తమ అవసరాలకు అనుగుణంగా కార్లను కొనుగోలు చేస్తున్నారు. ఆటోమోటివ్ రంగం ఇటీవల వెల్లడించిన ఈ లెక్కలు వారి పురోగతికి నిదర్శనంగా నిలుస్తు న్నాయి. ఆ ప్రకారం, 2013లో మొత్తం కస్టమర్ డేటా బేస్ లో మహిళలు 16 శాతంగా ఉన్నారు. 2024లో వారి సంఖ్య 26 శాతానికి పెరిగింది. అలాగే 2025లో 46 శాతా నికి చేరుకోవడం గమ నార్హం. నివేదికలో వెల్లడించిన లెక్కలు మహిళల విజయాలకు నిదర్శనంగా నిలుస్తున్నా యి. ఉద్యోగం, వ్యాపార రంగాల్లో వారి ఉన్నతిని సూచిస్తున్నాయి. సాధారణంగా వేగంగా పనులు చేసుకోవడం, సమయానికి కార్యాలయానికి వెళ్లడం, వివిధ ప్రాంతాలకు ప్రయాణించడానికి కార్లను కొనుగోలు చేస్తారు. నేడు ఆధునిక మహిళలు కూడా ఈ అవసరాలకే కార్లను కొనుగోలు చేస్తున్నారు. ఆయా రంగాల్లో వారికి పెరిగిన ప్రాధాన్యతను ఇది తెలియ జేస్తోంది. అలాగే కార్ల పరిశ్రమకు కొత్త విశ్వాసాన్ని తీసుకువస్తోంది. మహిళలు ఏ కార్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారనే విషయాన్ని కూడా నివేదిక వెల్లడించింది. దాని ప్రకారం సుమారు 60 శాతం మంది ఆటోమేటిక్ హ్యాచ్ బ్యాక్ లపై ఆసక్తి చూపుతు న్నారు. వీటిని వినియోగించడం చాలా సులభంగా ఉండడంతో వాటిపైకి మొగ్గు చూపుతున్నారు. అలాగే కాంపాక్ట్ ఎస్ యూవీలను 18 శాతం మహిళలు



ఎంపిక చేసుకుంటున్నారు. వీరు ఎక్కువగా ఇష్టపడు తున్న మోడళ్లలో రెనాల్ట్ క్విడ్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, మారుతీ సుజుకీ స్విఫ్ట్ ప్రముఖంగా ఉంటున్నా యి. ఢిల్లీ-ఎన్సీఆర్‌లో అత్యధికంగా మహిళలు కార్లను కొనుగోలు చేస్తున్నారు. అక్కడ దాదాపు 48 శాతం వీరే ఉన్నారు. ఆ తర్వాత ముంబై 46 శాతం, బెంగ ళూరు 41శాతం, పుణెలో 39 శాతం మంది ఉన్నారు. అలాగే లక్నో, జైపూర్ వంటి నాన్ మెట్రో నగరాల్లో కూడా మహిళా కొనుగోలు దారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అక్కడ దాదాపు 20 శాతం వరకూ ఉంటున్నారు. కార్ల కొనుగోలు చేసే వారిలే 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వారే ఎక్కువగా ఉంటున్నారు.

# డిపాజిట్లపై బీమా పెంచితే బ్యాంకులపై ప్రభావం

**ముంబై, మార్చి 9:** డిపాజిట్లపై బీమా పరిమితిని రూ.5లక్షలకు మించి పెంచితే అది బ్యాంకుల లాభదాయకతపై ప్రభావం చూపిస్తుందని రేటింగ్‌ఏజెన్సీ ఇక్రాతెలిపింది. దీనివల్ల సుమారు రూ.12వేలకోట్ల మేర లాభం తగ్గిపోవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం ఒకబ్యాంకు పరిధిలో ఒక కస్టమర్ పేరిట రూ.5లక్షల బీమా సదుపా యాన్ని డిఐసిజిసి అందిస్తోంది. ఇందుకుగాను బ్యాంకులు డిపాజిట్ల మొత్తంపై డిఐసిజిసికి ప్రీమియం చెల్లిస్తుంటా యి. రూ.5లక్షలకు మించి పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు కేంద్రఆర్థిక సేవల కార్య దర్శి నాగరాజు ఇటీవలే ప్రకటించడం విశేషం. ప్రభుత్వం ఆమోదంతెలిపితే, నోటిఫై చేస్తామని చెప్పారు. ఇటీవల ఓ కోపరేటివ్ బ్యాంకు వైఫ ల్యం నేపథ్యంలో డిపాజిట్ ఇన్సూరెన్స్ పరిమితి పెంపు చర్చకు వచ్చింది. ఇది బ్యాంకులపై స్వల్పస్థాయిలోనే అయినా, చెప్పుకోదగ్గ మేర లాభదాయకతపై ప్రభావం చూపించనుంది అని ఇక్రా ఫైనాన్షియల్ రంగం రేటింగ్స్ హెడ్ సచిన్ సచ్‌దేవ పేర్కొన్నారు. పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంకు వైఫల్యంతో చివరిగా 2020 ఫిబ్రవరిలో డిపాజిట్‌పై బీమాను రూ.లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. 2024 మార్చి నాటికి 97.8శాతం బ్యాంకు ఖాతాలు బీమారక్షణ పరిధిలో ఉన్నట్లు ఇక్రా తెలిపింది. ఈ ఖాతాల్లోని డిపాజిట్ల మొత్తం రూ.5లక్షల్లోపే ఉన్నట్లు పేర్కొంది. ఇన్సూర్డ్ డిపాజిట్ రేషియో 43.1 శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఈ ఐడిఆర్‌ను 47శాతం నుంచి 66.5శాతానికి తీసుకెళితే, అప్పుడు బ్యాంకుల నికర లాభం రూ.1800 కోట్ల నుంచి రూ.12వేల కోట్ల మేర ప్రభావితమవుతుందన్నారు.



# రక్షిత రుణాలతో మరిన్ని ప్రయోజనాలు

**ముంబై, మార్చి 9:** సెక్యూర్డ్ రుణాలు (సురక్షి త) పొందటానికి ఇల్లు, ఆభరణాలు, భూమి, వాహనం..ఇలా ఏదో ఒకదాన్ని రుణగ్రహీత తాకట్టు పెట్టాలి. తాకట్టు పెట్టిన ఆస్తికి అనుగుణంగా రుణం మంజూరు చేస్తారు. ప్రతి నెలా వాయిదాల రూపంలో రుణాన్ని వడ్డీతో సహా చెల్లించవచ్చు. వీటిని బ్యాంకులు చాలా త్వరగా, తక్కువ వడ్డీకే మంజూరు చేస్తాయి. ఒక వేళ రుణగ్రహీత వాయిదాలు చెల్లించకపోతే తాకట్టు పెట్టిన ఆస్తిని స్వాధీనం చేసుకునే వీలుంటుంది. అన్ సెక్యూర్డ్ రుణాలు అంటే వ్యక్తిగత రుణాలు. మీకు వచ్చే ఆదాయం, క్రెడిట్ స్కోర్ ఆధారంగా మంజూరు చేస్తారు. వీటి కోసం ఎటువంటి పూచీకత్తు, ఆస్తితాకట్టు పెట్టనవసరం లేదు. కానీ వడ్డీ ఎక్కువ ఉంటుంది.

ఇంటిని పూచీకత్తుగా ఉంచి తనఖా రుణాలు తీసు కుంటారు. ఆస్తి కొనుగోలు చేయడానికి, ఇంటి మరమ్మతులు తది తర అవసరాలకు ఈ రుణాలు మంజూరు చేస్తారు. కార్లు, బైక్‌లు, వాణిజ్య వాహనాలను కొనుగోలు చేయడానికి బ్యాంకులు రుణాలు ఇస్తాయి. ఈ సమయంలో వాహనం పూచీకత్తుగా మారుతుంది. వాయిదాలు కట్టకపోతే వాహనాన్ని జప్తు చేస్తారు. భూమి తదితర వాటిని తాకట్టు పెట్టి తీసుకునే వాటిని ఆస్తిపై రుణాలు అంటారు. వీటికి మీ భూమి పూచీకత్తుగా ఉంటుంది. బంగారు ఆభరణాలు, నాణేలను



తాకట్టు పెట్టి బంగారం రుణాలను తీసుకుంటారు. వీటిని స్వల్ప కాలిక రుణాలని పిలుస్తారు. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకున్న రుణాలు, ఆభరణాలు, వాహనాలు, ఆస్తుల ద్వారా వీటిని మంజూరు చేస్తారు. వ్యాపారాల కోసం అందించే రుణాలను సెక్యూర్డ్ బిజి నెస్ లోన్లుఅంటారు. యంత్రాలు తదితర వాటిని పూచీ కత్తుగా భావిస్తారు. పొదుపు ఖాతా, స్థిర డిపాజిట్లు ఉన్నవారికి వీటిని మంజూరు చేస్తారు. సెక్యూర్డ్ లోన్లు తీసుకునే వారు 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు కలిగిఉండాలి. భారత దేశ నివాసిఅయి ఉండాలి. ఉద్యో గస్తులు, స్వయం ఉపాధి పొందేవారు, ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్వోలు, రైతులు అర్హులు. కనీసం వార్షిక ఆదాయం రూ.3 లక్షలు ఉండాలి. అయితే రుణదాతను బట్టి ఈ నిబంధన మారుతుంది. రుణానికి సరిపడే ఆస్తులు కలిగి ఉండాలి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps